

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 341

శనివారం 3-3-2018

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నవజ్యోత్ కౌర్ చరిత్ర

ఆసియా రెజ్లింగ్‌లో స్వర్ణం నెగ్గిన తొలి భారత మహిళా రెజ్లర్ -స్పోర్ట్స్‌లో



లక్ష్యం... ఒలింపిక్స్!

ప్రపంచకప్ పతకంతో గుర్తింపు వచ్చింది: జిమ్నాస్ట్ అరుణారెడ్డి -స్పోర్ట్స్‌లో

తడపలగుట్టల్లో తుపాకుల మోత



తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

పది మంది మావోయిస్టులు..

ఓ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి

మృతుల్లో అగ్రనేతలు హరిభూషణ్, బడే చొక్కారావు ఉన్నట్టు అనుమానాలు

గోపన్న, కంకణాల రాజిరెడ్డి పేర్లు కూడా

మరణించిన వారిలో హరిభూషణ్ భార్య సమ్మక్క సహా ఆరుగురు మహిళలు

- ధ్రువీకరించని పోలీసు వర్గాలు.. భద్రాచలం ఆస్పత్రికి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాల తరలింపు
- పక్కా సమాచారంతో స్కెచ్ వేసిన తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- డ్రోన్ల సాయంతో మావోయిస్టుల కదలికల గుర్తింపు
- రాత్రే చుట్టుముట్టి.. తెల్లారిన తర్వాత మెరుపుదాడి



హరిభూషణ్



సమ్మక్క

పెద్ద తలలే టార్గెట్!

మావో అగ్రనేతలపై పోలీసుల గురి

- వివరాలు 2లో

సాక్షి ప్రతినిధి, వరంగల్/హైదరాబాద్/భద్రాచలం

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అటవీప్రాంతం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. శుక్రవారం ఉదయం 6 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం తిప్పాపురం సమీపంలోని తడపలగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో పది మంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ చనిపోయారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు హరిభూషణ్ అలియాస్ యాప నారాయణ, ఆయన భార్య సమ్మక్క, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, కొయ్యాడ గోపన్న అలియాస్ సాంబయ్య అలియాస్ ఆజాద్, కంకణాల రాజిరెడ్డి ఉన్నట్లు అనుమానిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరణించిన గ్రేహౌండ్స్ జవాన్ సుశీల్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టారు.

రాత్రే చుట్టుముట్టిన పోలీసులు

ఎన్‌కౌంటర్ ప్రాంతం ఛత్తీస్‌గఢ్‌లోని పూజారి కాంకేడ్ సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. మావోయిస్టులు విడిది చేసిన ప్రదేశానికి సంబంధించి పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసినట్లు తెలుస్తోంది. రాత్రి సమయంలో మావోయిస్టుల బస ప్రాంతాన్ని చుట్టుముట్టిన పోలీసులు ఉదయం మెరుపుదాడికి దిగినట్లు సమాచారం. మావోయిస్టు మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మరణించిన జవాన్‌తో పాటు ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను ఉదయం 10 గంటల సమయంలో

మిగతా 2వ పేజీలో ▶



కేసీఆర్ నేతృత్వంలో 'ఫెడరల్ ఫ్రంట్'!

జాతీయ రాజకీయాలపై టీఆర్‌ఎస్ అధినేత దృష్టి

- రాష్ట్రాలపై కేంద్రం పెత్తనాన్ని నిలదీయాలని నిర్ణయం
- సమాఖ్య స్ఫూర్తి, రైతాంగ సమస్యలే ఎజెండాగా ముందుకు..
- మూడో ఫ్రంట్ కోసం ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు
- శిబూసోరేన్, స్టాలిన్, అఖిలేశ్ తదితరులతో చర్చలు
- ఇటీవలి ఢిల్లీ పర్యటన లోగుట్టు ఇదే!
- బీజేపీ, కాంగ్రెస్‌పై దాడి కూడా ఆ వ్యూహంలో భాగమే

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జాతీయ రాజకీయాలపై దృష్టి సారించారా.. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారా.. ఆ దిశగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీల అధినేతలతో సంప్రదింపులు జరుపుతున్నారా!? ఈ ప్రశ్నలకు ఔననే సమాధానాలు వస్తున్నాయి. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకునే లక్ష్యంతో.. 'ఫెడరల్ ఫ్రంట్'పేరిట మూడో ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలని కేసీఆర్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా బీజేపీకి ఆదరణ తగ్గుతోందని, అటు కాంగ్రెస్ బలం కూడా పెరగడం లేదని ఆయన అంచనాకు వచ్చినట్టు సమాచారం. దీనిపై దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేసి, ఒక అంచనాకు రావడానికి.. కేసీఆర్ ఇటీవలి ఢిల్లీ పర్యటనను ఉపయోగించుకున్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు, కొందరు సీనియర్ రాజకీయ నేతలతోనూ కేసీఆర్ ఢిల్లీలో చర్చించినట్టు సమాచారం. ప్రాంతీయ పార్టీలు ఏకమై, బలోపేతమైతే జాతీయ స్థాయిలో పట్టుచిక్కుతుందని ఆయన అభిప్రాయపడుతున్నట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగానే కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని.. ఇటీవల బీజేపీ, కాంగ్రెస్‌లపై విమర్శలందులో భాగమేనని చెబుతున్నారు.

ప్రాంతీయ పార్టీల అగ్రనేతలతో చర్చలు

జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టిన కేసీఆర్.. దేశవ్యాప్తంగా ఉన్న మిగతా 2వ పేజీలో ▶

'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజపడుగులో అద్దె వాహనంలో నీరు తెచ్చుకుంటున్న మహిళలు

కన్నీటి గోస

వేసవి ఆరంభంలోనే రాష్ట్రవ్యాప్తంగా నీటి ఎద్దడి

- అడుగంటిన భూగర్భ జలాలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణం
- వందలాది గ్రామాల్లో తాగునీటికీ కటకట
- పనిచేయని మంచినీటి పథకాలు
- చాలా చోట్ల వ్యవసాయ బావులు, బోర్లే దిక్కు
- కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న జనం.. ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టని సర్కారు

12లో

పాత జిల్లా	నీటి మట్టం	డేంజర్ జోన్ గ్రామాలు
ఆదిలాబాద్	9.05	130
కరీంనగర్	16.00	92
నిజామాబాద్	13.88	188
వరంగల్	9.60	213
ఖమ్మం	10.92	32
రంగారెడ్డి	13.73	100
మహబూబ్‌నగర్	9.79	177
మెదక్	12.16	103
నల్లగొండ	11.45	163

(భూగర్భ జలమట్టాలు మీటర్ల లోతులో..)

అరకొర వేతనాలు.. భద్రతలేని బతుకులు

వృత్తి విద్య కాలేజీల్లో ఫ్యాకల్టీ కష్టాలు

- కొద్దినెలలుగా వేతనాలు అందని దుస్థితి.. 'ఫీజు' బకాయిలు రాకపోవడమే కారణమంటున్న యాజమాన్యాలు
- అధిక వేతనాలు ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకుంటున్న వైనం
- ఫ్యాకల్టీ-విద్యార్థుల నిష్పత్తిని ఏఐసీటీఈ తగ్గించడంతో కొత్త సమస్య.. వేలాది ఉద్యోగుల మెడపై వేలాడుతున్న తొలగింపు కత్తి

-వివరాలు 6లో



నేడే 'ఈశాన్య' ఫలితాలు

- ఉదయం 8 గంటలకు ప్రారంభంకానున్న త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల ఓట్ల లెక్కింపు -5లో

ఫ్యామిలీలో...

ఆంబోతులూరు

పచ్చని పైరును ఆంబోతులు మేయడానికొస్తే చేనేం చేయగలుగుతుంది?! డొక్కలెండిన కాపు ఏం చేయగలుగుతాడు? ఆ ఊళ్లో ఓ పచ్చని కుటుంబం. ఓ తల్లి, ఇద్దరు ఆడపిల్లలు. ఆ కుటుంబంపై ఊళ్లోని ఆంబోతులు కన్నేశాయి. ఇంటి మీద, ఒంటి మీద పడ్డాయి.

తర్వాత ఏం జరిగింది?

సెల్ఫీల కోసం ముక్కు... కోసుకుంటున్నారు

అమెరికాలో పెరుగుతున్న విపరీత ధోరణి

- ఇప్పుడు చాలా మందికి సెల్ఫీలు తీసుకోవడమంటే మహా సరదా. ఈ సెల్ఫీల పిచ్చి ఏ స్థాయికి వెళ్లిందంటే.. ఫొటోల్లో తమ ముక్కు పెద్దదిగా కనిపిస్తోందనీ, శస్త్రచికిత్స ద్వారా దాని పరిమాణాన్ని తగ్గించాలంటూ ప్లాస్టిక్ సర్జన్ల దగ్గరకు క్యూ కడుతున్నారు.

-వివరాలు 5లో

తడపలగుట్టల్లో తుపాకుల మోత

వరుసగా ఎదురుదెబ్బలు

మల్కన్‌గిరి తర్వాత సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొన్నేళ్లుగా వరుసగా జరిగిన ఎన్‌కౌంటర్లతో దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి తాజా ఎన్‌కౌంటర్ శరాఘాతంలా పరిణమించింది. దాదాపు ఏడాదిన్నర కింద దేశంలోనే భారీ ఎన్‌కౌంటర్ అయిన ఆంధ్రా–ఒడిశా సరిహద్దు (ఏవోబీ)ల్లో మల్కన్‌గిరి ఎన్‌కౌంటర్ జరిగింది. అందులో 26 మంది మావోయిస్టులు మరణించారు. మావోయిస్టు పార్టీగా మారకముందు, తర్వాత కూడా జరిగిన ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు.

• 1996లో ఖమ్మం జిల్లా పగిడేరు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో 16 మంది పీపుల్స్‌వార్ సభ్యులు చనిపోయారు. ఆ 16 మంది సభ్యులు కూడా కొత్తగా రిక్రూటైన వారే. వారిని ఖమ్మం జిల్లా నుంచి ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి వాహనాల్లో తీసుకెళుతుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని కాల్చి చంపినట్టు ఆరోపణలు వచ్చాయి. 1998లో ఒడిశాలో పీపుల్స్‌వార్ ప్లీనరీపై పోలీసులు దాడి చేసిన ఎన్‌కౌంటర్‌లో 17 మంది నక్సలైట్లు మరణించారు. అందులో నలుగురు కేంద్ర కమిటీ స్థాయి నాయకులున్నారు. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుర్ర చిన్నన్న ఎన్‌కౌంటర్ జరిగిన నల్లమల ఘటనలో 11 మంది మరణించారు. వరంగల్ జిల్లా కొకొండ ఘటనలో సుధాకర్ సహా 9 మంది, కరీంనగర్ జిల్లా అచ్చంపల్లిలో రామన్నతో పాటు 12 మంది, పాలకుర్తిలో 9 మంది, సింహాచలం కొండల్లో ఓబులేసు సహా 14 మంది, ఎర్రగుంటపాలెంలో సుదర్శన్‌తోపాటు 12 మంది, నల్లమల సున్నిపెంటలో మట్టు శ్రీధర్ సహా 11 మంది, గాజుల సర్వాపూర్‌లో సిటీ ప్రభాకర్‌తోపాటు 13 మంది, మానాలలో రమేశ్‌తోపాటు 12 మంది, నేరెళ్ల పద్మక్క ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు.. ఇలా పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇవేగాకుండా ఇద్దరి నుంచి ఐదారుగురి వరకు మావోయిస్టులు, ముఖ్య నాయకులు మృతిచెందిన ఎన్‌కౌంటర్లు ఎన్నో ఉన్నాయి.

హరిభూషణ్: దళ సభ్యుడి నుంచి కార్యదర్శి దాకా..



మృతి చెందిన మావోయిస్టులు

గంగారం(ములుగు): మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడగూడెం గ్రామానికి చెందిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. 1985 నుంచి 90 మధ్య కొత్తగూడ, ఇల్లందు, గుండాల ఏజెన్సీ ప్రాంతాలన్ని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధిపత్యంలో ఉండేవి. ఆ సమయంలో ఈయన వరంగల్‌లో డిగ్రీ చదివేవాడు. తర్వాత కొన్నాళ్లు ఎల్‌ఐసీ ఏజెంట్‌గా, ఐటీడీఏ మైనర్ ఇరిగేషన్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాడు. విద్యార్థిగా రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) సిద్ధాంతాలకు ఆకర్షితుడై అన్యాయాలను ఎదిరించడం మొదలుపెట్టాడు. తన ప్రాణ స్నేహితుడు రాజంకోటిని ఎన్డీ దళాలు కిడ్నాప్ చేసి ఆచూకీ తెలియకుండ చేయడంతో నారాయణ పీపుల్స్‌వార్ దళంలోకి వెళ్లాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు న్యూడెమోక్రసీ విధానాలను ప్రశ్నిస్తున్నాడు. ఒక దశలో న్యూడెమోక్రసీ దళాలకు నిద్ర లేకుండా చేశాడు. దళ సభ్యుడి స్థాయి నుంచి మిల్ట్రీ ప్లాటూన్ శిక్షణ కమాండర్‌గా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు.

దళ సభ్యురాలితో వివాహం : యాప నారాయణ కొత్తగూడ ఏరియా దళ నాయకుడిగా పనిచేసే సమయంలో 1992లో దళ సభ్యురాలిగా ఉన్న జెజ్జరి సమ్మక్క అలియాస్ శారదను దళంలోనే వివాహం చేసుకున్నాడు. 2012లో ఆమె జనజీవన స్రవంతిలోకి కలిసింది. అయితే మళ్లీ దళంలోకి రావాలని, లేదంటే విడాకులు ఇవ్వాలని హరిభూషణ్ లేఖ రాయడంతో 2014లో మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లింది.

బడే చొక్కారావు: పెదనాన్న కొడుకు ప్రభావంతో: ఎస్‌ఎస్ తాడ్వాయి: కేకేడబ్ల్యూ కార్యదర్శి బడే దామోదర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలంలోని కన్నాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. సెకండియర్ చదువుతున్న రోజుల్లో రాడికల్ యువజన సంఘంలో చేరాడు. దామోదర్ పెద్దనాన్న కుమారుడు బడే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ ప్రభావంతో దళసభ్యుడిగా పనిచేశాడు. ఛత్తీస్‌గఢ్‌లోని పువ్వర్తి అటవీప్రాంతంలో 2013, ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేకేడబ్ల్యూ కార్యదర్శి సుధాకర్‌తోపాటు తొమ్మిది మంది మృతిచెందడంతో కమిటీ మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని పోలీసులు భావించారు. కానీ బడే చొక్కారావు బాధ్యతలు చేపట్టాక కమిటీ పునర్నిర్మాణం జరిగింది.

గోపన్న: సుదీర్ఘ ప్రస్థానం: గోవిందరావుపేట: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సమ్మయ్య, లక్ష్మి దంపతుల రెండోకుమారుడు కొయ్యడ సాంబయ్య(45) అలియాస్ గోపన్న మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఈయనకు 1994లో గాంధీనగర్‌కు చెందిన మహిళతో వివాహమైంది. వారికి ఓ ఆడపిల్ల పుట్టి చనిపోయింది. ఈ క్రమంలో 1995లో మొద్దులగూడెం నుంచి గోపన్న దంపతులతో సహా 15 మంది ఒకేసారి పీపుల్స్‌వార్‌లో చేరారు. దళసభ్యుడిగా మూడేళ్లు, కమాండర్‌గా సంవత్సరం, ప్లాటూన్ దళ కమాండర్‌గా రెండేళ్లు పనిచేసి, ప్రస్తుతం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

మూడేళ్ల కిందట గ్రేహౌండ్స్‌లోకి సుశీల్

మోమిన్‌పేట: ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ స్వస్థలం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్. సదాశివపేటలో ఇంటర్ పూర్తి చేసుకొని.. 2004లో సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. మూడేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై గ్రేహౌండ్స్ వెళ్లారు. ఆయనకు నాలుగేళ్ల క్రితమే వివాహమైంది. ఓ కూతురు ఉంది. ఆయన తల్లి శారదాకుమారి, తండ్రి విజయ్‌కుమార్ ఉద్యోగరీత్యా కొన్నేళ్ల క్రితం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం మేకవనంపల్లికి వచ్చారు. సుశీల్‌కుమార్ తల్లి శారద ఇక్కడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించి రిటైర్‌అయ్యారు.

▶ మొదటి పేజీ తరువాయి

హెలికాప్టర్ ద్వారా భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మృతదేహాలను బట్టి వీరిని బుర్ర అలియాస్ రేణుకా, సంజీవ్‌గా భావిస్తున్నారు. కాల్పుల్లో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ బి.సుశీల్ కుమార్ మరణించగా మరో ఇద్దరు జవాన్లకు గాయాలైనట్లు సమాచారం. తెలంగాణ నుంచి జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన నాలుగు గ్రేహౌండ్స్ దళాలు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నట్లు సమాచారం.



ఎన్‌కౌంటర్ జరిగిన తడపల గుట్ట




ఎన్‌కౌంటర్ సమీప ప్రాంతంలో పోలీసు బలగాలు

మృతుల్లో అగ్రనేతలు!

ఎన్‌కౌంటర్‌లో మరణించిన పది మంది మావోయిస్టులు ఎవరన్నది శనివారం రాత్రి వరకు పోలీసులు వెల్లడించలేదు. మృతుల్లో రాష్ట్ర కమిటీ కార్యదర్శి హరిభూషణ్ (మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని మడగూడెం), రాష్ట్ర కమిటీ సభ్యుడు బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం కాల్వపల్లి), ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి కొయ్యడ గోపన్న అలియాస్ ఆజాద్ (జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొద్దులగూడెం)తో పాటు కేకేడబ్ల్యూ డివిజన్ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి (కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట) ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై పోలీసుల నుంచి స్పష్టత రాలేదు. చనిపోయిన ఆరుగురు మహిళా మావోయిస్టుల్లో హరిభూషణ్ భార్య ఉన్నట్లు సమాచారం. మరోవైపు హరిభూషణ్ బంధువులు భద్రాచలం ఆస్పత్రిలో ఇద్దరి మృతదేహాలను చూసి.. అందులో అతడు లేడని నిర్ధారణకు వచ్చారు. మిగతా మృతదేహాలు వస్తే తప్ప చెప్పలేమన్నారు. ఎన్‌కౌంటర్ నుంచి హరిభూషణ్ తప్పించుకున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి కానీ పోలీసులు దాన్ని ధ్రువీకరించడం లేదు. ఘటనా స్థలంలో ఏకే 47, ఇన్సాస్ రైఫిల్స్ 5, ఓ ఎస్‌ఎల్‌ఆర్ , రెండు సింగిల్ బోర్ రైఫిళ్లు, ఒక 303 తుపాకీ, ఒక పిస్టోల్, ఒక సోనీ రేడియో, మూడు క్లెమోర్ మైన్స్, ఆరు రాకెట్ బాంబులు, రెండు సోలార్ ప్లేట్స్, రూ.41,000 నగదు, విప్లవ సాహిత్యం లభించాయి. ఏకే 47 ఆయుధం లభించడంతో అగ్రనేత ఎవరైనా ఎన్‌కౌంటర్‌లో మృతి చెంది ఉంటారని అనుమానిస్తున్నారు.

డ్రోన్లను రంగంలోకి దింపారా?

24 నిమిషాల పాటు గాల్లో ఉంటూ 7 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అత్యాధునిక టెక్నాలజీ కల్గిన డ్రోన్లను గ్రేహౌండ్స్ బలగాలు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో రంగంలోకి దించారు. 2.5 కిలోమీటర్ల పై నుంచి 24 మెగాపిక్సల్ ఫొటోలు, వీడియోలు తీసే కెపాసిటీ ఉన్న ఈ డ్రోన్ల సహాయంతో మావోయిస్టుల కదలికలను గుర్తించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.



గోపన్న



కానిస్టేబుల్ సుశీల్

ఇటీవల పెరిగిన అలజడి

ఇటీవల ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులో మావోయిస్టుల అలజడి పెరిగింది. మావోయిస్టులు అమర్చిన బాంబులను పోలీసులు ఐదుసార్లు నిర్వీర్యం చేశారు. ఏడాది వ్యవధిలో వెంకటాపురం మండలం పరిధిలో మావోయిస్టులు నాలుగుసార్లు వాల్ పోస్టర్లు వేశారు. ఫిబ్రవరి 4న వెంకటాపురం మండలం వెదిర గ్రామంలో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్ పేల్చి వేశారు. అంతకు ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో జనవరి 26న దాడి చేసి వాహనాలు దగ్ధం చేశారు. ఈ ప్రాంతంలో హరిభూషణ్ పార్టీ కార్యకలాపాలను, రిక్రూట్‌మెంట్ భారీ స్థాయిలో నిర్వహిస్తున్నాడు. మావోయిస్టు పార్టీ గతేడాది నవంబర్ నుంచి పినపాక, చర్ల, వాజేడు, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో 500 మందికిపైగా రిక్రూట్‌మెంట్ చేసినట్టు తెలిసింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ పెరిగింది. సరిహద్దు అడవులను అనువుగా మార్చుకుని తెలంగాణలో ప్రభావం చూపేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారనే సమాచారం పోలీసులకు ఉంది. దీనికితోడు ఐదు రోజుల కిందట ఐదుగురు సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరి వద్ద నుంచి రాబట్టిన సమాచారంతో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది.

మృతులపై స్పష్టత రావాల్సి ఉంది



ఛత్తీస్‌గఢ్‌లోని పూసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు కూంబింగ్‌కు వెళ్లినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కాంకేర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు బస చేశారని తెలియటంతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్‌ను నిర్వహించామన్నారు. మావోయిస్టులు తమపై కాల్పులు జరిపారని ప్రతిగా పోలీసులు కూడా కాల్పులు జరిపారన్నారు. కొందరు మావోయిస్టులు తప్పించుకుపోవడంతో ఇంకా ఆపరేషన్ జరుగుతోందన్నారు. ఇద్దరు మావోయిస్టులు, ఒక కానిస్టేబుల్ మృతదేహాన్ని భద్రాచలం ఆసుపత్రికి తరలించామని, మిగిలిన మృత దేహాలను శనివారం తీసుకొస్తామన్నారు. ఘటన జరిగిన స్థలం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తున్నందున కేసును అక్కడికి బదిలీ చేస్తామన్నారు.

– ఎస్పీ కిశోర్ ఝా

మృతదేహాలను కుళ్లబెడతారా?



ఎన్‌కౌంటర్ మృతదేహాలను సకాలంలో బంధువులకు అప్పగించకపోవటం సరికాదని మావోయిస్టు అగ్రనేత హరిభూషణ్ సోదరి యాప భారతి అన్నారు. హరిభూషణ్ మృతి చెందారన్న ప్రచారం నేపథ్యంలో తమ్ముడు అశోక్‌తో కలసి ఆమె మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మడగూడెం నుంచి శుక్రవారం భద్రాచలం వచ్చారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి ఆవేదనతో వచ్చామని, కానీ మృతదేహాలను తరలించటంలో అధికారులు ఇలా వ్యవహరించటం సరైంది కాదన్నారు. చంపేసిన రెండు రోజులకు శవాలను కుళ్లబెట్టి వాటిని బంధువులకు అప్పగిస్తారా అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ''మృతుల్లో అన్నయ్య లేడనే అనుకుంటున్నాం. లేకపోతే బాగుంటుందని ఆశ పడుతున్నాం. నాలుగో తరగతి చదువుతున్నప్పుడు ఎత్తుకొని జోలపాడిన గుర్తులే తప్ప.. అప్పట్నుంచి ఇప్పటి వరకూ ఎలా ఉంటాడో కూడా తెలియదు'' అన్నారు.

– హరిభూషణ్ సోదరి భారతి

ఫోరెన్సిక్ డాక్టర్‌తో పోస్టుమార్టం చేయించండి

తొండపాల ఎన్‌కౌంటర్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని తొండపాల అటవీ ప్రాంతంలో శుక్రవారం ఎన్‌కౌంటర్‌కు సంబంధించి భద్రాచలానికి తీసుకొచ్చిన మృతదేహాలకు ఫోరెన్సిక్ డాక్టర్‌తో పోస్టుమార్టం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ పోస్టుమార్టం మొత్తాన్ని వీడియో తీయాలని, అనంతరం ఆ మృతదేహాలను మృతుల కుటుంబీకులకు అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తొండపాల అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఐపీసీ సెక్షన్ 302 కింద కేసు నమోదు చేయడంతోపాటు మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రి నుంచి వరంగల్ ఎంజీఎం లేదా ఉస్మానియా ఆసుపత్రికి తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పౌర హక్కుల కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా దాఖలు చేసిన వ్యాజ్యంపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రఘునాథ్ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. మీ సమయంలో అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచంద్రరావు జోక్యం చేసుకుంటూ, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం ఛత్తీస్‌గఢ్ పరిధిలోకి వస్తుందని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునే న్యాయ పరిధి ఈ హైకోర్టుకు లేదని వివరించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఓ మావోయిస్టు, ఓ పోలీసు మృతదేహాలను భద్రాచలం తీసుకొచ్చారని రఘునాథ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మృతుల్లో ఇప్పటి వరకు ఇద్దరిని గుర్తించడం జరిగిందని, ఆ రెండు మృతదేహాలను ఛత్తీస్‌గఢ్ పోలీసుల విన్నపం మేరకు భద్రతా కారణాలరీత్యా పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని రామచంద్రరావు వివరించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, భద్రాచలం ఈ హైకోర్టు న్యాయపరిధిలోకి వస్తుంది కాబట్టి, ఆ రెండు మృతదేహాల విషయంలో జోక్యం చేసుకునే పరిధి తమకు ఉందని స్పష్టం చేసింది. మృతుల్లో ఎంత మంది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు ఉన్నారని ధర్మాసనం ప్రశ్నించగా, హరిభూషణ్ తెలంగాణ వ్యక్తేనని రఘునాథ్ చెప్పారు. భద్రాచలం ఆసుపత్రిలో ఫోరెన్సిక్ డాక్టర్లు లేరని, అందుకే ఎంజీఎంకి తరలించాలని కోరుతున్నామన్నారు. భద్రాచలం ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలున్నాయని, అందుకే ఆ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అక్కడకు తీసుకురావడం జరిగిందని అదనపు ఏజీ చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం, భద్రాచలం తీసుకొచ్చిన మృతదేహాలకు ఫోరెన్సిక్ డాక్టర్‌తో పోస్టుమార్టం చేయించాలని పోలీసులను ఆదేశించింది. ఈ ప్రక్రియను వీడియో తీశాక, మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించాలని ఆదేశించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో ఎవరి మృతదేహాన్నైనా తెలంగాణ ప్రాంత పరిధిలోకి తీసుకొస్తే, ఆ మృతదేహాల విషయంలోనూ ఇదే ప్రక్రియను అనుసరించాలని ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

'చర్ల ఎన్‌కౌంటర్'పై సిట్టింగ్ జడ్జితో విచారణ

- పోలీసులపై 302 కింద కేసు నమోదు చేయాలి
- విరసం నేత వరవరరావు డిమాండ్



హైదరాబాద్: చర్ల వెంకటాపురం మండలం, ఆలపాడు అటవీ ప్రాంతం, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయాలని విరసం నేత వరవరరావు డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్‌కౌంటర్ కేసీఆర్ ఫాసిస్టు పాలనకు పరాకాష్ట అన్నారు. 12 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసు అధికారులపై సెక్షన్ 302 కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారికి ఫోరెన్సిక్ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించాలని, మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో పోలీస్ క్యాంపును ఎత్తివేయాలని, గ్రేహౌండ్స్ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ అధ్యక్షుడు నలమాస కృష్ణ, ప్రధాన కార్యదర్శి మెంచు రమేశ్, ప్రొ.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద తలలే టార్గెట్!

మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శులు, అగ్రనేతలపై పోలీసుల గురి

పెద్దపల్లి: మావోయిస్టు పార్టీని బలహీనం చేసేందుకు పోలీసుశాఖ పెద్ద తలలపైనే గురి పెట్టింది. సాధారణ మిలిటెంట్ల కంటే.. రాష్ట్ర కార్యదర్శులు, అగ్రనేతలను టార్గెట్ చేసింది. అందులో భాగంగా మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ అలియాస్ యాప నారాయణపై గురిపెట్టింది. తాజాగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో తడపలగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందినట్లు ప్రచారం జరుగుతోంది. అసలు పీపుల్స్‌వార్‌గా ఉన్నప్పుడు, మావోయిస్టు పార్టీగా మారిన తర్వాత కలిపి.. 1979 నుంచి ఇప్పటివరకు 12 మంది రాష్ట్ర కార్యదర్శులుగా పనిచేశారు. అందులో ముగ్గురు మినహా అందరూ ఎన్‌కౌంటర్లలోనే మరణించారు. కొందరు రాష్ట్ర కార్యదర్శులుగా ఉండగా.. మరికొందరు కేంద్ర కమిటీ సభ్యులుగా ఎదిగాక తూటాలకు బలయ్యారు.

వరుసగా పెద్దలంతా..

పీపుల్స్‌వార్ ప్రారంభమైన తొలినాళ్లలో పెద్దపల్లికి చెందిన మల్లోజుల కోటేశ్వర్‌రావు ప్రహ్లాద్ పేరిట రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగారు. తర్వాత 1985లో రఘు పేరిట నల్లా ఆదిరెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ.. హైదరాబాద్‌లో అరెస్టయ్యారు. ఆ స్థానంలో ఇన్‌చార్జి రాష్ట్రకార్యదర్శిగా ప్రస్తుత కేంద్ర కమిటీ కార్యదర్శి గణపతి కొంతకాలం ఉన్నారు. అయితే నల్లా ఆదిరెడ్డి ఆదిలాబాద్ జైలు నుంచి తప్పించుకుని వెళ్లి.. తిరిగి రాష్ట్ర కార్యదర్శిగా 1989 వరకు పనిచేశారు. నల్లా ఆదిరెడ్డి, గణపతిలు కేంద్ర కమిటీకి వెళ్లిన తర్వాత పులి అంజయ్య రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తూ.. ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. తర్వాత నియమితులైన ఎర్రం సంతోష్‌రెడ్డి.. కేంద్ర కమిటీ సభ్యుడు నల్లా ఆదిరెడ్డి, ఉత్తర తెలంగాణ కమిటీ సెక్రెటరీ శీలం నరేశ్‌లు 1999లో మంథని ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. దాంతో పీపుల్స్‌వార్ పార్టీకి తొలిసారిగా భారీ నష్టం జరిగింది. తెలంగాణ మైదాన, దండకారణ్యంలో ప్రభావం చూపించగల ముగ్గురు నాయకులు ఒకేసారి మృతి చెందడాన్ని పార్టీ జీర్ణించుకోలేకపోయింది.

వేర్వేరు కమిటీలుగా నియమించినా..

1999 ఎన్‌కౌంటర్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు వేరుగా రెండు రాష్ట్రాల కమిటీలను పీపుల్స్‌వార్ నియమించింది. ఏపీ కమిటీకి నియమించిన చింతల వెంకటస్వామి ఎన్‌కౌంటర్ కావడంతో ఆ స్థానంలో బుర్ర చిన్నన్న అలియాస్ మాధవ్‌కు, తెలంగాణ రాష్ట్ర కమిటీకి పుల్లూరి ప్రసాద్ అలియాస్ చంద్రన్నకు బాధ్యతలు అప్పగించారు. బుర్ర చిన్నన్న కూడా ఎన్‌కౌంటర్ కాగా.. తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సాంబశివుడు పోలీసులకు లొంగిపోయారు. కదారి రాములు, ఓబులేసులు సైతం ఏపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శులుగా పనిచేస్తూ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. మరోవైపు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీకి జంపన్న అలియాస్ జీనుగు నర్సింహారెడ్డికి బాధ్యతలు ఇచ్చారు. తెలంగాణ ఏర్పాటు వరకు కూడా చంద్రన్న, జంపన్నలే పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రాష్ట్ర మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా యాప నారాయణను నియమించారు. జగన్ అలియాస్ హరిభూషణ్‌ల పేరిట మూడున్నరేళ్లకుపైగా కొనసాగుతున్నారు. తాజా ఎన్‌కౌంటర్‌లో ఆయన మరణించినట్లు ప్రచారం జరుగుతోంది.

న్యాయ విచారణ జరిపించాలి: చాడ

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్–భద్రాచలం సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని గోప్యంగా ఉంచడం, మీడియాను అనుమతించకపోవడం, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాల నిరంకుశ, నియంతృత్వ విధానాలకు నిదర్శనమన్నారు.

సుప్రీం జడ్జితో విచారణ

సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ చంద్రన్న

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేసీఆర్ నేతృత్వంలో 'ఫెడరల్ ఫ్రంట్'!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంతీయ పార్టీల నేతలతో సంప్రదింపులు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచే దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీల అగ్రనేతలతో కేసీఆర్‌కు సత్సంబంధాలున్నాయి. సంప్రదింపుల సందర్భంగా వారు కూడా సానుకూలంగానే స్పందిస్తున్నట్టు తెలుస్తోంది. జేఎంఎం అధినేత శిబూసోరేన్, తమిళనాడులో డీఎంకే నేత స్టాలిన్, ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి (జేడీఎస్) వంటి వారితో ప్రాథమికంగా సంప్రదింపులు జరిగినట్టు తెలుస్తోంది. మరిన్ని ప్రాంతీయ పార్టీల ముఖ్యులతోనూ కేసీఆర్ ఫోన్‌లో సంప్రదింపుల్లో ఉన్నట్టు సమాచారం. వారంతా మూడో ఫ్రంట్‌పై స్పష్టమైన అభిప్రాయాలు చెప్పకున్నా.. వ్యతిరేకంగా ఎవరూ లేరని కేసీఆర్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

ఫెడరల్ స్ఫూర్తి ఎక్కడ?: రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వమే పెత్తనం చెలాయిస్తుంటే.. ఫెడరల్ స్ఫూర్తి ఎక్కడ ఉంటుందని కేసీఆర్ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రాల నుంచి వసూలవుతున్న పన్నుల్లో 42% తిరిగి రాష్ట్రాలకు ఇవ్వడం, మిగతా 58% ఆదాయాన్ని ఇష్టారాజ్యంగా కేటాయిస్తుండడంతో.. కొన్ని రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని వివాదిస్తున్నారు. దీంతో రాష్ట్రాలకు ఆర్థిక అధికారాలు లేకుండా పోతున్నాయని అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలంటే జాతీయ పార్టీల గుత్తాధిపత్యానికి గండికొట్టడమే సరైన మార్గమనే అంచనాలో కేసీఆర్ ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రాలకు అధికారాలు సాధించుకోవడం, రైతాంగ సమస్యలు వంటి నినాదాలతో దేశవ్యాప్తంగా పనిచేయడం వల్ల సానుకూల ఫలితాలుంటాయని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రాల వారీగా రాజకీయ పరిస్థితులు, అనుసరించాల్సిన వ్యూహంపై ఇంకా స్పష్టత రాకున్నా.. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో మూడో ఫ్రంట్ యోచనకు బీజం పడిందని కేసీఆర్ సన్నిహితులు వ్యాఖ్యానిస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీలపై విమర్శల పదును

జాతీయ రాజకీయాలపై దృష్టి సారించినందువల్లే బీజేపీపై, కాంగ్రెస్‌పై కేసీఆర్ విమర్శల దూకుడు పెంచినట్టు చెబుతున్నారు. ప్రధాని మోదీని, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని నేరుగా విమర్శించడం అందులో భాగమేనని.. జాతీయ పార్టీలపై తిరుగుబాటుతో తన వైఖరిని బహిర్గతం చేశారని అంటున్నారు. దేశంలో రైతు సమస్యల పరిష్కారంకోసం జరిగే పోరాటానికి, ఉద్యమానికి తెలంగాణ నాయకత్వం వహిస్తుందనే మాట కూడా జాతీయ రాజకీయాలపై కేసీఆర్ దృష్టిని తేటతెల్లం చేస్తోందని చెబుతున్నారు.



మీమీద విశ్వాసం కోల్పోయిందంటారా..?

లంచం డిమాండ్ నిజమే

జూనియర్ అసిస్టెంట్‌పై కేసు: ఏసీపీ

బెల్లంపల్లి: ఎస్సీ కార్పొరేషన్ రుణం మంజూరు కోసం లంచం డిమాండ్ చేసి దంపతుల ఆత్మహత్యకు కారణమైన జూనియర్ అసిస్టెంట్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ బాలుజాదవ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చొప్పరిపల్లి గ్రామానికి చెందిన కొండగొర్ల తిరుపతి (36) బుధవారం రాత్రి భార్య భూదేవితో పాటు తన ఇద్దరు పిల్లలకు క్రిమిసంహారక మందు తాగించి, ఆపై తాను ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. భూదేవి మృతి చెందగా, పిల్లలు ఆసుపత్రిలో కోలుకుంటున్నారు. కాగా.. తిరుపతి సూసైడ్ నోట్‌లో, ఫోన్ వాయిస్ రికార్డులో బెల్లంపల్లి మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ప్రణయ్ రూ.20 వేలు లంచం అడిగినట్లు పేర్కొన్నారు. లంచం అడగడం వల్లనే ఆ కుటుంబం అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఏసీపీ వివరించారు. తిరుపతి సెల్‌ఫోన్ సిమ్‌కార్డు, సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

కరీంనగర్ అధ్యాపకుడికి జాతీయ పురస్కారం


మహ్మద్ ఆజమ్

కరీంనగర్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈ ఏడాది జాతీయ పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన మహ్మద్ ఆజమ్ ఎంపికయ్యారని హైదరాబాద్ దళిత సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు కలిగి ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని నాలుగేళ్లుగా సేవలందిస్తున్న ఆజమ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ అవార్డును ఈనెల 15న తిరుపతిలో జరిగే సభలో ప్రదానం చేస్తారన్నారు. ఆజమ్ ప్రస్తుతం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంగ్ల విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

పర్ణశాల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బట్టిగూడేనికి చెందిన ఓ గిరిజనుడిని పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హతమార్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలానికి సమీపంలో ఉన్న బట్టిగూడెం గ్రామానికి చెందిన ఎడమ సోమయ్య(40)ను మావోయిస్టులు గత నెల 26న అర్ధరాత్రి మాట్లాడే పనిఉందని ఇంటి నుంచి తీసుకువెళ్లారు. రెండు రోజుల తరువాత గత బుధవారం ఉదయం సోమయ్య గొంతు కోసి దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని రాష్ట్ర సరిహద్దుల్లోని బట్టిగూడెం గ్రామ శివారులో పడవేశారు.

వ్యవసాయ బావిలో మొసలి



మల్లాపూర్ (కోరుట్ల): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం పాతదాంరాజుపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో శుక్రవారం మొసలి కనిపించింది. గ్రామానికి చెందిన కలికోట గంగాధర్ తన బావిలో నీటి మట్టం పరిశీలించేందుకు వెళ్లగా..మొసలి కనిపించింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు మొసలిని బయటకు తీయించి బంధించారు. అనంతరం దానిని సురక్షితంగా తీసుకెళ్లి గోదావరిలో వదలేసినట్లు ఎఫ్ఎస్‌వో సాయిప్రసాద్ తెలిపారు.

మాజీ మావోలపై కేసుల ఎత్తివేత!

జీవో నంబరు 54 ద్వారా ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్న కలెక్టర్లు

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లొంగిపోయిన మాజీ నక్సలైట్లకు కేసుల నుంచి విముక్తి కల్పిస్తున్నారు. జీవో నంబరు 54 ద్వారా జిల్లా కలెక్టర్లు ప్రొసీడింగ్‌లు జారీ చేస్తున్నారు. ఒక్క రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే 341 కేసులు ఉపసంహరణకు సిఫార్సు చేశారు. రెండు దశాబ్దాలుగా కోర్టు విచారణలో ఉంటున్న నక్సలైట్ల కేసులను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కలెక్టర్ సిఫారసు చేసిన 341 కేసుల్లో ఆయుధాలు కలిగి ఉన్న, హత్య కేసులే అధికంగా ఉన్నాయి. ఏడేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే పీఆర్‌సీ కేసుల్లో తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయి. 2012 కంటే ముందున్న కేసులను పెండింగ్‌లో ఉంచకూడదనే సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి జిల్లా కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నక్సలైట్ల కేసులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయి. లొంగిపోయిన నక్సలైట్లను అరెస్టు చేయొద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. దీంతో మాజీలను అరెస్ట్ చేయలేక, కోర్టులు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేయలేక పోలీసులు ఇబ్బందులు పడ్డారు. జీవో 54ను అనుసరించి మొత్తంగా జనజీవనంలో ఉన్న మాజీలకు కోర్టు కేసుల నుంచి విముక్తి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ముందు వరుసలో ఉండగా.. మిగతా జిల్లాల్లోనూ కసరత్తు సాగుతున్నట్లు సమాచారం.

వసంతమాడిన రామయ్య



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శుక్రవారం వసంతోత్సవ వేడుక వైభవోపేతంగా జరిగింది. ఈ నెల 26న శ్రీరామ నవమి రోజున జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించిన పనులు ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో శాస్త్రోక్తంగా తలంబ్రాలను కలిపారు. చిత్రకూట మండపంలోని సీతారాముల వారి మూర్తుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో తలంబ్రాలను కలిపారు. బేడా మండపంలో స్వామి వారికి అభిషేకం, డోలోత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. - భద్రాచలం

ఉత్కంఠగా పిడిగుద్దులాట



నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం హున్స గ్రామంలో హోలీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం పిడిగుద్దులాట ఉత్కంఠగా సాగింది. ఐదు ఫీట్ల ఎత్తుతో ఉన్న బలమైన కర్రలను నిలిపి పొడవైన తాడును కట్టారు. సాయంత్రం 6.05 గంటలకు పిడిగుద్దులాట ప్రారంభించారు. తాడును ఎడమ చేయితో పట్టుకుని కుడి చేయి పిడికిలి బిగించి ఇరువర్గాలు కొట్టుకున్నాయి. 15 నిమిషాల పాటు సాగిన అనంతరం ఆట ముగిసినట్టు గ్రామ పెద్దలు ప్రకటించారు. అనంతరం గ్రామస్తులు పరస్పరం ఆలింగనం చేసుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. -బోధన్ రూరల్

వచ్చే ఖరీఫ్‌కు గోదావరి నీళ్లు: హరీశ్

కాళేశ్వరం పనుల పురోగతిపై సమీక్ష


శుక్రవారం సిద్దిపేటలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: కరువుతో అల్లాడిన తెలంగాణ రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణిగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు అనుగుణంగా అధికారులు, కాంట్రాక్టర్లు అంకితభావంతో పనిచేసి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. వచ్చే ఖరీఫ్ నాటికి నిర్దేశిత లక్ష్యం మేరకు గోదావరి జలాలను రైతులకు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన 9,10,11,12 ప్యాకేజీ పనుల పురోగతిపై సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ అనంతగిరిసాగర్ రిజర్వాయర్ భూసేకరణను వేగంగా చేశారని, అలాగే టన్నెల్ లైనింగ్, పంప్‌హౌస్, సర్జిపుల్ పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. అనంతగిరిసాగర్ రిజర్వాయర్ పనులను జూన్ నెలాఖరు వరకు పూర్తి చేస్తే దిగువన రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, అక్కడి నుండి కొండపోచమ్మ సాగర్ వరకు గోదావరి నీటికి తరలించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ కట్ట నిర్మాణం పనుల నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. మల్లన్న సాగర్ మెయిన్ కెనాల్ భూసేకరణలో మిగిలిన ఉన్న భూమిని త్వరగా సేకరించాలని అన్నారు. ఒకవైపు భూసేకరణ, మరోవైపు రిజర్వాయర్, కాల్వల నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో చెట్లు, బోర్లు, బావులకు సంబంధించిన రైతులకు నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు వెంకట్రామిరెడ్డి, కృష్ణ భాస్కర్, నీటిపారుదల శాఖ అధికారులు హరిరాం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌ల సమ్మేళనం

హాజరు కానున్న వెయ్యి మంది సర్పంచ్‌లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామ సర్పంచ్‌ల ప్రాంతీయ సమ్మేళనానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం మహబూబ్‌నగర్‌లోని వైట్‌హౌస్ హాల్‌లో ఈ సమ్మేళనం జరగనుంది. ఈ సదస్సుకు రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు చెందిన వెయ్యి మంది సర్పంచ్‌లు హాజరు కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటివి మూడు ప్రాంతీయ సమ్మేళనాలను నిర్వహించనున్నారు. ఇందులో ఓ సదస్సును మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేశారు. ఈ సమ్మేళనానికి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాలతో పాటు నల్లగొండ, సూర్యాపేట, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన వెయ్యి మంది సర్పంచ్‌లు హాజరవుతారు. గ్రామాల అభివృద్ధి గురించి ఈ సమ్మేళనంలో చర్చించనున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి దీనికి హాజరవుతారు.

విషాదం మిగిల్చిన హోలీ

బస్సును ఢీకొట్టిన కారు • ఐదుగురు యువకుల దుర్మరణం

సంగారెడ్డి రూరల్: హోలీ వేడుకల్లో స్నేహితులతో ఆడిపాడి ఇంటికి తిరుగుముఖం పట్టిన ఐదుగురు యువకులను రోడ్డు ప్రమాదం కబలించింది. సంగారెడ్డి సమీపంలోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ వద్ద జాతీయ రహదారి 65పై శుక్రవారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేతకి డిజిటల్స్ నిర్వాహకుడు బాశెట్టి మహేశ్వర్‌గుప్తా(28) తన స్నేహితులు వెంకట్‌రాంరెడ్డి (23), వెంకట్‌రెడ్డి (23), నాగరాజు (23), నరేందర్‌చారి (30)తో కలసి పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ప్రైవేటు హోటల్‌లో హోలీ వేడుకలకు హాజరయ్యారు. వేడుకలు ముగిసిన అనంతరం మహేశ్వర్ గుప్తా తన కారులో స్నేహితులతో కలసి సంగారెడ్డికి తిరుగు పయనమయ్యారు. కంది మండల కేంద్రం ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారు వెనుక టైరు పేలి అదుపు తప్పింది. డివైడర్‌ను దాటుకుని అవతలి వరుసలో జహీరాబాద్ నుంచి పటాన్‌చెరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును (ఏపీ 23 ఎక్స్ 3328) ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న మహేశ్వర్ గుప్తాతో పాటు నాగరాజు, నరేందర్‌చారి అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన వెంకట్‌రాంరెడ్డి, వెంకట్‌రెడ్డిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి తరలించారు. అయితే ఆసుపత్రికి తరలించిన కొద్ది నిమిషాలకే ఇద్దరూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మృతులంతా సంగారెడ్డికి చెందినవారే. ప్రమాద వార్త తెలిసి మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఒకరు మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పవర్ శ్రీనివాస్ (17) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం హోలీ వేడుకల అనంతరం స్నేహితులతో కలసి సమీపంలోని సాత్నాల వాగులో స్నానానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందాడు.

నియోజకవర్గానికో వ్యవసాయ పరిశ్రమ

- రూ.700 కోట్లతో ట్రాన్స్‌ప్లాంటేషన్ యంత్రాలు: పోచారం
- వ్యవసాయ ఖర్చు తగ్గించేందుకే యాంత్రీకరణ వైపు మొగ్గు
- ఖమ్మంలో సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీ


శుక్రవారం ఖమ్మంలో జరిగిన సభలో మాట్లాడుతున్న పోచారం. చిత్రంలో తుమ్మల

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక వ్యవసాయ పరిశ్రమను నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఖమ్మంలో వ్యవసాయ యాంత్రీకరణ ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాధారిత పరిశ్రమలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఇందుకోసం సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈనెల 16న కమిటీ సమావేశం కానుందని పేర్కొన్నారు. వ్యవసాయ ఖర్చు తగ్గించేందుకు యాంత్రీకరణ పథకాన్ని మరింత బలోపేతం చేయనున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి మండలానికి పది చొప్పున 5,500 ట్రాన్స్‌ప్లాంటేషన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఇందుకోసం రూ.700 కోట్లను వచ్చే బడ్జెట్‌లో కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ట్రాన్స్‌ప్లాంటేషన్ మిషన్‌కు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు సబ్సిడీ కూడా ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. రూ.5వేల కోట్లతో నిర్మించే సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కానున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు 3 పంప్‌హౌస్‌ల పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. అటవీ అనుమతులు వచ్చిన వెంటనే వైరా, బయ్యారం, రోళ్లపాడు, పాలేరు జలాశయాలకు అనుసంధానం చేసే విధంగా కాల్వల తవ్వకాలు ఉంటాయని పేర్కొన్నారు. మార్చి నాటికి అందరికీ ట్రాక్టర్లు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పువ్వాడ అజయ్‌కుమార్, బానోత్ మదన్‌లాల్, కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అలవి వలలతో 'మత్స్య' దోపిడీ



అలంపూర్ రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ పుణ్యక్షేత్రంలో కృష్ణా–తుంగభద్ర నదీ సంగమ క్షేత్రం ఉంది. అక్కడ ఉన్న మత్స్యసంపదను కొల్లగొట్టేందుకు 4 రాష్ట్రాల్లోని మత్స్యకారులు అక్రమంగా ప్రయత్నిస్తున్నారు. రూ.లక్షలు ఆర్జించేందుకు ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి మత్స్యకారులు ఇక్కడ మకాం వేస్తున్నారు. దీంతో స్థానిక మత్స్యకారుల కడుపుగొట్టడమే కాక విలువైన మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. వారు ఉపయోగించే నిషేధిత అలవి వల ఒక్కసారి నదిలోకి విసిరితే చేప కాదు కదా, చేప గుడ్డు సైతం బయటకు రావాల్సిందే. ప్రభుత్వం నిషేధించిన అలవి వలలను యథేచ్ఛగా వాడుతూ మత్స్య సంపదను దోచేస్తుండటంతో కృష్ణా–తుంగభద్ర నదీ తీరంలోని నీరంతా పాచి పట్టి దుర్వాసన వస్తోంది.

భారీగా ఆదాయం

ఇక్కడి స్థానిక మత్స్యకారులు కొందరు ముఠాగా ఏర్పడి అలవి వలలు, వేటాడే మరబోట్లను వాడటంలో నైపుణ్యం కలిగిన వారిని రాజమండ్రి, కొవ్వూరు, విశాఖపట్నం, బెంగళూరు, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి పిలిపిస్తున్నారు. ఈ మత్స్యకారులకే రోజుకు రూ.50 వేల వరకు చెల్లిస్తుడటంతో వీరి ఆదాయం దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. జోగుళాంబ గద్వాల జిల్లా గొందిమల్ల ప్రాంతంలోని పెద్ద ఏరు దగ్గర 10 మంది కలిసి పటోలా (ఇదో రకం వల) వేస్తారు. ఒక్కసారి ఈ వల వేస్తే అందులో 20 క్వింటాళ్ల చేపలు పడతాయి.

స్థానికుల జీవితాల్లో కుదుపు

అలంపూర్‌లో ఎన్నో ఏళ్లుగా చేపల వేటపై ఆధారపడి జీవించే కుటుంబాలు దాదాపు 300కుపైగా ఉన్నాయి. గంగపుత్రులే కాకుండా ఇతర కులాల వారు కూడా ఈ వృత్తిని ఎంచుకున్నారు. ఒకరికి మించి మరొకరు అధిక మొత్తంలో సంపాదించాలనే ఆలోచనతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల నుంచి అలవి వలలను తెప్పించి వేటాడటం మొదలుపెట్టారు. స్థానిక మత్స్యకారులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది.

పరీవాహక ప్రాంతాల్లోనే వేట

అలవి వలలతో మత్స్య సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు పాపనాశిని దేవమాడ దగ్గర, కృష్ణా–తంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లోని సువిశాలమైన స్థలాల దగ్గర వేట కొనసాగిస్తుంటారు. పోలీసులు, మత్స్యశాఖ అధికారులు దాడులు చేస్తారనే భయంతో వీరిలోనే ఒక బృందం నదీ తీరంలో సంచరిస్తుంటుంది. ఈ చేపల వేట కారణంగా గతంలో గొందిమల్లలో మారణకాండలు కూడా జరిగాయి. బయటి నుంచి చేపల వేటకు పిలిపిస్తున్న మత్స్యకారులను శాతన కోటలో మకాం వేయిస్తున్నట్టుగా సమాచారం. ఇటీవల రెవెన్యూ, పోలీసు, మత్స్యశాఖ అధికారుల జాయింట్ ఆపరేషన్‌లో సుమారు 20మంది మత్స్యకారులతో పాటు లక్షల విలువైన అలవి వలలను స్వాధీనం చేసుకున్నారు.

దృష్టి సారించాం



అలవి వలలపై దృష్టి సారించాం. గతంలో కూడా అలవి వలలను పట్టుకున్నాం. వీటి విలువ దాదాపు రూ.3 లక్షల వరకు ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా అలవి వలలతో వేటాడి మత్స్యసంపదనను కొల్లగొట్టే వారిపై చర్యలు తప్పవు.
– ఆర్.ఎల్ మధుసూదన్, మత్స్య శాఖ అధికారి, జోగుళాంబ గద్వాల జిల్లా

సాక్షి
శనివారం, మార్చి, 3

'ఎగవేత' నేరగాళ్లపై కొరడా!

బ్యాంకులనుంచి భారీ మొత్తంలో అప్పులు తీసుకొని ఎగ్గొట్టి, మోసగించి విదేశాలకు పలాయనం చిత్తగిస్తున్న నేరగాళ్ల పని పట్టేందుకు చట్టం తీసుకురావాలని ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన బిల్లును గురువారం కేంద్ర కేబినెట్ ఆమోదించింది. నిరుడు ఫిబ్రవరిలో బడ్జెట్ ప్రసంగం సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించి, ఆ ఏడాది సెప్టెంబర్ నాటికే సిద్ధమై అతీ గతీ లేకుండా పడి ఉన్న బిల్లుకు ఇప్పుడు కదలిక రావడానికి గల కారణాలేమిటో అందరికీ తెలుసు. రూ. 11,400 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం భళ్లున బద్దలయ్యాక ఈమధ్యకాలంలో వరసగా వెల్లడవుతున్న స్కాంలపై దేశ ప్రజల్లో కలవరం బయల్దేరింది. సహజంగానే ఈ వ్యవహారంపై విపక్షాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశాలున్నాయి. అందువల్లే ఈ బిలుకు మోక్షం కలిగింది. కారణం ఏదైనా తక్షణం ఇలాంటి చట్టం రావలసి ఉన్నదని ఎవరైనా అనుకుంటారు.

మన దేశంలో ఇప్పుడే కాదు... దశాబ్దాలుగా బ్యాంకులనుంచి అప్పు తీసుకోవడం, ఎగ్గొట్టడం, చివరకు దేశంనుంచి పరారు కావడం రివాజుగా మారింది. కొందరు ఎగవేతదార్లు ఇక్కడే బోర విరుచుకుని తిరుగుతున్నారు. అన్నిటికన్నా హీనమైన విషయమేమంటే ఆ బాపతు వ్యక్తులకు రాజకీయ పార్టీలు టిక్కెట్లిచ్చి చట్టసభలకు పంపుతున్నాయి. మంత్రులుగా అందలమెక్కిస్తున్నాయి. కనీసం ఎగవేతదార్ల జాబితా బయటపెడితే జనంలో నగుబాటుపాలై బాకీలు చెల్లిస్తారు కుంటే ప్రభుత్వాలు ఆ పని చేయడం లేదు. సాక్షాత్తూ సుప్రీంకోర్టే ఆ మధ్య ఎగవేతదార్ల జాబితా విడుదల చేయడానికి మీకున్న అభ్యంతరమేమిటని అడిగితే... అలా ప్రకటిస్తే వారు మరింత మొండికేసే ప్రమాదం ఉన్నదని, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడుతుందని జవాబొచ్చింది. రుణ ఎగవేతదార్ల జాబితా వెల్లడించాలని ఈమధ్యే అఖిల భారత బ్యాంకు అధికారుల సమాఖ్య(ఏఐబీఓసీ) రిజర్వు బ్యాంకును సవాలు చేసింది. అలాగే కేవలం 12,000 మంది రుణ ఎగవేతదార్లు వివిధ బ్యాంకుల నుంచి రూ. 1,60,256 కోట్లు కొల్లగొట్టారని క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(ఇండియా)లిమిటెడ్(సిబిల్) బయట పెట్టింది. అప్పులిచ్చి నష్టపోయిన బ్యాంకుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులతోపాటు ప్రైవేటు బ్యాంకులు, సహకార బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు కూడా ఉన్నాయి. ఈ లెక్కంతా గత డిసెంబర్ 31 నాటిది. ఇందులో రూ. 25 లక్షలకు మించి కోటి రూపాయల్లోపు ఉన్న రుణాల విలువ రూ. 69,279 కోట్లు. యితే... కోటి రూపాయలకు మించి ఎగ్గొట్టిన రుణాల విలువ రూ. 90,976 కోట్లు. సిబిల్ అడిగిన వివరాలకు జవాబిచ్చిన పబ్లిక్ రంగ బ్యాంకులు–అలహాబాద్ బ్యాంకు, ఆంధ్రాబ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, సెంట్రల్ బ్యాంకు, దేనా బ్యాంకు, యూనియన్ బ్యాంకు మాత్రమే. స్టేట్ బ్యాంకుతోసహా మరికొన్ని ఇతర బ్యాంకులు వివరాలివ్వడానికి సిగ్గుపడినట్టున్నాయి. కనుక వాస్తవంగా ఎగ్గొట్టిన రుణాల విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సాధారణంగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను ఎగ్గొడుతున్నవారు వ్యాపారాల్లో దివాలా తీసినవారే అయి ఉంటారని అందరూ అనుకుంటారు. కానీ లాభార్జన గడిస్తూ ఉద్దేశ పూర్వకంగా రుణాల్ని ఎగవేసే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు పెరుగుతున్నారు. ఈమధ్య 'ఇండియా టుడే' చానెల్ స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి వజ్రాల వ్యాపారంలో ఉంటున్నవారు రుణాలెలా తీసుకుంటున్నారో బయటపెట్టింది. వజ్రాలు లేకుండా, వ్యాపారమే లేకుండా డొల్ల కంపెనీలు పెట్టి కాగితాలపై గారడీ చేసి బ్యాంకుల నుంచి రుణాలెలా తీసుకోవచ్చునో ఆ ఆపరేషన్‌లో పలువురు వెల్లడించారు. అది చూస్తే ఈ దేశంలో ఇంకెంతమంది నీరవ్ మోదీలున్నారోనన్న బెంగ కలుగుతుంది.

ఇప్పుడు ప్రవేశపెట్టబోయే ఫ్యుజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్లు అప్పులు తీసుకుని పరారైన నేరగాళ్ల ఆస్తులన్నిటినీ జప్తు చేయడానికి వీలు కల్పిస్తుంది. అలా జప్తు చేసిన ఆస్తులను విక్రయించడానికి కూడా ప్రభుత్వానికి అధికారాన్నిస్తోంది. అయితే రూ. 100 కోట్లు, అంతకన్నా ఎక్కువ బకాయిపడి పరారైనవారికే దీన్ని వర్తింపజేస్తారు. అలాగే న్యాయస్థానాలు జారీచేసిన అరెస్టు వారెంట్‌నూ, విచారణనూ తప్పించుకోవడానికి దేశం విడిచివెళ్లినవారిని 'పరారీలో ఉన్న నేరగాడి'గా భావిస్తారు. కోర్టు వారెంట్ జారీ చేసిన మరుక్షణం అలాంటివారు కొత్త చట్టం పరిధిలోకి వస్తారు. అయితే నిందితులు వారెంట్ జారీకి ముందే వెనక్కొస్తే ఈ చట్టం కింద చర్యలు ఆపేస్తారు. బ్యాంకులకు ఎగనామం పెట్టేవారి కోసం ఇప్పుడు చాలా చట్టాలున్నాయి. ఉద్దేశపూర్వక ఎగవేతదార్లను నిర్ధారించడం మొదలుకొని అలాంటివారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం వరకూ వివిధ చర్యలను సూచించే చట్టాలు అమలు చేస్తున్నారు. అయితే ఎగవేతదార్లు దేశం విడిచి పరారైనప్పుడు ఈ చట్టాలు పెద్దగా ఉపయోగపడటం లేదు. అందుకే వారు ఎగ్గొట్టిన రుణాలకు సమాన విలువగల ఆస్తుల్ని మాత్రమే ఈ చట్టాల కింద జప్తు చేసుకోవడానికి వీలవుతోంది. అందుకు భిన్నంగా ప్రతిపాదిత బిల్లు నేరగాళ్ల సమస్త ఆస్తుల్ని జప్తు చేసుకునేందుకు అధికారమిస్తోంది. అలాగే ఆ ఆస్తులపై మరెవరికీ హక్కు లేకుండా చేస్తోంది. దీంతోపాటు అవకతవకలకు పాల్పడే ఆడిటర్లపై చర్యల కోసం నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ(ఎన్ఎఫ్ఆర్ఏ) ఏర్పాటు చేయాలని కూడా కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. అయితే నేరగాళ్లు విదేశాల్లో పోగేసుకునే ఆస్తుల విషయంలో ఈ బిల్లు చేయగలిగిందేమీ లేదు. కనుక కఠినమైన చట్టాలు తీసుకురావడంతోపాటు అసలు నేరమే జరగకుండా చూసే పటిష్టమైన తనిఖీ వ్యవస్థల్ని అమల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే బ్యాంకింగ్ వ్యవస్థపైనా, ప్రభుత్వంపైనా పౌరుల్లో విశ్వాసం ఏర్పడుతుంది. అందు కోసం ఇంకేమి చేయాలో కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలి.




దురాశ, పేరాశ కలిసి సృష్టించే దుష్ట శక్తే వంచన. బ్యాంకింగ్ మూలాన్ని తొలిచేసే మహమ్మారి ఇదే.

– జోనాథన్ గాష్
ఇంగ్లిష్ రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.విదియ రా.3.57 వరకు, తదుపరి తదియ నక్షత్రం ఉత్తర రా.10.30 వరకు, తదుపరి హస్త, వర్జ్యం ఉ.6.04 నుంచి 7.09 వరకు, దుర్ముహూర్తం ఉ.6.19 నుంచి 7.54 వరకు అమృతఘడియలు ప.3.26 నుంచి 5.00 వరకు.

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం : 6.03
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.21	మగ్రీబ్	6.23
జొహర్	12.28	ఇషా	7.35
అసర్	4.45		

ప్రజల దృష్టిని మళ్లించే ప్రతిభ



శేఖర్ గుప్తా

ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్న నాలుగేళ్లలో ఎదురైన సంక్షోభాల జాబితాను పరిశీలించండి. ఎప్పుడూ ఇదే వ్యూహాన్ని అనుసరించడం కనిపిస్తుంది. యురిలో వైఫల్యాన్ని నాటకీయంగా జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌తో సర్దుకున్నారు. దీనిని ప్రశ్నిస్తే సైనిక బలగాలను శంకించినట్టవుతుంది కాబట్టి ప్రతిపక్షాలు కూడా నోరెత్తకుండా అభినందించాయి. పెద్ద నోట్ల రద్దు వ్యవహారం ఇక సహించలేరన్న స్థాయికి చేరుకున్న తరువాత, దేశంలో అక్కడా ఇక్కడా పెద్ద పెద్ద నోట్ల గుట్టలు కనుగొన్నట్టు కథనాలు, ఫొటోలు దర్శనమిచ్చాయి.

జాతిహితం

వారం క్రితం అందరి దృష్టినీ బాగా ఆకర్షిస్తూ పత్రికల మొదటి పేజీలలో కనిపించిన పతాక శీర్షికలనీ, వాటి ఆధారంగా చానళ్లలో ప్రైమ్‌టైమ్ కార్యక్రమాలలో వినిపించిన గావుకేకలనీ ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి! ఇవన్నీ కూడా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి ఆ మామాఅల్లుళ్లు నీరవ్ మోదీ, మేహుల్ చోక్సీ సొమ్ము దొంగిలించిన ఉదంతానికి సంబంధించినవే. ఆ గొడవ పేపర్లలో కనిపిస్తూ ఉండగానే వేయి కోట్ల రూపాయల పరిమితితో రోటోమ్యాక్ పెన్నుల సంస్థ అధిపతి విక్రమ్ కొఠారీ, ఇంకా ఇతరులు బ్యాంకులకు టోపీ వేయడం గురించి కూడా వార్తలు వచ్చాయి. చూడబోతే ఇలాంటి భాగోతం ఇంకా కొనసాగేటట్టే కనపడుతోంది.

అవినీతి మీద పోరాటం నినాదంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి ఈ పరిణామం అంత మంచిది కాదు. ప్రజాధనానికి కాపలాదారుడిని (చౌకీదార్) అంటూ గతంలో మోదీ చెప్పుకోవడాన్ని గుర్తుచేస్తూ విమర్శకులూ, కాంగ్రెస్‌వారూ ప్రధానిని ఎద్దేవా చేస్తున్నారు. ఇక బీజేపీ అవినీతి వ్యతిరేక నినాదాన్ని చేజార్చుకుందనీ, మరీ ముఖ్యంగా దావోస్‌లో జరిగిన సమావేశంలో నీరవ్ మోదీ, ప్రధాని నరేంద్ర మోదీతో కలసి ఫొటో దిగిన నేపథ్యంతో ఇది మరింత స్పష్టమైందనీ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. పన్ను ఎగవేత లేదా రుణాల ఎగవేత కారణంగా విదేశాలకు ఉడాయించిన విజయ్ మాల్యా, లలిత్ మోదీ అనే ఇద్దరు లబ్ధప్రతిష్టుల పేర్లు, తాజాగా మరో రెండు పేర్లతో జతగూడాయి. కానీ బీజేపీ అధికార ప్రతినిధి మాత్రం టీవీ చానళ్లలో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ ఇబ్బంది పడ్డారు. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే, 2011లో ఈ దొంగతనం మొదలయిందంటూ ఆ అధికార ప్రతినిధి చేసిన వాదన సీబీఐ వారి ఎఫ్ఐఆర్ దగ్గర వీగిపోయింది. అయితే ఇలాంటి పతాక శీర్షికలు రుచించలేదు. దీనితో అంతా మారిపోయింది. ఆ పతాక శీర్షికలన్నీ కాలగర్భంలో కలసిపోయాయి. కొత్తవి అవతరించాయి.

సమయం సందర్భమే ముఖ్యం

అంటే ఇది శ్రీదేవి మరణంతో జరిగిందని మాత్రం నేను సూచించడం లేదు. ఆ నటి మరణం పూర్తిగా విషాదం, యాదృచ్ఛికం. ఆ పెద్ద మార్పు మానవ ప్రేరేపితమే. ఇంకా చెప్పాలంటే బీజేపీ తెచ్చిన మార్పే. ఈ కాలమ్ అచ్చుకు వెళ్లిపోతున్నది కాబట్టి, కొత్త పతాకశీర్షికల గురించి ఆలోచించాలి. ఇంద్రాణి, పీటర్ ముఖర్జియాల నుంచి కార్తి చిదంబరం 7,00,000 డాలర్లు తీసుకున్నారా? ఈ ఒప్పందం కుదర్చడంలో ఆయన తండ్రి తోడ్పడ్డారా? కస్టడీలో ఉన్న కార్తికి ఇంటిదగ్గర నుంచి వచ్చిన భోజనాన్ని అనుమతించలేదు. కానీ ఆయన బంగారు గొలుసు, ఇతర ఆభరణాలని మాత్రం న్యాయమూర్తి అనుమతించారు. ఇలాంటివే ఇంకా శీర్షికలు. ప్రకటనలన్నీ మారిపోయాయి. నిజానికి కార్తిని గడిచిన ఆ ఏడురోజులలో ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు. అయితే ఆయన దేశం వీడి వెళుతున్నప్పుడు అరెస్టు చేయలేదన్న విషయాన్ని మాత్రం గమనించండి! ఆయన తిరిగి స్వదేశానికి చేరుకున్నాక విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్టు చేశారు. ఇందుకు కారణం? ప్రజలకు చేరవేయదలుచుకున్న సమాచారాన్ని క్రమబద్ధం చేయదలుచుకుంటే అందుకు సరైన సమయం ఎంచుకోవడం ప్రధానం.

నాలుగు సంవత్సరాలు నానిన తరువాత ఇప్పుడు లోక్‌పాల్ నియామకం విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. అంతా ఊహించినట్టే కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేసింది. దీని మీద ధర్మబద్ధమైన పతాకశీర్షికలతో వార్తలు వచ్చాయి. తరువాత మరో తాజా అంశానికి సంబంధించిన శీర్షికలు వచ్చాయి. అవి పరారైన ఆర్థిక నేరగాళ్ల పని పట్టేందుకు ఉద్దేశించిన బిల్లును ఆమోదిస్తూ ఈ వారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి చెందినవి. ఈ బిల్లు ప్రకారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల ఆదేశాలకు ఆరువారాల లోగా స్పందించని వారందరినీ పరారైన ఆర్థిక నేరగాళ్లుగానే పరిగణిస్తారు. మాల్యానీ, నగల వ్యాపారి మోదీని పరారైన ఆర్థిక నేరగాళ్లని ఇప్పుడు ప్రకటిస్తే అందులో తేడా ఏమిటో తెలియక మనం విస్తుపోవలసిందే. అంతేకాదు, ఒక ప్రశ్నను కూడా మనం సహేతుకంగా అడగవచ్చు. వారు ఇప్పటికే పరారైన నేరగాళ్లు కాదా? మరొక సందర్భంలో అయితే దీనిని నేను లాలీపాప్ రాజకీయమని కొట్టిపారేసేవాడిని. అంటే ఒక సమస్యని పరిష్కరించలేని స్థితిలో, ఆ సమస్యని పరిష్కరించేశామన్నట్టు ఒక చట్టాన్ని మాత్రం చేసి ఊరుకోవడమే. కానీ ఇప్పుడు ఆ మాట అనను. ఎందుకంటే ఏం కావాలని కోరుకున్నారో దానినే ఇది చక్కగా నెరవేరుస్తున్నది.



నీరవ్ మోదీ, మేహుల్ చోక్సీ

చేతులు కాలాక...

ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం చేయదలుచుకున్న కొత్త చట్టాల గురించి కూడా వార్తలు బయటకొస్తున్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలని ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టే ఉద్దేశంతో దేశం విడిచి వెళ్లిపోతున్న వారిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్టు చేస్తారని, దీనికి అవసరమైన కొత్త నిబంధనలనే కేంద్రం రూపొందిస్తున్నదని వార్తలు బయటకొస్తున్నాయి. ఈ విషయాన్ని చట్టబద్ధత, ప్రాథమిక హక్కులు అనే కోణం నుంచి చూద్దాం. వ్యాపారంలో నష్టం రావడం చేత, లేదా బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టే ఉద్దేశంతోనే ఒక పౌరుడు దేశాన్ని వీడి వెళుతున్నాడని ఎవరు నిర్ధారిస్తారు? ఇంకా చెప్పాలంటే, భారతదేశంలో పాత పోలీసు వ్యవస్థలో కనిపించే పద్ధతిలా ఇది కనిపిస్తుంది. దోపిడీ జరిగిపోయిన తరువాత, అది జరిగిన ఇంటి ముందు పోలీసులను నియమించేవారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం ఇలాంటిదేనని అనిపించడం లేదా? ప్రస్తుతం ఉన్న రాజకీయ స్థితినీ, సరిగ్గా వారం క్రితం బీజేపీ చేష్టలుడిగిన క్షణాలనీ పోల్చి చూడండి. ఏ టీవీ చానల్‌లో చూసినా బీజేపీ పైచేయిగా తన దాడిని కొనసాగిస్తూ ఉంటే, కాంగ్రెస్ చిదంబరాలను వెనకేసుకురావడంలో మునిగి ఉంది. లోక్‌పాల్, పలాయిత ఆర్థిక నేరగాళ్ల నిరోధక బిల్లు, ఇలాంటి నేరగాళ్ల కదలికల మీద ఇమ్మిగ్రేషన్ శాఖ ఆంక్షలు వంటి అంశాల మీద ఇతరత్రా కూడా సంపాదక వ్యాఖ్య, చర్చలు వినపడుతున్నాయి. జాతీయ బ్యాంకుల చార్టర్డ్ అకౌంటెంట్స్ పర్యవేక్షణల మీద కొత్త నిబంధనావళిని కూడా ప్రకటించారు. రూ. 50 కోట్ల వరకు ఉద్దేశపూర్వకంగా రుణాలను ఎగవేసిన వారి జాబితాలను సీబీఐకి అందించాలని కూడా ఈ బ్యాంకులను ఆదేశించినట్టు కనిపిస్తున్నది.

శీర్షికల మర్మం ఇదే!

ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. పలుకుబడి కలిగిన బడా వ్యాపారులు రూ. 20,000 కోట్లకు ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయిన తరువాత మాత్రమే ఈ చర్యలన్నీ ప్రారంభమైనాయి. అలా పలాయనం చిత్తగించిన వారిలో ఒకరు మోదీతో దావోస్‌లో ఫొటో దిగినవారు. మరొకరు స్వయంగా మోదీయే 'మేహుల్ భాయ్' అని సంబోధించినవారు. ఇదంతా అశుభ సమాచారమే. అయినా మనం మరచిపోదగినది, మరిచిపోయినదీ కూడా. కానీ ఒక్క వారంలోనే ఇలాంటి దోపిడీని అరికట్టలేని ప్రభుత్వంగా బీజేపీ ప్రభుత్వం మీద ముద్ర పడింది. తన రక్షణలో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను దోపిడీ చేయడానికి, దివాలా తీసే పరిస్థితులు కల్పించడానికి ఇలాంటి దొంగలకు అవకాశం ఇచ్చిందన్న అభియోగం ఎదుర్కొంది. అంతా తల్లకిందులైంది.

పతాకశీర్షికలను శాసించడంలో రాజకీయం చేసే మర్మం ఇదే.

ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్న నాలుగేళ్లలో ఎదురైన సంక్షోభాల జాబితాను పరిశీలించండి. ఎప్పుడూ ఇదే వ్యూహాన్ని అనుసరించడం కనిపిస్తుంది. యురిలో వైఫల్యాన్ని నాటకీయంగా జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌తో సర్దుకున్నారు. అయితే దీనిని ప్రశ్నిస్తే సైనిక బలగాలను శంకించినట్టవుతుంది కాబట్టి ప్రతిపక్షాలు కూడా చాలావరకు నోరెత్తకుండా అభినందించాయి. పెద్ద నోట్ల రద్దు వ్యవహారం ఇక సహించలేరన్న స్థాయికి చేరుకున్న తరువాత, దేశంలో అక్కడా ఇక్కడా పెద్ద పెద్ద నోట్ల గుట్టలు కనుగొన్నట్టు కథనాలు, ఫొటోలు దర్శనమిచ్చాయి. తరువాత ఆ నోట్ల గుట్టలు నకిలీవని కూడా తేలింది. కానీ అప్పటికి ప్రజల ఆలోచనలను అది మళ్లించగలిగింది. రోహిత్ వేముల ఉదంతాన్ని తీసుకోండి. అతడి ఆత్మహత్య తరువాత జేఎన్‌యూ విద్యార్థుల మీద కేసులు నమోదు చేసి దృష్టి మళ్లించారు. కన్హయ్యకుమార్, ఉమర్ ఖాలిద్ 'భారత్‌ను ముక్కలు చేస్తాం' అని ఉపన్యాసాలు ఇచ్చారంటూ దేశద్రోహం కేసులు మోపారు. వాళ్ల ఉపన్యాసాల వీడియోలను చూడకుండానే ఈ కేసులు నమోదయ్యాయి. డోక్లాం సంక్షోభాన్ని మరింత సున్నితమైన విధానంతో ఏమార్చారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ విషయాన్ని విశేషంగా చూపించవద్దని పత్రికలను, టీవీ చానళ్లను 'ఒప్పించడం' ద్వారా ఆ పని చేశారు. కశ్మీర్ సరిహద్దులలో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్ గురించి సాయం వేళల్లో గొంతు చించుకునే కమాండో కమేడియన్లు డోక్లాం గురించి మాటమాత్రంగా కూడా ఏమీ చెప్పలేదు.

వార్తలన్నీ మోదీని ఆకాశానికెత్తేవే...

సాధారణంగా సందేశాలని ప్రభుత్వాలన్నీ సొంతం చేసుకుంటాయి. కానీ మోదీ, షా బీజేపీ మాత్రం దానిని ఒక లలితకళగా అభివృద్ధి చేసింది. అన్ని పతాక శీర్షికలు కూడా కచ్చితంగా మోదీ ముద్రకు చెందిన మూడు కోణాలను ప్రతిబింబిస్తాయి: ఆయన మచ్చలేని అవినీతి వ్యతిరేక పోరాట యోధుడు. హిందూత్వ ఛాయతో ఉన్న జాతీయవాదాన్ని ఎలాంటి శషభిషలు లేకుండా రక్షించేవాడు. విస్తారమైన భుజాలు, విశాలమైన ఛాతి కలిగిన ఆయన ముఖంలో ఎలాంటి సంక్షోభమైనా సరే, చిన్న మార్పును కూడా తేలేదు. ఆయన చేసేదేదీ తప్పు కాదని ఆయనకి బాగా తెలుసు. కాబట్టి ఆయన అజేయుడు. ఆ కారణంగానే ఆయన ఏ వైఫల్యం గురించి స్పందించ రాదని గట్టిగా నిశ్చయించుకున్నారు. మన్మోహన్ సింగ్‌తోను, ఆయన ప్రభుత్వంతోను బేరీజు వేసి చూడండి. తమ సంరక్షణలో ఒక కూరల బండి నుంచి ఎవరో కొన్ని టొమేటోలు దొంగిలించారని తెలిసినా వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోతారు. అందుకే సంక్షోభాల వేళ మోదీ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో వారు భయ విహ్వలురై చూడాలి. అలాగే వారి ప్రభుత్వం ప్రదర్శించే రాజకీయ తెలివిడిని శ్లాఘించాలి.

వ్యాసకర్త దప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

ఆదివాసులకు అన్యాయం చేయొద్దు

ఆదివాసీల రిజర్వేషన్లలో 1976 నుంచి లంబాడీలను చేర్చినందువల్ల ఆదివాసులు చాలా నష్టపోయారు. ఇప్పటికైనా లంబాడీలను వేరు చేసి వారికి విడిగా రిజర్వేషన్లు కల్పించాలి. సమస్యను ఇరువర్గాలు మిత్రవైరుధ్యంగా గుర్తించి చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి.

ఆదివాసులకు పది శాతం రిజర్వేషన్లు, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన బిల్లు కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనే ఆమోదం పొందక తిరిగి వచ్చింది. ఆదివాసుల రిజర్వేషన్ పెంపు, ముస్లిం రిజర్వేషన్ పెంపు, వేరు వేరు బిల్లుల రూపంలో ఉండాలనే ఇంగిత జ్ఞానం కూడా పాటించకుండా ఆదివాసులపట్ల, ముస్లింలపట్ల ఎంతో ప్రేమ ఉన్నట్లు రూపొందించిన ఈ బిల్లు 1986లో ఎన్టీఆర్ బీసీలకు 25 శాతం నుంచి 40 శాతానికి పెంపు చేస్తూ రూపొందించిన బిల్లు వంటిదే. అది హైకోర్టు కొట్టి వేస్తే టీడీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు కూడా పోలేదు. ఆ తాను నుంచే వచ్చిన ముక్క అయిన కేసీఆర్, ఆయన స్థాపించిన టీఆర్ఎస్ ఇవ్వాళ ప్రపంచవ్యాప్తంగానూ, దేశంలోనూ సామ్రాజ్యవాద, బ్రాహ్మణీయ భూస్వామ్య భావజాలానికి, పాలనకు వ్యతిరేకంగా ముందు భాగాన నిలబడి పోరాడుతున్న మూల ఆదివాసులపై, ముస్లింలపై ప్రేమ చూపుతారంటే తోడేళ్లు, గొర్రెలకు మేలు చేయడం వంటిదే.

ఆదివాసులకే పరిమితమై ఆలోచించినా ఒకవైపు రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ రూపొందించిన మార్గదర్శకాలను కూడా తుంగలో తొక్కి ఎస్టీ జాబితాలోకి లంబాడాలను చేర్చి మూల ఆదివాసీలకు, లంబాడాలకు మధ్యన చిచ్చు పెట్టి పీడిత వర్గాల ఘర్షణల్లో, విభేదాలు, వైమనస్యాలు, విద్వేషాల్లో రగుల్కొంటున్న మంటల్లో పేలాలేరుకుంటున్న ప్రభుత్వం.. మరొకవైపు ఎస్టీ రిజర్వేషన్లను పది శాతానికి పెంచి బిల్లును శాసనం చేయగలదని, చేసినా మూల ఆదివాసులకు న్యాయం చేయగలదని ఆశించడం అత్యాశే అవుతుంది. ఇపుడున్న ఆరు శాతం రిజర్వేషన్లలోనూ నాలుగు శాతమే అమలవుతున్నది. ఈ నాలుగు శాతంలో నాలుగో వంతు కూడా మూల ఆదివాసులకు దక్కడం లేదు. కారణం 1976లో లంబాడాలను అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చిన దగ్గర్నించే గత నలభై రెండేళ్లలో మూల ఆదివాసుల జనాభాకు లంబాడాల జనాభా ఇరవై రెట్లకు పెరిగింది.



హరిభూషణ్(యాపనారాయణ)

లంబాడాల వలసలు వేగవంతంగా పెరగడమే ఇందుకు కారణం. 1961లో 81,366గా ఉన్న లంబాడా జనాభా 2011లో 20,99,524కు పెరిగింది. ఏజెన్సీలో మూల ఆదివాసుల జనాభా 2011లో 9 లక్షలుగా మైనారిటీకి పడిపోయింది. కనుక ఈ పరిస్థితిలో ఎస్టీ రిజర్వేషన్లు పదిశాతం అమలయినా మూల ఆదివాసులు పొందే ప్రయోజనమెంతో, పాలక వర్గాలు ఆడుతున్న ఓటు బ్యాంకు రాజకీయాలు ఎంత దుర్బుద్ధితో కూడినవో ఎవరైనా న్యాయంగా ఆలోచిస్తే అర్థం అవుతుంది. రాజ్యాంగం ప్రకారం అడవిలో, ఏజెన్సీలో మూల ఆదివాసులకు మాత్రమే దక్కవలసిన జల్, జంగల్, జమీన్‌లపై అధికారం గ్యారంటీ కావాలన్నా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్యా, ఉద్యోగ, భూసంబంధ హక్కులు అమలు కావాలన్నా 1976లో చేసిన చట్ట సవరణను రద్దు చేయవలసిందే. రిజర్వేషన్ల అమలులో 1976ను కటాఫ్ డేట్‌గా గుర్తించి బ్యాక్‌లాగ్ పోస్టులను, భూమి పట్టాలను బ్యాక్‌లాగ్ పద్ధతిలో అమలు చేయాల్సిందే.

ఎస్టీ వర్గీకరణ అంటే మూల ఆదివాసీ తెగల్లోనే గోండు, కోలాము, పరధాను, పరమేశు, నాయకపోడు, చెంచు వంటి ఆదివాసీ తెగల జనాభా ప్రాతిపదికపైననే కానీ మైదాన ప్రాంత సంచార జాతి అయిన లంబాడాలను కలిపి కాదు. 1976ను కటాఫ్ తేదీగా గుర్తించి వలస లంబాడాలను ఎస్టీ రిజర్వేషన్ల నుంచి తొలగించాలి. 1976 నుంచి ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడాలకు ఆయా రాష్ట్రాల్లో ఉన్న గుర్తింపు ఇక్కడ ఇవ్వాలి. అయితే అది రాజ్యాంగంలోని ఎస్సీ, ఎస్టీ గుర్తింపు కాజాలదు. కాయితా లంబాడాలు, వాల్మీకి బోయలు ఎస్టీ జాబితాలో చేరజాలరు. అడవిలో మూల ఆదివాసుల నివాసం, తొలి రోజుల్లో ఆహారాన్వేషణ, వేట, కాలక్రమంలో పోడు వ్యవసాయం, ఏజెన్సీలో ఉనికి, ఎస్టీ గుర్తింపుకు ప్రాతిపదిక కావాలి. ఐదవ షెడ్యూల్డు ఏజెన్సీ (అటవీ) ప్రాంతాల్లో ఏజెన్సీ సర్టిఫికెట్లు మూల ఆదివాసులకు మాత్రమే ఇవ్వాలి. ఏజెన్సీ ప్రాంతంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వగైరా రాజకీయాధికారా లన్నీ మూల ఆదివాసులకే పరిమితం కావాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో నూటికి నూరు శాతం ఉద్యోగాలు మూల ఆదివాసులకే ఇవ్వాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో రెసిడెన్షియల్ స్కూళ్లలో, కాలేజీలలో మూల ఆది వాసుల పిల్లలకే సీట్లు ఇవ్వాలి. జీసీసీలో మూల ఆదివాసులకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వాలి.

ఆదివాసుల సంస్కృతిని అగౌరవ పరిచే చర్యలు చేపట్టవద్దు. సూకీ మాత, సేవాలాల్ చిత్రాలను ఆదివాసీ మ్యూజియంలో పెట్టడం సరియైంది కాదు. మేడారం ట్రస్టులో ఆదివాసులు మాత్రమే ఉండాలి. జోడన్‌ఘాట్‌లో కొమురం భీం విగ్రహానికి చెప్పుల దండ వేయడం రాజ్య ప్రేరేపిత అవమానకర చర్య. ఆదివాసుల మనోభావాలను గాయపరిచే చర్య. ఏజెన్సీ ప్రాంత ఐడీడీఏలలో మూల ఆదివాసులకు మాత్రమే హక్కులుండాలి. లంబాడా ప్రజలకు ప్రత్యేకంగా మైదాన ప్రాంతాలలో రిజర్వేషన్లు కల్పించాలి. ఐటిడీ ఏలు నెలకొల్పాలి. ఈ అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్లపై హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిషన్ వేయాలి.

ప్రభుత్వ రంగం రోజురోజుకూ కుంచించుకుపోతున్న నేపథ్యంలో రిజర్వేషన్లు పీడిత, పేద ప్రజల సమస్యలనన్నింటినీ పరిష్కరింప జాలవు. వాటివల్ల ఉపయోగం చాలా పరిమిత మైందనే ఎరుక ఉండాలి.


మూల ఆదివాసులకు జల్ జంగల్ జమీన్‌లపై సర్వాధికారాలు దక్కాలంటే ఆదివాసీయేతరులైన పేదలు, పీడితులు ముఖ్యంగా లంబాడాలు మూల ఆదివాసులకు శత్రువులనీ, లంబాడాలకు దక్కవలసిన న్యాయం దక్కకూడదనీ అర్థం కాదు. పాలకవర్గాలు పెట్టిన కుట్ర తప్ప మూల ఆదివాసులకు, లంబాడాలకు మధ్యనున్నది మిత్ర వైరుధ్యమే. దీనిని మిత్ర వైరుధ్యంగానే గుర్తించి మూల ఆదివాసులు, లంబాడాలు, ఆదివాసీయేతర పీడిత, పోరాట ప్రజానీకంతో కలిసి పరిష్కరించుకోవాలి. భూస్వాములు, దళారీ పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద ఏజెంట్లే అసలైన శత్రువులు. వాళ్లే ఈ ఘర్షణలకు మూలం. ప్రభుత్వాలు వాళ్ల చేతుల్లో కీలుబొమ్మలు. మూల ఆదివాసులు, లంబాడాలు, పీడిత ప్రజలందరూ ఐక్యమై దోపిడీ పాలక వర్గాలకు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడటం ద్వారానే పేద ప్రజలందరికీ న్యాయమైన భవిష్యత్తు సాధ్యమవుతుంది.

మూల ఆదివాసులు జల్, జంగల్, జమీన్, స్వీయ గౌరవం కోసం పీడిత ప్రజలందరితో ఐక్యమై పోరాడాలి. స్వపరిపాలన కోసం పోరాడాలి. మిలిటెంటు పోరాటాల ద్వారా తప్ప ఎన్నికల రాజకీయాల ద్వారా పేద, పీడిత ప్రజలకు లభించేది ఎండమావులే. అంతిమ సారాంశంలో పీడిత ప్రజలందరితోపాటు మూల ఆదివాసుల సమస్యలకు పరిష్కారం నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యం. పోరాటానికి అది మార్గదర్శకం, లక్ష్యం కావాలి.

(మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి యాపనారాయణ అలియాస్ హరిభూషణ్ అలియాస్ జగన్.. ఎన్‌కౌంటర్ ఘటన జరగటానికి ముందు రోజు 'సాక్షి'కి పంపిన వ్యాసం)

బ్రాండ్ రైస్

అమరావతి కోసం అడిగిందే తడవుగా మూడు పంటలు పండే సుక్షేత్రాలను రైతులు అప్పగించారంటే– ఆరుగాలం కష్టించే రైతు విసిగి వేసారి ఉన్నాడని ఒక సర్వే సారాంశం.




శ్రీరమణ

గ్రామసీమలు, పల్లెపట్టులు, అన్నదాతలు, వెన్నెముకలు, రైతన్నలు, రైతురాజులు, కృషీవలురు, జైకిసాన్– ఇవన్నీ ఒఠ్ఠి మాటలు. గట్టి మేలెవరూ తలపెట్టడం లేదు. ప్రతిసారీ రైతుల్ని ఉద్ధరిస్తాం, గ్రామాల్ని ఉద్ధరిస్తాం అనే నినాదంతోనే రాజకీయ పార్టీలు బరిలోకి దిగుతాయి. తరాలు గడిచినా మట్టిని నమ్మిన వారికి అమాయకత్వం పోలేదు. తను దున్ని, విత్తి, పోషించి పండించకపోతే దేశానికి అన్నం ఉండదని గట్టిగా నమ్ముతాడు. తన కోసమే ఎండలు కాస్తున్నాయని, తన కోసమే వానలు పడుతున్నాయని విశ్వసిస్తాడు. దాన్ని ఆసరా చేసుకుని మన నల్లదొరలు హాయిగా ఏలుతున్నారు.

ఏనాడూ సేద్యం రైతుకి అధిక లాభాలు తెచ్చి పెట్టింది లేదు. అయినా రైతు కాడి కింద పారేసింది లేదు. కారణం ఆ రోజుల్లో గ్రామాల్లో జీవన వ్యయం తక్కువ. ఇప్పుడు బస్తీలతో పోటీ పడుతోంది. డెబ్భై ఏళ్లలో ప్రాథమిక సౌకర్యాలు కూడా పల్లెలకు అందలేదు. రోడ్లు, కరెంటు లేని ఊళ్లు ఇంకా ఉన్నాయి. పెద్ద గ్రామాలకు సైతం శుద్ధమైన నీరు లేదు. సరైన విద్య లేదు. వైద్య సదుపాయం బొత్తిగా లేదు. ఎన్ని ప్రాథమిక పాఠశాలల్లో సరైన విద్య అందుతోందో, ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంచి వైద్యం ఉందో గుండెమీద చెయ్యి వేసుకు చెప్పండి. టీచర్లు, డాక్టర్లు నగరంలో ఉండి ఊళ్లో బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. దరిద్రం, అనారోగ్యం, విద్య లేమి కారణంగా వలసలు మొదలైనాయి. ఇది ఆరంభమై యాభై ఏళ్లు దాటుతున్నా, నాయకులు గమనించినా దీనికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చిత్తశుద్ధితో ఆరంభించలేదు. సకల సౌకర్యాలతో ఉన్న గ్రామాలు ఇప్పటికీ నిండుగా కన్పిస్తున్నాయి.

అక్షర తూణీరం



రైతుకి సకాలంలో సరైన సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేరు. వారు వ్యవసాయ శాస్త్రం చదివిన వారు కాదు. అనూచానంగా వచ్చే పద్ధతుల్నే పాటిస్తారు గానీ నూతన విధానాలంటే భయపడతారు. వారికి కౌన్సెలింగ్ అవసరం. యూరియా లాంటి రసాయనాలు అతిగా ఎందుకు వాడరాదో వారికి అర్థమయ్యేలా చెప్పాలి. వచ్చే అనర్థాలని చూపాలి. ప్రతి మండల కేంద్రంలోనూ ఒక పరిశోధనా కేంద్రం ఉండాలి. అక్కడ అన్ని రకాల పంటల్ని ఆధునిక శాస్త్రీయ పద్ధతుల్లో పండించాలి. అలాగ రైతుని నమ్మించాలి. అతిగా నీటి వాడకం, ఎరువుల, మందుల వాడకం, ఇతర అశాస్త్రీయ నమ్మకాల్ని వమ్ము చేయాలి. ఇదంతా ఎవరు చేస్తారు?


అమరావతి కోసం అడిగినదే తడవుగా మూడు పంటలు పండే సుక్షేత్రాలను రైతులు అప్పగించారంటే– దాని వెనుక ఆరుగాలం కష్టించే రైతు విసిగి వేసారి ఉన్నాడని ఒక పరిశీలనలో తేలింది. పూర్వం గ్రామీణులకు ఇతర ఆదాయాలు ఉండేవి. పాడి పశువులు, గొర్రెలు, కోళ్లు, పెరటి కూరలు రోజువారీ ఖర్చులకు ఆసరాగా ఉండేవి. యాంత్రీకరణతో పశుసంపద పోయింది. జనం సుఖం మరిగారు. దళారీ రాజ్యం వర్ధిల్లుతోంది. నిజానికి బ్రోకర్లే ప్రజల్ని ప్రభుత్వాల్ని శాసిస్తున్నారు. ఇప్పుడు పుట్టుకొస్తున్న బ్రాండెడ్ రైస్‌లు, వాటి వ్యాపార ప్రకటనలో చూస్తేనే అర్థమవుతుంది. తడుపు తగలని మంచి సన్న ధాన్యాన్ని కల్లాల్లోనే సొంతం చేసుకుంటారు. రైతు ఎప్పుడు డబ్బులు చేతికందుతాయా అని ఎదురు చూస్తుంటాడు. చాలామంది సామాన్య రైతులు ముందే అప్పులు లేదా అడ్వాన్సులు తీసుకుని ఉంటారు. ఇక రుణదాత ఎప్పుడు వసూలు చేయమంటే అప్పుడు చేయాల్సిందే. రైతుకి గడ్డి మిగుల్తుంది. తినేందుకు పశువులు కూడా లేవు. 'రైతు ఉద్ధరణ' బాగా కలిసొచ్చిన నినాదం. అందుకే కమల్ హాసన్ ఆ మాటతో రంగంలోకి దిగాడు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

ముక్కు కోసుకుంటున్నారు!

సెల్ఫీలో అందం కోసం అమెరికాలో పెరుగుతున్న సర్జరీలు

వాషింగ్టన్: ఇప్పుడు చాలా మందికి సెల్ఫీలు తీసుకోవడమంటే మహా సరదా. ఈ సెల్ఫీల పిచ్చి ఏ స్థాయికి వెళ్లిందంటే.. ఫొటోల్లో తమ ముక్కు పెద్దదిగా కనిపిస్తోందనీ, శస్త్రచికిత్స ద్వారా దాని పరిమాణాన్ని తగ్గించాలంటూ ప్లాస్టిక్ సర్జన్ల దగ్గరకు అనేకమంది వరుసలు కడుతున్నారు. సెల్ఫీ ఫొటో తీసుకునేటప్పుడు ఫోన్‌ను ముఖానికి దగ్గరగా పెట్టాల్సి రావడం వల్లనే ముక్కు అలా కనిపిస్తోంది తప్ప వాస్తవానికి సమస్యేమీ లేదని వైద్యులు చెబుతున్నా వారు వినడం లేదు. దీంతో ప్లాస్టిక్ సర్జన్లకు మంచి గిరాకీ ఏర్పడుతోంది. ఈ విషయాన్ని అమెరికాలోని ప్లాస్టిక్ సర్జన్ల పత్రిక 'జామా ఫేషల్ ప్లాస్టిక్ సర్జరీ' ఇటీవల ప్రచురించింది.



30 శాతం పెద్దదిగా కనిపిస్తుంది..

ముఖానికి కెమెరా లెన్స్ 12 అంగుళాల కంటే తక్కువ దూరంలో ఉంటే సెల్ఫీల్లో ముక్కులు అసలు సైజు కన్నా 30 శాతం పెద్దగా కనిపిస్తాయి. ఇది గమనించకుండా అనేక మంది ఆపరేషన్ చేసి తమ ముక్కును అందంగా తీర్చిదిద్దాలంటూ తన క్లినిక్ వచ్చి అడుగుతున్నారని అమెరికాలోని రట్జర్స్ యూనివర్సిటీలో పనిచేసే ఫేషల్ ప్లాస్టిక్ సర్జన్ బోరిస్ పాష్కోవర్ తెలిపారు. ఈయన తన సహచరులతో కలసి రాసిన వ్యాసాన్నే జామా ఫేషల్ ప్లాస్టిక్ సర్జరీ ప్రచురించింది. అమెరికన్ ఫేషల్ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ల అకాడమీ ప్రజల్లో కనిపిస్తున్న ఈ వేలం వెర్రిని గమనించింది. సెల్ఫీల్లో అందంగా కనిపించేలా చేయాలంటూ అనేక మంది తమను కలుస్తున్నారని 2017లో జరిపిన ఓ సర్వేలో 55 శాతం ఫేషల్ ప్లాస్టిక్ సర్జన్లు చెప్పారు. 'సెల్ఫీల్లో ముక్కు పెద్దదిగా కనిపిస్తోందంటూ అనేకులు నా దగ్గరకు వస్తున్నారు. వారి ముక్కు పెద్దగా ఏమీ లేదనీ, కెమెరాను దగ్గరగా ఉంచి సెల్ఫీ తీయడం వల్లే పరిమాణంలో పెద్దగా కనిపిస్తోందని చెబుతున్నాను' అని తెలిపారు. కెమెరాను దూరంగా పెడితే ముక్కు సైజు తగ్గుతుందని ఆయన వెల్లడించారు.

నేడే 'ఈశాన్య' ఫలితాలు

ఉదయం 8 గంటలకు ప్రారంభంకానున్న త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల ఓట్ల లెక్కింపు



అగర్తల/కోహిమా/షిల్లాంగ్: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనున్నాయి. శనివారం ఉదయం 8 గంటలకు మూడు రాష్ట్రాల్లోనూ కౌంటింగ్ ప్రారంభంకానుంది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఈ మూడు రాష్ట్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. త్రిపురలో ఫిబ్రవరి 18న, మేఘాలయ, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27న పోలింగ్ జరిగింది. మూడు రాష్ట్రాల్లోనూ 60 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. వివిధ కారణాల వల్ల మూడింటిలోనూ 59 స్థానాలకే పోలింగ్ జరిగింది. త్రిపుర, మేఘాలయలో అభ్యర్థుల మరణం కారణంగా ఒక్కో స్థానానికి ఎన్నిక వాయిదా పడింది. ఇక నాగాలాండ్‌లో నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ) చీఫ్ నీఫి రియో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేఘాలయలో కాంగ్రెస్ పార్టీ 59 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపింది. బీజేపీ తరఫున 47 మంది పోటీలో ఉన్నారు. నాగాలాండ్‌లో బీజేపీ, ఎన్‌డీపీపీతో జత కట్టింది. ఇక్కడ ఎన్‌డీపీపీ 40 చోట్ల, బీజేపీ 20 చోట్ల పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ 18 స్థానాల్లోనే బరిలో ఉంది.

కమలం వికసించేనా..?

త్రిపురలో 25 ఏళ్లుగా కొనసాగుతున్న వామపక్ష కూటమికి పరాభవం తప్పదని, ఇక్కడ బీజేపీ అధికారం కైవసం చేసుకునే అవకాశం ఉందని రెండు ఎగ్జిట్‌పోల్ సర్వేల్లో తేలింది. మిగతా రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ గట్టి పోటీ ఇస్తుందని పేర్కొంది. మేఘాలయలో కాంగ్రెస్ పార్టీ పదేళ్లుగా అధికారంలో ఉంది. 2008లో మూడు నెలల రాష్ట్రపతి పాలన మినహా నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌ఎఫ్‌పీ) 2003 నుంచి అధికారంలో ఉంది. అస్సాం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన బీజేపీ మేఘాలయ, నాగాలాండ్, త్రిపురలోనూ విజయకేతనం ఎగురవేసి ఈశాన్య భారతంలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని భావిస్తోంది.



అహ్మదాబాద్‌లోని జగన్నాథ్ ఆలయంలో శుక్రవారం ఆనందోత్సాహాలతో హోలీ పండగ జరుపుకుంటున్న భక్తులు

వంట బాలేదు.. విడాకులిప్పించండి!

ముంబై: భార్య బాధ్యతగా ప్రవర్తించటం లేనందున విడాకులు ఇప్పించాలంటూ ఓ ప్రబుద్ధుడు బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై బాంబే కోర్టు మండిపడింది. క్రూరత్వాన్ని సూచించే అంశాలేమీ పిటిషన్‌లో లేవని, విడాకులు మంజూరు చేసేందుకు కారణాలేవీ లేవని తేల్చి కేసును కొట్టేసింది. భార్యను ఉదయాన్నే నిద్రలేపితే తనతోపాటు తల్లిదండ్రులనూ తిడుతోందని కోర్టుకు తెలిపారు. 'సరిగా వండదు. నాతో సరిగా ఉండదు. సాయంత్రం ఇంటికి రాగానే పడుకుని, రాత్రి 8.30కు వంట చేస్తుంది' అని పేర్కొన్నారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 'ఆమె ఇంట్లో పనులతోపాటు బయట ఉద్యోగం చేస్తున్నారు. అంటే ఆమెపై అదనపు భారం ఉన్నట్లే. ఇంట్లోకి సరుకులు కొనాలి, భర్త, అత్తమామలకు వండిపెట్టాలి, ఇంట్లోని మిగతా పనులు చూసుకోవాలి. అలాంటప్పుడు రుచికరంగా వండటం లేదంటూ పిటిషన్ వేయటం అర్థరహితం. ఇలాంటి కారణాలకు విడాకులు ఇవ్వలేము' అని స్పష్టం చేసింది.

రామేశ్వరంలో నేడు శ్రీదేవి అస్తికల నిమజ్జనం



చెన్నై: ఇటీవల కన్నుమూసిన ప్రముఖ బాలీవుడ్ నటి శ్రీదేవి అస్తికలను ఆమె భర్త బోనీకపూర్ శనివారం రామేశ్వరంలో సముద్రంలో నిమజ్జనం చేయనున్నారు. ఇందుకోసం శుక్రవారం సాయంత్రం చెన్నై చేరుకున్న బోనీ శనివారం ఉదయాన్నే ప్రత్యేక విమానంలో రామేశ్వరం వెళ్లనున్నారు. అనంతరం చెన్నై చేరుకుని అక్కడినుంచి ఆయన ముంబై వెళ్లిపోతారు. ఫిబ్రవరి 24న దుబాయ్‌లోని హోటల్ గదిలో ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడిపోయి శ్రీదేవి కన్నుమూసిన సంగతి తెలిసిందే.

మిచిగాన్ వర్సిటీలో కాల్పులు.. ఇద్దరు మృతి

మిచిగాన్(యూఎస్‌ఏ): సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీలోని కాంప్‌బెట్ హాల్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని నల్లజాతి యువకుడు(19) జరిపిన కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. మృతులు విద్యార్థులు కాదనీ, వ్యక్తిగత కక్షల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. పరారీలో ఉన్న ఆగంతకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటన అనంతరం విద్యార్థులను అధికారులు అప్రమత్తం చేశారు. ఇక్కడి మౌంట్ ప్లెజెంట్ క్యాంపస్‌లో 20వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత రెండు వారాల క్రితం ఫ్లోరిడాలోని స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్‌లో ఓ మాజీ విద్యార్థి జరిపిన కాల్పుల్లో 17 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

'అమెరికాను మించిన ఆయుధాలున్నాయి'

వాషింగ్టన్: అణు క్షిపణులు సహా అత్యంత శక్తిమంతమైన, అజేయమైన ఆయుధాలు తమ వద్ద ఉన్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. తమ ఆయుధాల ముందు అమెరికా ఆయుధ సంపత్తి దిగదుడుపేనని పేర్కొన్నారు. వార్షిక స్టేట్ ఆఫ్ ద నేషన్ ప్రసంగంలో పుతిన్ మాట్లాడారు. ఆయుధాలకు సంబంధించిన కొన్ని ప్రతీకాత్మక వీడియోలనూ ఆయన చూపించారు. వీడియోల్లో ఆయుధాలు అమెరికా వైపునకు గురిపెట్టినట్లుగా ఉన్నాయి. శత్రు దేశాల రక్షణ వ్యవస్థలు తమ ఆయుధాలను గుర్తించేలోపే అవి విధ్వంసం సృష్టిస్తాయని పుతిన్ చెప్పారు. కాగా, పుతిన్ వ్యాఖ్యలపై అమెరికా మండిపడింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి ఒప్పందాలను ఉల్లంఘించి రష్యా శక్తిమంతమైన ఆయుధాలను తయారుచేస్తోందని ఆరోపించింది. ఈ విషయాన్ని తాము ఎప్పటినుంచో చెబుతున్నా రష్యా తోసిపుచ్చిందనీ, కానీ ఇప్పుడు ఆ దేశాధ్యక్షుడే స్వయంగా ఆ విషయం బయటపెట్టారని అమెరికా పేర్కొంది.

మరిన్ని కేసుల్లో కార్తీ పాత్ర!

ఆధారాలున్నాయంటున్న సీబీఐ, ఈడీ

- కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్న విచారణ సంస్థలు
- పలు కంపెనీలకు ఎఫ్ఐపీబీ అనుమతులు ఇప్పించిన కార్తీ
- ఇందుకోసం ఆయా కంపెనీల నుంచి భారీమొత్తం వసూలు
- సీబీఐ కస్టడీలో కొనసాగుతున్న విచారణ



న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టై సీబీఐ రిమాండ్‌లో ఉన్న మాజీ కేంద్ర మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకోనుంది. సీబీఐ, ఈడీ అధికారులు చెబుతున్న ప్రకారం ఐఎన్ఎక్స్ మీడియా కేసుతోపాటు మరిన్ని కేసుల్లో కార్తీ పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభించాయి. దీంతో జూనియర్ చిదంబరంపై మరికొన్ని కేసులు నమోదు చేసేందుకు ఈ రెండు విచారణ సంస్థలు సిద్ధమవుతున్నాయి. యూపీఏ హయాంలో భారతదేశంలోని పలు కంపెనీలకు విదేశీ పెట్టుబడులకు అనుమతులు వచ్చేలా చేసేందుకు కార్తీ చక్రం తిప్పారని.. ఇందుకోసం భారీమొత్తంలో డబ్బులు తీసుకున్నారని ఈడీ వెల్లడించింది. దీనికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలున్నాయని స్పష్టం చేసింది. కార్తీకి చెందిన అడ్వాంటేజ్ స్ట్రాటెజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎస్‌సీపీఎల్) సంస్థ పేరుతోనే ఈ లావాదేవీలు జరిగినట్లు తెలిపింది. రెండు కంపెనీలు ఇలా అనుమతులు పొందిన ఆధారాలున్నాయని.. మిగిలిన వివరాలు సంపాదిస్తామని ఈడీ అధికారులు తెలిపారు. కార్తీ కంపెనీ రంగంలోకి దిగగానే అన్ని అనుమతులు చకచకా వచ్చేశాయని గుర్తుచేశారు. అయితే కార్తీ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ మాత్రం ఈ విషయం ఇంతవరకు తన దృష్టికి రాలేదన్నారు.

తొలిరోజు విచారణలో..


తమ కస్టడీలో ఉన్న కార్తీపై సీబీఐ ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. ఐదురోజుల రిమాండ్‌కు కోర్టు అనుమతిచ్చిన నేపథ్యంలో తొలిరోజైన శుక్రవారం ఉదయం 8 గంటలనుంచే విచారణ మొదలుపెట్టింది. ఐఎన్ఎక్స్ మీడియాతోపాటు పలు ఇతర కేసుల్లో కార్తీ పాత్రపై ప్రశ్నలు సంధించింది. దీంతోపాటు ఇటీవలి విదేశీ పర్యటనలో ఈ కేసులకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారనే అంశంపైనా గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్లు తెలిసింది. శుక్రవారం గంటసేపు కార్తీ తన న్యాయవాదితో మాట్లాడేందుకు సీబీఐ అవకాశమిచ్చింది.

కార్తీ సహకరించట్లేదు: సీబీఐ

కస్టడీలో ఉన్న కార్తీ విచారణకు సహకరించటం లేదని ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నాడని సీబీఐ అధికారులు చెబుతున్నారు. విచారణ ప్రారంభమైనప్పటినుంచీ.. అసలు విషయాలను పక్కనపెట్టి అనవసర అంశాలతో సమయాన్ని వ్యర్థం చేస్తున్నాడన్నారు. స్విగ్గీ, జొమాటోల ద్వారా తనకు భోజనం ఆర్డర్ చేయాలని పట్టుబడుతున్నారన్నారు. చెన్నై ఎయిర్‌పోర్టులో అరెస్టయినప్పటినుంచీ కార్తీ ఇలాగే వ్యవహరిస్తున్నారని.. ఎకానమీ క్లాస్‌లో ఎక్కనని, తనకు బిజినెస్ క్లాస్‌లో టికెట్ బుక్ చేయాలని పట్టుబట్టాడని వెల్లడించారు. కోర్టు కస్టడీకి ఇవ్వగానే తనకు ఇంట్లో వండిన భోజనమే కావాలని డిమాండ్ చేశాడన్నారు. బంగారు చైన్, ఉంగరం తీసేయాలని చెప్పగా.. మతవిశ్వాసమని చెప్పి నిరాకరించాడన్నారు. కోర్టులో ఉండగా తన మిత్రుడితో కార్తీ తమిళంలో మాట్లాడారు. ఇంగ్లిష్‌లో మాట్లాడాలని సీబీఐ అధికారులు కోరగా.. 'అలాగైతే.. నేను ఉన్నప్పుడు మీరు కూడా ఇంగ్లిష్‌లోనే మాట్లాడుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో 'మీరు కస్టడీలో ఉన్నారు. మేము కాద'ని అధికారులు ఘాటుగా సమాధానమిచ్చినట్లు తెలిసింది.

వివాదంలో 'గృహలక్ష్మి'

- కవర్‌పేజీపై అచ్ఛాదన లేకుండా చిన్నారికి పాలిచ్చే ఫొటో



తిరువనంతపురం: చిన్నారులకు బహిరంగ ప్రదేశాల్లోనూ పాలివ్వడంపై అవగాహన పెంచేందుకు కేరళకు చెందిన ఓ మేగజీన్ చేసిన ప్రయత్నం వివాదానికి దారితీసింది. ప్రముఖ మలయాళీ మీడియా సంస్థ మాతృభూమికి చెందిన గృహలక్ష్మి మేగజీన్ 'తదేకంగా చూడకండి. చిన్నారులకు పాలివ్వాలి' పేరుతో ఓ కథనాన్ని ప్రచురించింది.ఎదపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా చిన్నారికి పాలిస్తున్న ఓ మోడల్ ఫొటోను కవర్‌పేజీపై ప్రచురించింది. దీంతో మహిళల అసభ్య ప్రాతినిధ్య నిషేధ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ నోబెల్ మాథ్యూ అనే న్యాయవాది మేగజీన్, మోడల్ గిలూ జోసెఫ్ కేసు వేశారు. ఈ ఘటనపై కేరళ బాలల హక్కుల కమిషన్‌కూ ఫిర్యాదు అందింది. కాగా, బహిరంగ ప్రదేశాల్లోనూ పాలివ్వడంపైఅవగాహన పెంచేందుకే కథనం ప్రచురించామని మాతృభూమి సంస్థ తెలిపింది. కేరళకు చెందిన అమృత (23) చిన్నారికి పాలిస్తున్న ఫొటోను ఆమె భర్త బీజూ ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు. ఈ ఘటన స్ఫూర్తితో గృహలక్ష్మి తాజా కథనాన్ని ప్రచురించింది. మరోవైపు తనపై కేసు నమోదుకావడంపై మోడల్ గిలూ స్పందిస్తూ.. ఈ చిత్రాలను చిన్నారులకు ధైర్యంగా పాలిచ్చే తల్లులకు అంకితమిస్తున్నట్లు తెలిపారు.

అమెరికాలో ఉన్నాడని కచ్చితంగా చెప్పలేం!

వాషింగ్టన్: పీఎన్‌బీ స్కాంలో నిందితుడు, వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ అమెరికాలో ఉన్నారంటూ మీడియాలో వస్తున్న కథనాలు తమ దృష్టికి వచ్చాయని, నీరవ్ అమెరికాలో ఉన్నారని చెప్పలేమని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి చెప్పారు. అతని ఆచూకీపై భారత్‌కు సాయంపై ఆయన స్పందిస్తూ.. భారతీయ అధికారులకు న్యాయసాయానికి సంబంధించిన ప్రశ్నల కోసం న్యాయ శాఖనే సంప్రదించాలన్నారు. నీరవ్ అంశంపై స్పందించేందుకు అమెరికా న్యాయ శాఖ మాత్రం నిరాకరించింది. మరోవైపు, అమెరికాలో దివాలా పిటిషన్ దాఖలు చేసిన నీరవ్ మోదీపై రుణదాతలు ఒత్తిడి చేయకుండా న్యూయార్క్‌లోని కోర్టు తాజాగా ఆదేశాలిచ్చింది. నీరవ్‌కు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ దక్షిణ న్యూయార్క్‌లోని దివాలా కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది.

గౌరీలంకేశ్ కేసులో పురోగతి

- మాండ్య జిల్లాకు చెందిన యువకుడి అరెస్టు
- న్యాయమూర్తి ముందు నేరాంగీకార వాంగ్మూలం



బెంగళూరు: ప్రముఖ జర్నలిస్టు గౌరీలంకేశ్ హత్య కేసులో బెంగళూరు పోలీసుల విచారణలో ఓ అడుగు ముందుపడింది. ఈ కేసుకు సంబంధించి మాండ్య జిల్లాకు చెందిన నవీన్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణ తర్వాత నవీన్ నేరాంగీకార వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్‌కు సమర్పించారు. ఫిబ్రవరి 18నే నవీన్‌ను అరెస్టు చేసినా ఆలస్యంగా ఈ ఘటన వెల్లడైంది. నవీన్‌ను అక్రమ ఆయుధాల కేసులో అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా, తనే గౌరీని చంపినట్లు అంగీకరించినట్లు తెలిసింది. దీంతో నవీన్‌ను సిట్ కస్టడీలోకి తీసుకుని విచారించింది. హత్య ప్రణాళిక, వినియోగించిన ఆయుధాలు తదితర అంశాలను రాబట్టింది. 'ప్రస్తుతానికి ఒక నిందితుడినే అరెస్టు చేశాం. దీని ఆధారంగా కుట్రకు పాల్పడిన అందరినీ పట్టుకుంటాం' అని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిర్మల తెలిపారు. కర్ణాటకలోని మాండ్య జిల్లా మద్దూర్ గ్రామానికి చెందిన నవీన్‌కు 'హిందు యువసేన'తో సంబంధం ఉందని విచారణలో తేలిందన్నారు. 7.65 ఎంఎం దేశవాళీ తుపాకీతోనే గౌరీలంకేశ్ హత్య జరిగిందని ఫోరెన్సిక్ లేబొరేటరీ గతంలోనే తెలిపింది. కన్నడ సాహితీవేత్త ఎంఎం కల్బుర్గీ, మహారాష్ట్ర వామపక్ష నేత గోవింద్ పన్సారేల హత్యల్లోనూ ఇలాంటి తుపాకులే వాడారు.

వర్సిటీల్లో రిజర్వేషన్లకు కోత!

ఇకపై శాఖల వారీగా నియామకాలకు సన్నాహాలు

న్యూఢిల్లీ: దేశంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకానికి సంబంధించి రిజర్వేషన్ల అమలులో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం యూనివర్శిటీల వారీగా రిజర్వేషన్లు ఉండగా వీటికి బదులు శాఖల్లోని పోస్టులకు అనుగుణంగా రిజర్వేషన్ అమలుకు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సిద్ధమవుతున్నట్లు సమాచారం. కొత్త రిజర్వేషన్ విధానంలో యూనివర్శిటీకి బదులుగా ఒక్కో విభాగాన్ని యూనిట్‌గా పరిగణిస్తారు. దీంతో కేంద్ర విశ్వవిద్యాలయాల్లోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అధ్యాపకుల సంఖ్య తగ్గుతుంది. ఈ విధానం కోసం యూజీసీ చేసిన ప్రతిపాదనకు కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ ఓకే చెప్పిందని, త్వరలో నోటిఫికేషన్‌రానుందని సమాచారం.

అలహాబాద్ హైకోర్టు తీర్పు మేరకు..

అలహాబాద్ హైకోర్టులో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల నియామకం కేసు విచారణ సందర్భంగా గత ఏప్రిల్‌లో ఈ అంశం తెరపైకి వచ్చింది. మొత్తం యూనివర్శిటీని ప్రాతిపదికగా తీసుకోకుండా.. ఒక్కో విభాగాన్ని యూనిట్‌గా పరిగణిస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలని హైకోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లతో ముడిపడిన పది కేసుల్లో కోర్టు తీర్పుల్ని అధ్యయనం చేసిన అనంతరం.. అలహాబాద్ కోర్టు తీర్పును అన్ని విశ్వవిద్యాలయాలకు వర్తింపచేయవచ్చని యూజీసీ స్టాండింగ్ కమిటీ నివేదిక సమర్పించింది. ప్రస్తుతం యూనివర్శిటీల వారిగా రిజర్వేషన్ వర్గాలకు అధ్యాపక పోస్టుల్ని నిర్ణయిస్తున్నారు. విశ్వవిద్యాలయంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఒకే గ్రేడ్ పోస్టుల్ని(ఉదా: అసిస్టెంట్ ప్రొఫెసర్) లెక్కించి రిజర్వేషన్ కోటాను అమలు చేస్తున్నారు. కొత్త విధానం ప్రకారం ఒక శాఖలో ఒకే గ్రేడ్‌కు చెందిన మొత్తం పోస్టులకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేస్తారు. ఆ శాఖలో ఒకే ప్రొఫెసర్ పోస్టుంటే రిజర్వేషన్ అమలుకాదు. అలా కాకుండా యూనివర్సిటీలోని అన్ని శాఖల పోస్టుల్ని కలిపి రిజర్వేషన్లు అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కొన్ని పోస్టులు దక్కుతాయి.



రిజర్వేషన్ వర్గాలకు తక్కువ ప్రాతినిధ్యం

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల నుంచి ఉన్నత విద్య బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రస్తుతం చాలా తక్కువగా ఉంది. 2016 ప్రభుత్వ నివేదిక ప్రకారం...కాలేజీలు, విశ్వవిద్యాలయాలు కలిపి ప్రతి వంద మంది టీచర్లలో ఏడుగురు మాత్రమే రిజర్వేషన్ వర్గాల వారున్నారు. మొత్తం 716 యూనివర్శిటీలు, 38,056 కాలేజీల్లోని 14.1 లక్షల టీచర్లలో ఎస్సీలు 1.02 లక్షలు(7.22 శాతం), ఎస్టీలు 30 వేల(2.12 శాతం) మంది ఉన్నారు. గత ఏప్రిల్ వరకూ 41 కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోని 17,106 టీచింగ్ పోస్టుల్లో 5,997 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఈ ఇళ్లు భూగర్భంలో..!



ట్యూనీషియాలోని ఓ భూగర్భ గృహం

ట్యూనీషియాలో వందల ఏళ్లుగా భూగర్భంలోనే బెర్బెర్ జాతిప్రజలు

- స్థిరమైన ఉష్ణోగ్రత ఉండేలా ప్రత్యేక నిర్మాణం
- పట్టణీకరణ ప్రభావంతో ఖాళీ అవుతున్న గ్రామాలు
- వలస వెళ్లేందుకు కొందరు స్థానికుల విముఖత



నేషనల్ డెస్క్

సాధారణంగా మనకు ఎండ ఎక్కువగా ఉందనిపిస్తే ఫ్యాన్ లేదా ఏసీ వేసుకుంటాం. యూరప్, అమెరికా వంటి చలితీవ్రంగా ఉండే ప్రాంతాల్లో ఇళ్లను వెచ్చగా ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. అయితే ఏడారులకు సమీపంలో నివసించే ప్రజలు ప్రతిరోజూ ఈ రెండు రకాల వాతావరణ పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆఫ్రికా దేశమైన ట్యూనీషియాలో జెబెల్‌దహర్‌లోని గ్రామాల్లో నివసిస్తున్న బెర్బెర్ జాతి ప్రజలు ఈ సమస్యకు తమదైన పరిష్కారాన్ని కనుగొన్నారు. సహారా ఎడారికి సమీపంలో ఉండటంతో పగటి పూట వడగాలుల్ని, రాత్రిపూట తీవ్రమైన చలిని తట్టుకునేందుకు వీలుగా నేలను తవ్వి గుహల్లాంటి ఇళ్లను నిర్మించుకున్నారు. వలయాకారం మధ్యలో ఖాళీ ప్రదేశంతో పగలు, రాత్రి స్థిరమైన ఉష్ణోగ్రత ఉండేలా ఈ ఇళ్లను అక్కడి ప్రజలు తీర్చిదిద్దుకున్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా ఈ ఇళ్లను అక్కడి కుటుంబాలు వారసత్వంగా కాపాడుకుంటున్నాయి. సౌర విద్యుత్ సాయంతో రాత్రిపూట ప్రజలు తమ పనుల్ని చక్కబెట్టుకుంటున్నారు.

పట్టణీకరణ ప్రభావంతో..

స్థానికులు ప్రధానంగా యువత ఉపాధిని వెతుక్కుంటూ పట్టణాలకు వలసవెళుతుండటంతో ప్రస్తుతం ఈ ప్రాంతం ప్రజలు లేక వెలవెలబోతోంది. ఇళ్లతో అనుబంధం పెనవేసుకున్నవారు మాత్రం వదిలివెళ్లట్లేదు. ఈ విషయమై స్థానికురాలు లతీఫా బిన్ యహ్యా(38) మీడియాతో మాట్లాడుతూ.. 'మా నాన్న, అమ్మ చనిపోయారు. నా కుమార్తెలు వివాహం చేసుకుని వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ ఐదు గదులున్న ఇంట్లో నేనొక్కదాన్నే ఉంటున్నా. ఇప్పుడు నేను ఈ ఇంటిని వదిలేస్తే ఇల్లు మాదికాకుండా పోతుంది' అని తెలిపారు. మరికొందరు కొత్త ఇళ్లను నిర్మించుకుని ఈ భూగర్భ గృహాలను స్టోర్‌రూమ్‌లుగా మార్చుకుంటున్నారని ఆమె వెల్లడించారు. ఫ్రాన్స్ నుంచి 1956, మార్చి 20న స్వాతంత్ర్యం పొందిన తర్వాత అధ్యక్షుడు హబీబ్ బోర్గిబా 1960,70 దశకాల్లో చేపట్టిన సంస్కరణల ప్రభావంతో పలువురు బెర్బెర్ జాతి ప్రజలు ఈ భూగర్భ ఇళ్లను వదిలి పట్టణాలకు వలస వెళ్లారు. అయితే తమ జాతిని విచ్ఛిన్నం చేసేందుకే అధ్యక్షుడు హబీబ్ అప్పట్లో ఈ మార్పులు తీసుకొచ్చాడని పలువురు స్థానికులు ఆరోపించారు.

ఆదాయంపై విప్లవ పంజా

1977లో వచ్చిన 'స్టార్ వార్స్' సినిమా కోసం ఓ హోటల్ సెట్‌ను ఇక్కడ వేయడంతో ప్రత్యేకమైన నిర్మాణశైలితో ఉన్న ఈ భూగర్భ ఇళ్లకు అంతర్జాతీయంగా సందర్శకుల తాకిడి పెరిగిపోయింది. అప్పటివరకూ ఆలివ్, పామ్‌జాతి(ఈత,ఖర్జూర) చెట్ల సాగుపై ప్రధానంగా ఆధారపడ్డ స్థానికులు.. పర్యాటకుల కోసం హోటళ్లు ఏర్పాటుచేసి అదనపు ఆదాయాన్ని ఆర్జించడం మొదలుపెట్టారు. అయితే 2011లో చెలరేగిన 'అరబ్ విప్లవం'తో పరిస్థితి తారుమారైంది. విదేశీ పర్యాటకులపై ట్యూనీషియాలో దాడులు పెరిగిపోవడంతో వారి రాక తగ్గిపోయింది. ఆదాయం తగ్గిపోవడంతో పాటు వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడుతున్న తీవ్రమైన కరువు, భారీ వర్షాలను తట్టుకోలేక పలువురు ప్రజలు ఈ ఇళ్లను వదిలి మెరుగైన జీవితం కోసం పట్టణాలకు వలస వెళ్తున్నారు. ఈ ప్రాంతంలో చివరి భూగర్భ గృహాన్ని తాను 1970లో నిర్మించానని అలీ కయెల్ అనే వ్యక్తి చెప్పారు.

ఆస్ట్రేలియాలో కూడా



ఆస్ట్రేలియాలోని కూబర్‌పెడీ పట్టణంలోనూ తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కొండల్ని ఆనుకుని ఇలాంటి నిర్మాణాలే వెలిశాయి. 1915లో ఏర్పడిన ఈ పట్టణంలో ప్రస్తుతం 3,500 మంది ప్రజలుండగా వీరిలో 60 శాతం మంది కొండల్ని తొలిచి భూగర్భంలో నిర్మించిన ఇళ్లలోనే నివసిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 95 శాతం ఓపల్(ఓ రకమైన విలువైన రాయి) ఇక్కడే లభ్యమవుతోంది. కప్పడోసియా ఇళ్లు (టర్కీ), వర్డ్జియా కేవ్ సిటీ(జార్జియా), కండోవన్(ఇరాన్)లలోనూ ఇలాంటి ఇళ్లున్నాయి.

అజర్‌బైజాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం

30 మంది దుర్మరణం



అగ్నికి ఆహుతవుతున్న డ్రగ్ రిహాబిలిటేషన్ కేంద్రం

బాకు: అజర్‌బైజాన్ రాజధాని బాకులో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక మాదక ద్రవ్యాల బాధితుల పునరావాస కేంద్రంలో శుక్రవారం ఉదయం జరిగిన ప్రమాదంలో దాదాపు 30 మంది ప్రాణాలు కోల్పోయారు. కలపతో నిర్మించిన పునరావాస కేంద్రంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించటంతో కదల్లేని స్థితిలో ఉన్న రోగులు సజీవ దహనమయ్యారని అధికారులు తెలిపారు. అక్కడికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దాదాపు 200 మంది రోగులను, అక్కడి సిబ్బందిని రక్షించారు. దాదాపు 10 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రమాద కారణాలపై మరింత లోతుగా విచారణ సాగుతోందని అధికారులు చెప్పారు. అజర్‌బైజాన్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి.

మోదీని కావాలని అవమానించలేదు


కవిత

సాక్షి, హైదరాబాద్: రైతు సమస్యలపై సీఎం కేసీఆర్ భావోద్వేగంగా మాట్లాడిన సందర్భంలో దొర్లిన తప్పిదమే తప్ప ప్రధాని నరేంద్ర మోదీని అవమానించాలనే సంకుచిత ఉద్దేశం లేదని ఎంపీ కె.కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని పోతంగల్ గ్రామాన్ని దత్తత తీసుకున్న సన్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావేరి శుక్రవారం ఇక్కడ కవితతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రధానిని అవమానిస్తే దేశంలోని ప్రజలంతా ఎవరికివారే అవమానించుకున్నట్టని అన్నారు. చిన్న పొరపాటుపై బీజేపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. దేశంలో 130 కోట్ల మంది ఉంటే 600 మంది ఓట్లేసి తనను గెలిపించినట్టుగా దావోస్ పర్యటనలో మోదీ తప్పుగా మాట్లాడలేదా అని ప్రశ్నించారు. రైతుల కష్టాల పట్ల ఆవేదనతోనే సీఎం కొంచెం కటువుగా మాట్లాడారని చెప్పారు. రైతు బడ్జెట్ అని చెప్పిన కేంద్రం రైతులకు కేటాయించిందేమీ లేదని విమర్శించారు. వ్యాపార రంగానికి సంధించి 30 బిల్లులు పెట్టిన కేంద్రం రైతుల కోసం ఒక్క బిల్లు కూడా పెట్టలేదని విమర్శించారు.

కేసీఆర్ ఓ అలీ బాబా: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఓ అలీ బాబా అని, ఆయన కుటుంబసభ్యులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్ చార్ చోర్ (నలుగురు దొంగలు) అని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ వి.హన్మంతరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేకుండా పోయాయన్నారు. తెలంగాణలో ఇలాంటి నిరంకుశ, అరాచకపోకడలు ఉంటాయని ఊహించలేదన్నారు. రాజ్యసభ సీటు సంతోష్‌కు ఇస్తారా, అమరవీరుల కుటుంబాలకు ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నించారు. ప్రధాని మోదీపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధించాయంటున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నేరుగా సీఎంతోనే ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కేసీఆర్ తిడితే కేటీఆర్‌తో వివరణ తీసుకోవడం హాస్యాస్పదమన్నారు.

గుత్తా బాధ్యతల స్వీకారానికి సీఎం!

సాక్షి, హైదరాబాద్: రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వచ్చే అవకాశముందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా గుత్తా పేరును ఇటీవల సీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. కార్పొరేషన్‌ను ఢిల్లీలో రిజిస్ట్రేషన్ చేయించే పనిలో వ్యవసాయశాఖ నిమగ్నమైంది. నేడో రేపు రిజిస్ట్రేషన్ ముగియనుంది. తర్వాత జీవో జారీ చేసి అధికారికంగా గుత్తా పేరును ప్రభుత్వం ప్రకటించనుంది. గుత్తా చాంబర్‌ను బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో సిద్ధం చేశారు. అక్కడే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. శుక్రవారం సుఖేందర్‌రెడ్డి సోదరుడు, కుమారుడు కార్యాలయాన్ని పరిశీలించారు.

స్పైసెస్ బోర్డ్‌లో రాష్ట్రానికి ప్రత్యేక సెల్

పసుపు బోర్డు ఏర్పాటుపై కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు హామీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. స్పైసెస్ బోర్డు కార్యాలయంలో తెలంగాణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. పసుపు రైతుల శ్రేయస్సు కోసం తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ ఇటీవల కేంద్రానికి లేఖ రాశారు. మార్కెటింగ్, రీసెర్చ్ ద్వారా పసుపు పంటను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రాల వ్యవసాయ శాఖలపై ఉంటుందని పేర్కొన్నారు. స్పందించిన కేంద్ర మంత్రి ప్రత్యేక సెల్‌ను స్పైసెస్ బోర్డులో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

జడ్చర్లలో 100 పడకల ఆసుపత్రి: లక్ష్మారెడ్డి

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో రూ.20 కోట్ల వ్యయంతో 100 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నారు. వైద్య శాల నిర్మాణ నమూనాలను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి సి.లక్ష్మారెడ్డి శుక్రవారం పరిశీలించారు. శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం చేపట్టిన ఏడాదిలోగా భవనం ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

అరకొర వేతనాలు.. భద్రతలేని బతుకులు



– ఎంటెక్ పూర్తి చేసిన ఆనంద్‌కుమార్ ఖమ్మంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్. కొంతకాలం వేతనాలు బాగానే ఇచ్చారు. కానీ ఏడెనిమిది నెలలగా జీతం రావడం లేదు. అదేమంటే ఫీజు బకాయిలు రావాల్సి ఉంది. వచ్చాక ఇస్తాం.. లేదంటే మీ ఇష్టం అని యాజమాన్యం తేల్చి చెబుతోంది. నల్లగొండలోని ఓ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌దీ ఇదే పరిస్థితి.

– హైదరాబాద్ శివారులోని కొద్దిగా పేరున్న ఇంజనీరింగ్ కాలేజీలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్ కుమార్ వేతనం నెలకు రూ.90 వేలుగా మాట్లాడుకున్నారు. యాజమాన్యం ఆయన ఖాతాలో మొత్తం వేతనం వేస్తున్నా.. అందులోంచి రూ.40 వేలు వెనక్కి తీసుకుంటోంది. వేరే కాలేజీలకు వెళితే ఈ మాత్రం వేతనం కూడా ఇచ్చే పరిస్థితి లేక అక్కడే కొనసాగుతున్నారు.

– సాక్షి, హైదరాబాద్

వృత్తి విద్య కాలేజీల్లో ఫ్యాకల్టీ కష్టాలు

- కొద్దినెలలుగా వేతనాలు అందని దుస్థితి
- 'ఫీజు' బకాయిలు రాకపోవడమే కారణమంటున్న యాజమాన్యాలు
- అధిక వేతనాలు ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకుంటున్న వైనం
- ఫ్యాకల్టీ–విద్యార్థుల నిష్పత్తిని ఏఐసీటీఈ తగ్గించడంతో కొత్త సమస్య
- వేలాది ఉద్యోగుల మెడపై వేలాడుతున్న తొలగింపు కత్తి

.. వీరిదే కాదు.. రాష్ట్రంలోని చాలా వృత్తి విద్య కాలేజీల్లో ఇదే తరహా పరిస్థితి ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందక ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిన కాలేజీలు కొన్ని అయితే... సరిగా వేతనాలు చెల్లించని యాజమాన్యాలు మరికొన్ని. మొత్తంగా కాలేజీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి కష్టాలు వచ్చిపడ్డాయి. ఇలా 2 లక్షల మంది వరకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నట్లు అంచనా. ఇక అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కొత్తగా తెచ్చిన నిబంధనతో వేలాది మంది ఫ్యాకల్టీ రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది.

'ఫీజు' నిధులు అందక..

రాష్ట్రంలో మూడు వేల వరకు సాంకేతిక, వృత్తి విద్య, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ కాలేజీలు ఉండగా.. అందులో రెండు వేలకు పైగా ప్రైవేటు కాలేజీలే. ఇందులో సుమారు 1,100 కాలేజీల యాజమాన్యాలు సిబ్బందికి వేతనాలు సరిగా ఇవ్వడం లేదని అంచనా. నాలుగైదు నెలల నుంచి 10 నెలల వరకు వేతనాలు పెండింగ్‌లోనే ఉంటున్నట్లు ఫ్యాకల్టీ అసోసియేషన్ కూడా చెబుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిన ప్రతిసారి.. యాజమాన్యాలు బోధనా సిబ్బందికి సగం, బోధనేతర సిబ్బందికి నాలుగో వంతు బకాయిలు మాత్రమే చెల్లిస్తున్నాయని, దాంతో తాము ఇబ్బంది పడాల్సివస్తోందని పేర్కొంటోంది. మరోవైపు ప్రభుత్వం సకాలంలో ఫీజు నిధులు చెల్లించకపోవడంతో అప్పులు తెచ్చి కాలేజీలను నడపాల్సి వస్తోందని, వడ్డీ భారంగా మారుతోందని యాజమాన్యాలు చెబుతున్నాయి. జీతాలు సకాలంలో ఇవ్వలేని పరిస్థితిలో మంచి ఫ్యాకల్టీని కోల్పోవాల్సి వస్తోందని అంటున్నాయి.

ఉద్యోగులపై వేలాడుతున్న కత్తి

ఇప్పటికే అరకొర వేతనాలతో అవస్థలు పడుతున్న పరిస్థితుల్లో.. బోధన సిబ్బందికి మరో శరాఘాతం తగిలింది. ఏఐసీటీఈ కాలేజీల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:15 నుంచి 1:20కి పెంచడంతో బోధనా సిబ్బంది అవసరం తగ్గింది. దాంతో బోధనా సిబ్బందిని తగ్గించుకునేందుకు కాలేజీల యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. ఫ్యాకల్టీకి నోటీసులు జారీ చేస్తున్నాయి. దీంతో దాదాపు 5 వేల మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.

జీతాల్లేకుండా బతికేదెలా?



"వేతనాలు సకాలంలో ఇవ్వకపోతే ఉద్యోగులు ఎలా బతకాలి. ఫీజు బకాయిలు ఆలస్యంగా వస్తాయని తెలుసు. అయినా జీతాల చెల్లింపునకు యాజమాన్యాలు ఏర్పాట్లు చేయడం లేదు.." – కె.రవిప్రకాశ్, ఫ్యాకల్టీ

పాత విధానం కొనసాగించాలి



"ఫ్యాకల్టీ–విద్యార్థుల నిష్పత్తిని తిరిగి 1:15కు తగ్గించాలి. ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీనిపై పోరాటం చేస్తాం.." – బాలకృష్ణారెడ్డి, ప్రైవేటు ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు

అది ప్రజల మాటే

కేటీఆర్ 'జానాబాబా 40 దొంగల' వ్యాఖ్యలపై మంత్రి జగదీశ్‌రెడ్డి

- ఆ మాటల్లో అనుచితమేమీ లేదని వెల్లడి
- జానారెడ్డికి కాంగ్రెస్‌లోనే గౌరవం లేదని వ్యాఖ్య
- నల్లగొండ సభలో నేతల అసభ్య పదజాలాన్ని ఎందుకు ఖండించలేదని ప్రశ్న


శుక్రవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో పూల రవీందర్, గంగాధర్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: 'జానాబాబా 40 దొంగలు'అంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన కుసంస్కారానికి నిదర్శనమంటూ సీఎల్పీ నేత జానారెడ్డి విమర్శించడాన్ని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తప్పుబట్టారు. రాష్ట్రాన్ని 60 ఏళ్లు పాలించి దోచుకున్న కాంగ్రెస్ నేతల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో మంత్రి కేటీఆర్ కూడా అదే మాట అన్నారని, ఇందులో అనుచితమేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను నిత్యం బండ బూతులు తిట్టే కాంగ్రెస్ నేతలు నీతులు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పార్టీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, పూల రవీందర్‌తో కలసి శుక్రవారం టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. గుడ్డలు ఊడదీసి కొడతాం, దవడలు పగులగొడతామంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే ఆ పార్టీలోని పెద్దలకు సంస్కారం గుర్తురాలేదా అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. జానారెడ్డికి కాంగ్రెస్‌లో గౌరవం లేకున్నా, ముఖ్యమంత్రి కేసీఆర్ గౌరవం ఇస్తున్నారని చెప్పారు. నల్లగొండ సభలో జాతీయ నాయకుల ముందే కాంగ్రెస్‌లో కొత్తగా చేరిన నాయకులు అసభ్యంగా మాట్లాడితే ఎందుకు ఖండించలేదని జానారెడ్డిని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ నేతలను ఇంటికి పంపించడానికే ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. మంత్రి కేటీఆర్ ప్రజల మెప్పు పొంది నాయకుడయ్యారని జగదీశ్‌రెడ్డి చెప్పారు. టీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోపై అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ నేతలకు చేతనైతే అసెంబ్లీలో మాట్లాడాలని సవాల్ చేశారు.

కాంగ్రెస్‌పైనే ప్రజాగ్రహం

తెలంగాణ వస్తే చీకటి రోజులు వస్తాయంటూ నాటి కాంగ్రెస్ నేత, ఉమ్మడి ఏపీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి బెదిరించారని...కానీ ప్రస్తుతం తెలంగాణ ప్రజలు, రైతులకు 24 గంటల నిరంతర కరెంటును ఇస్తున్నామని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. విత్తనాల కోసం రోజుల తరబడి క్యూలలో నిలబెట్టిన పాలన కాంగ్రెస్ పార్టీదని... ఇంటికే విత్తనాలను పంపిస్తున్న పార్టీ తమదన్నారు. మోసకారి కాంగ్రెస్ నేతలపై ప్రజలకు కోపం ఉంటుందా లేక అన్ని హామీలనూ నెరవేరుస్తున్న టీఆర్‌ఎస్ మీద ప్రజలకు కోపం ఉంటుందా అని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ చేస్తున్న కృషి వల్ల తెలంగాణ పేరు మూడేళ్లలోనే ప్రపంచంలో మారుమోగిపోతోందన్నారు. గ్రామస్థాయి నుంచి కుటుంబ రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని విమర్శించారు.

ఎన్ని నిర్బంధాలున్నా వెనుదిరిగేది లేదు

సీఎంకు లేఖలు పోస్టు చేసిన కోదండరాం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా నిరుద్యోగుల సమస్య పరిష్కారమయ్యేదాకా వెనుదిరిగేది లేదని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం చెప్పారు. తెలంగాణ జేఏసీ నిర్వహిస్తున్న నిరుద్యోగుల పోస్టుకార్డుల ఉద్యమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం సభకు, ర్యాలీకి ప్రభుత్వం అనుమతించకుండా నిర్బంధం విధించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను ప్రకటించాలని, కేలండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించాలని, నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి విద్యార్థులు, నిరుద్యోగులతో కలసి పోరాడుతామన్నారు. అనంతరం ఎర్రమంజిల్‌లోని పోస్టుడబ్బాలో స్వయంగా రాసిన పోస్టుకార్డును సీఎం కేసీఆర్‌కు కోదండరాం పోస్టు చేశారు.

101వ రోజు
02-03-2018, శుక్రవారం
గాడిపర్తివారి, ప్రకాశం జిల్లా



బాబు ఇంత దగా చేస్తారా అని రైతులు భగ్గుమంటున్నారు..

పల్లె ప్రగతికి పచ్చ కామెర్లొచ్చాయి. అధికార పార్టీ అవినీతి చీడ పట్టింది. బండ్లమూడి గ్రామంలో టీడీపీ నేతల అవినీతిని రమణారెడ్డి అన్న పూసగుచ్చినట్టు చెప్పాడు. పేదోడి పొట్ట నింపే ఉపాధి హామీ నిధులు ఎలా కొల్లగొడుతున్నారో తెలిపాడు. ఆ ఊళ్లో వాటర్‌షెడ్ పథకం కింద ఫామ్ పాండ్స్ నిధులు మొత్తం టీడీపీ నేతలు తినేశారట. గుంతలన్నీ జేసీబీలతో తవ్వించి.. రికార్డుల్లో కూలీలే తవ్వినట్టు చూపించారని చెప్పాడు. పెన్షన్, బియ్యం ఆపేస్తామని బెదిరించి కూలీలతో వేలిముద్రలేయించుకుని నిధులన్నీ నొక్కేశారట. ఆ గ్రామంలో ఎప్పుడో కట్టిన నాడప్స్ (కంపోస్ట్ తయారు చేసే తొట్లు)కు, అసలు కట్టని వాటికీ లక్షల్లో నొక్కేశారట. ఎంత అన్యాయం! ఉపాధి హామీ నిధులన్నీ పేదవాడికే చెందాలని అప్పట్లో నాన్నగారు అనుకున్నారు. కార్యాచరణలో పెట్టారు. పేదోడిపై కనికరం లేని టీడీపీ సర్కార్ జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నేతలకు దోచిపెడుతోంది. ఇది క్షమించరాని నేరం.

చీమకుర్తికి చెందిన సుబాబుల్, జామాయిల్ రైతన్నల కన్నీరు నన్ను కదిలించింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకు టన్ను సుబాబుల్‌కు రూ.4,200, జామాయిల్‌కు 4,400 మద్దతు ధర ఇస్తూ ప్రభుత్వం జీవో తెచ్చింది. కానీ అది అమలు కాలేదని వాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు కుమ్మక్కై మా నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. జామాయిల్‌కు టన్నుకు రూ.1,800, సుబాబుల్‌కు రూ.2,500కు మించి రావడం లేదన్నారు. ప్రభుత్వం చేసిన జీవోకే దిక్కులేకపోతే ఎలా? రైతన్న అంటే చంద్రబాబుకు ఇంత చులకనా అని ప్రశ్నించారు. నాన్నగారి హయాంలో జామాయిల్‌కు టన్నుకు రూ.4,600, సుబాబుల్‌కు రూ.4,200 దక్కిందని గుర్తు చేశారు. చంద్రబాబే దళారిగా మారాడు. రైతన్న కన్నీళ్లు అమ్ముకుంటున్నాడు. ఈ వ్యవస్థ మారాలి. రైతన్నకు పూర్వ వైభవం తేవాలి.

చంద్రబాబు రుణమాఫీ మోసానికి బలవ్వని రైతు ఈ రాష్ట్రంలో ఉండడేమో! బండ్లమూడి గ్రామ రైతు శ్రీనివాసరావు ఆవేదన విన్నాక ఇది నిజమనిపించింది. ఎన్నికల ముందు రైతు రుణాలన్నీ మాఫీ చేస్తానన్న బాబు మాటలను అందరిలాగే ఆయనా నమ్మాడు. అప్పటికప్పుడు టీడీపీ సభ్యత్వం తీసుకున్నాడు. ఆ పార్టీకి ఓటేశాడట. బాబొస్తే.. స్థానిక సహకార బ్యాంకులో పాసుబుక్కులు పెట్టి తెచ్చిన రూ.80 వేల అప్పు మాఫీ అవుతుందని ఆయన చిన్న ఆశ. బాబొచ్చాక గానీ అసలు సంగతి తెలియలేదు. మొదటి విడత కింద రూ.16,452 రుణ మాఫీ వచ్చిందట. ఆ వచ్చింది వడ్డీకి కూడా సరిపోదని బ్యాంకోళ్లు అన్నారట. తల తాకట్టు పెట్టయినా అప్పు కట్టాల్సిందేనని నిలదీయడంతో అప్పు చేసి రూ.20 వేలు కట్టానన్నాడు. అయినా బ్యాంకులో అప్పు రూ.1.10 లక్షలు ఉందని నోటీసు పంపారని బావురుమన్నాడు. మార్చిలోగా తీర్చకుంటే ఉన్న రెండెకరాలు వేలం వేస్తామని అధికారులు హెచ్చరించారని చెప్పాడు. చంద్రబాబు మోసమేంటో ఆయనకు ఇప్పుడు బోధపడింది. ఇంత దగా చేస్తాడా అని భగ్గుమంటున్నాడు. నమ్ముకుంటే నట్టేట ముంచుతాడా? ఉన్న భూమి అమ్ముకునేలా చేస్తాడా? అంటూ నిప్పు కణికల్లా మారిన ఆయన నేత్రాలు ప్రశ్నిస్తున్నాయి. అయ్యా చంద్రబాబూ.. ఇది ఈ రైతన్న గుండెమంటే కాదు.. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతన్నల ఆందోళన.

ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న. అయ్యా చంద్రబాబు గారూ.. రాష్ట్రంలో లక్షలాదిమంది రైతన్నలు మీ మోసానికి అప్పులపాలయ్యారు. బ్యాంకుల గడప తొక్కలేని పరిస్థితికి తెచ్చావంటున్నారు. వారికేం సమాధానం చెబుతావు? మీరిచ్చిన జీవో ప్రకారమే రైతన్నలకు మద్దతు ధర లభించకపోతే ఆ జీవోలకు కానీ, వాటిని ఇచ్చిన మీకు కానీ విలువ ఏమైనా ఉందా? దోచుకున్న ప్రతిదాంట్లో వాటాలు పంచుకోండి అంటూ మీరే పంచాయితీలు చేశారని స్వయంగా మీ మంత్రిగారే చెప్పారు. పై స్థాయిలో మీరే అలా ఉంటే మీ అనుచరులు దోచుకోకుండా ఉండగలరా? ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా?

వైఎస్. జగన్

తెలంగాణకు 24.. ఏపీకి 9..

- సాగర్, శ్రీశైలంలో నీటి వాడకంపై కుదిరిన అవగాహన
- ఈ నెలాఖరు వరకు సాగు అవసరాలకు వాడుకునేందుకు కృష్ణా బోర్డు ఓకే
- తాగు అవసరాలకు కనీస మట్టాలకు దిగువకు వెళ్లాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని నాగార్జునసాగర్, శ్రీశైలంలో లభ్యతగా ఉన్న 33 టీఎంసీల జలాల్లో తెలంగాణకు 24 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 9 టీఎంసీలు కేటాయిస్తూ కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇరురాష్ట్రాల సాగునీటి అవసరాల దృష్ట్యా ఈ నెలాఖరు వరకు ఈ నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఇచ్చింది. నాగార్జున సాగర్ వద్ద కృష్ణా జలాల వివాదం నేపథ్యంలో శుక్రవారం జలసౌధలో కమిటీ సమావేశమైంది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ, ఏపీ ఇరిగేషన్ ఈఎన్‌సీలు మురళీధరరావు, వెంకటేశ్వరరావు, నాగార్జున సాగర్ సీఈ ఎస్.సునీల్, కర్నూలు సీఈ నారాయణ రెడ్డి, అంతర్రాష్ట్ర జలవనరుల సీఈ నరసింహారావు పాల్గొన్నారు. భేటీ సందర్భంగా తొలుత ఏపీ తన అవసరాలను పేర్కొంది. జనవరి 10న జరిగిన కృష్ణా బోర్డు కమిటీ సమావేశంలో తమకు కేటాయించిన 60 టీఎంసీలను పూర్తిగా వాడుకోలేదని తెలిపింది. అందులో మిగిలిన కోటాతో కలిపి 30.38 టీఎంసీల నీటి అవసరాలు ఉన్నాయని ఏపీ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. 60 టీఎంసీలకు మించి వాడుకున్నామని బోర్డు సభ్య కార్యదర్శి లేఖ రాయడాన్ని తప్పుబట్టారు. సాగర్ ఎడమ కాల్వకు ఫిబ్రవరి 26 వరకు 16.728 టీఎంసీలు ఏపీ వాడుకున్నట్లు పేర్కొన్నారని, ఏపీ సరిహద్దు వద్ద 7.49 టీఎంసీలు మాత్రమే చేరిందని తెలిపారు. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా కోటా పూర్తయిందనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సాగర్ కుడి కాల్వకు 10.66 టీఎంసీలు, ఎడమ కాల్వకు 7.72 టీఎంసీలు, కృష్ణా డెల్టాకు 8 టీఎంసీలు, హంద్రీనీవాకు 4 టీఎంసీలు అవసరమని కోరారు.

లభ్యత నీరంతా మాకే: తెలంగాణ

ఏపీ ప్రతిపాదనలపై తెలంగాణ అభ్యంతరాలు లేవనెత్తింది. ఇప్పటికే అదనంగా 2 టీఎంసీలకు మించి వినియోగం చేసిందని, హంద్రీనీవా ద్వారా నీటిని తీసుకుంటూనే ఉంటోందని స్పష్టం చేసింది. ప్రస్తుత లభ్యత నీరంతా తెలంగాణకే దక్కుతాయని పేర్కొంది. ఆగస్టు వరకు 46 టీఎంసీల అవసరం ఉన్నట్టు తెలిపింది. అయితే ఏపీ సాగు అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని బోర్డు సూచించడంతో మొత్తం కనీస నీటి మట్టాలకు ఎగువన లభ్యతగా ఉన్న 33 టీఎంసీల్లో 9 టీఎంసీలు ఏపీకి ఇచ్చేందుకు అంగీకరించింది.

కాంగ్రెస్, బీజేపీల అంతం ఖాయం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే

- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల బరిలోకి..
- ఏఐఎంఐఎం 60వ వార్షికోత్సవ సభలో అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి



సాక్షి,హైదరాబాద్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల అంతం ఖాయమని ఆల్ ఇండియా మజ్లిస్–ఏ–ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ దారుస్సలాంలో ఏఐఎంఐఎం 60వ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ పతాకాన్ని ఒవైసీ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ బస్సు యాత్రలు, పాదయాత్రలతో కాంగ్రెస్, బీజేపీల పప్పులు ఉడకవని, ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్–బీజేపీ దొందూ దొందేనని, షరియత్ సమస్య వస్తే కాంగ్రెస్‌లో గల ఒకే ఒక్క ముస్లిం ఎంపీకి పార్లమెంట్‌లో నోరు విప్పేందుకు పార్టీపరంగా అనుమతి లేకుండా పోయిందన్నారు.

మోదీ హయాం.. కుంభకోణాల మయం

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుంభకోణాల మయమైందని, వేల కోట్లు దిగమింగి, విదేశాలకు పారిపోతున్నారని దుయ్యబట్టారు. కేంద్రం ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతోందని, ఎన్నికలు ఎప్పుడు పెట్టినా పోరుకు సిద్ధమేనని ప్రకటించారు. తమ పని తీరే తమకు గుర్తింపని, ఇప్పటికే ఉత్తరప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఎన్నికల బరిలో దిగామని, త్వరలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో రెండు లక్షల ఓట్ల మెజార్టీ సాధిస్తామని, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీని పరాజయం పాలు చేయడం ఖాయమని అన్నారు. హైదరాబాద్ పాతబస్తీకి మెట్రో రైలు రావడం ఖాయమన్నారు. ఫలక్‌నుమా నుంచి ఎయిర్ పోర్టు వరకు ఒక లైన్, నాగోల్, మలక్‌పేట, పురానాపూల్ వరకు మరో లైన్‌ను సాధించి తీరుతామన్నారు.

70 ఏళ్లలో కాంగ్రెస్ చేసింది శూన్యం

70 ఏళ్లలో కాంగ్రెస్ మతకలహాలు తప్ప ముస్లిం వర్గాలకు చేసింది శూన్యమని మజ్లిస్ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మజ్లిస్ పార్టీ 60 ఏళ్లలో యావత్ ముస్లింల గళంగా, బలంగా మారిందని గుర్తుచేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ మజ్లిస్ చలవేన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే మిగతా రాష్ట్రాల్లో అమలుచేసి ఉండేదన్నారు.

బాబును నమ్మి మోసపోయామన్నా..


ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎదుట వాపోయిన జనం
మనందరి ప్రభుత్వం రాగానే ఆదుకుంటామని జననేత హామీ

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

సార్.. ఉపాధి హామీ పథకం అమలులోనూ ఈ ప్రభుత్వం పక్షపాతం చూపిస్తోంది. అదేమంటే మీరందరూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, మీకు జాబ్ కార్డులు ఇవ్వం అని స్థానిక తెలుగుదేశం నాయకులు తెగేసి చెబుతున్నారు. మీరే ఏదయినా మార్గం చూపాలి.
– ఓ మహిళా కార్మికురాలి ఆవేదన

అయ్యా.. ఈ ప్రాంతంలో సుబాబుల్, జామాయిల్, సరుగుడు సాగు చేసే రైతులు ఎక్కువ. సాక్షాత్తు వ్యవసాయ మంత్రి నాయకత్వంలోని కమిటీయే మాకు ధరలు ఖరారు చేసి జీవోలు ఇచ్చింది. అయినా ఆ ధర అమలు కావడం లేదు. ఈ ప్రభుత్వాన్ని నమ్మి మేము మోసపోయాం. మా జీవితాలు దళారుల చేతిల్లో నలిగిపోతున్నాయి.
– జామాయిల్ రైతుల కడుపుకోత

అన్నా.. రుణమాఫీ చేస్తామంటే ఆవేళ నమ్మి ఓటేశాం. ఇవాళ ఈ ప్రభుత్వం ఇచ్చే డబ్బులు పంట రుణాల మీద వడ్డీలకు కూడా సరిపోవడం లేదు. బ్యాంకుల్లో కొత్త అప్పులు ఇవ్వడం లేదు. నమ్మినందుకు ఈ పాలకులు మమ్మల్ని నిండా ముంచారు.
– రైతుల క్షోభ


శుక్రవారం ప్రకాశం జిల్లా చీమలమర్రిలో మహిళా కూలీల సమస్యలు వింటున్న ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

..ప్రజా సంకల్పయాత్రలో ఉన్న ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దారిపొడవునా అందుతున్న ఫిర్యాదుల్లో ఇవి మచ్చుకు మూడు. వివిధ వర్గాల ప్రజలు నిత్యం తమ కష్టాలను జననేతకు చెప్పుకుంటున్నారు. ఈ ప్రభుత్వం వల్ల తమకు ఒనగూరింది ఏమీ లేదని, నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా అడ్డుకుంటున్న అభిమానం.. ప్రేమ, ఆప్యాయతలు, వినతుల వెల్లువ నడుమ శుక్రవారం 101వ రోజు ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలో ప్రతిపక్ష నేత ప్రజాసంకల్ప యాత్రసాగింది. జగన్‌కు ఊరూరా ఎంతటి ఘన స్వాగతం లభించిందో.. అదే స్థాయిలో వినతులు, విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. పాదయాత్రలో ఉన్న జగన్‌ను చూసేందుకు పొగాకు తోటల్లో పని చేస్తున్న మహిళా కూలీలు బిలబిలమంటూ రహదారిపైకి పరుగెత్తుకొచ్చారు. వారిని చూసి జగన్ కాసేపు ఆగారు. ఏమమ్మా బాగున్నారా.. అంటూ ఆప్యాయంగా పలుకరించారు. 'అన్నా.. మాది మంచికలపాడు. రోజంతా పని చేసినా వంద రూపాయల కూలి దొరకడం లేదు. ఆకు కొట్టడానికి (పొగాకు చెట్లకు ఉండే ఆకును తుంచడం) వెళితే రూ.వంద, ఆకు కొట్టి, కర్రకు అల్లి బ్యార్నీలో పెడితే రూ.300 ఇస్తున్నారు. మా ఊళ్లో మాకు జాబు కార్డులు లేవని పనులకు పిలవడం లేదు. మేము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లేశామని మాకు జాబు కార్డులు ఇవ్వలేదు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఒక్క ఏడాది ఓపిక పట్టండి.. మన ప్రభుత్వం రాగానే అందరికీ ఉపాధి చూపుతాం' అని జగన్ భరోసా ఇచ్చారు. ఇప్పటికే ప్రకటించిన నవరత్నాలతో అందరినీ ఆదుకుంటామన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మంత్రుల మాటలు నీళ్ల మూటలుగా మిగిలాయని సుబాబుల్, జామాయిల్, సరుగుడు రైతులు జగన్ ఎదుట వాపోయారు. రైతు నేతలు బొడ్డు కోటేశ్వరరావు, సీహెచ్ బ్రహ్మయ్య నాయకత్వంలో పలువురు రైతులు చీమకుర్తి సమీపంలో జగన్‌ను కలిసి తమ గోడు వినిపించారు. జగన్ బదులిస్తూ.. మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని, మనందరి ప్రభుత్వం రాగానే రైతుల్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఢిల్లీ వెళ్లే ప్రజాప్రతినిధులతో నేడు జగన్ భేటీ

ప్రత్యేక హోదా సాధన పోరులో భాగంగా ఈనెల 5న దేశ రాజధాని ఢిల్లీలో తెలుగు వాణి ప్రతిధ్వనించేలా నిర్వహించనున్న ధర్నాకు తరలివెళ్లే ప్రజాప్రతినిధులతో ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం భేటీ కానున్నారు. ప్రకాశం జిల్లా దర్శి అసెంబ్లీ నియోజకవర్గం తాళ్లూరు మండలంలో పాదయాత్ర సాగిస్తున్న జగన్.. కొర్రపాటివారి పాలెం క్రాస్‌రోడ్డ్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఉదయం 10 గంటల ప్రాంతంలో పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశం అవుతారని వైఎస్ జగన్ రాజకీయ కార్యదర్శి, ప్రకాశం జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఢిల్లీ వెళ్లే ప్రజాప్రతినిధుల బృందానికి జగన్.. జెండా ఊపి వీడ్కోలు పలుకుతారన్నారు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం, 3-3-2018



ఆంబోతులూరు

పచ్చని పైరును ఆంబోతులు మేయడానికొస్తే
చేసేం చేయగలుగుతుంది?!
డొక్కలెండిన కాపు ఏం చేయగలుగుతాడు?
ఆ ఊళ్లో ఓ పచ్చని కుటుంబం.
ఓ తల్లి, ఇద్దరు ఆడపిల్లలు.
ఆ కుటుంబంపై ఊళ్లోని ఆంబోతులు కన్నేశాయి.
ఇంటి మీద పడ్డాయి. ఒంటి మీద పడ్డాయి.
తర్వాత ఏం జరిగింది?
ఆ తల్లి తన కుటుంబాన్ని ఎలా కాపాడుకుంది?
భర్త బాధ్యత లేకుండా వదిలేసి వెళితే..
బరువు భుజాలపై వేసుకుని
జీవితాన్ని లాక్కొచ్చిన ఓ భార్య కథ ఇది.

పరుగులాంటి నడకతో ఇంట్లోకి వచ్చి తలుపులు బిడాయించింది నా చిన్నకూతురు.

కనుకొలకుల్లో నీరు. కోపంతో ఎర్రబారిన ముఖం.

ఆ పోకిరీలు ఇవాళ కూడా వేధించారన్నమాట.

ఇంటి దాకా వెంటాడారన్నమాట.

బయటకెళ్లి వాళ్లతో తలపడదామని తలుపులు తీయబోయాను. నా కూతురు వారించింది.

నేను వినకూడని మాటలు వినాల్సి వస్తుందేమోనని దాని భయం. అనేక గాయాలతో బాధపడుతున్న నన్ను ఇంకాస్త గాయపడకుండా చూడాలనేది దాని తపన. కానీ అది సాధ్యం కాదు. ఎందుకంటే నా మనసంతా గాయాలే. నేనే ఒక నడిచే గాయాన్ని. లోతైన ఈ గాయాల గురించి ఎవరికైనా అర్థం చేయించాలంటే నా వైవాహిక జీవితం గురించి మాట్లాడాల్సిందే.

• ❖ •

నా భర్త బాధ్యత లేని మనిషి. బిడ్డల భారాన్ని నామీద వదిలేసి ఎటో వెళ్లిపోయాడు.

దీంతో కొన్ని ఆంబోతులు నా మీద కన్నేశాయి. నన్ను లొంగదీసుకునే ప్రయత్నాలు చేశాయి. వాళ్లను ఖాతరు చేయనందుకు ఆగ్రహించాయి. పక్క ఊరికి చెందిన ఓ వ్యక్తితో నాకు స్నేహం కుదిరింది. పిల్లల అంగీకారంతో మేం దంపతులమయ్యాం. నాకు గుండె జబ్బు చేస్తే ఆయనే ఆపరేషన్ చేయించారు. నా పెద్ద కూతురికి పెళ్లి చేసింది కూడా ఆయనే.

ఊళ్లో నా మీద కన్నేసిన వాళ్లు దీన్ని తట్టుకోలేకపోయారు. నన్ను ఓ ఉంపుడుగత్తెగా ప్రచారం చేసి నా కుటుంబాన్ని చులకనగా చూశారు. మేం భార్యాభర్తలమన్నా వినిపించుకోలేదు. నన్ను లొంగిపొమ్మని వేధించారు. వాళ్లను కాదన్నందుకు కక్ష గట్టారు.

నా భర్తపై దాడి చేశారు. ఆ దృశ్యాల్ని వీడియో తీసి వాట్సాప్‌ల ద్వారా ప్రచారంలో పెట్టారు. అది పోలీసులకు చేరింది. వారు ఆ వీడియో ఆధారంగా దాడి చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. మా స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు.

• ❖ •

నేను లొంగక పోవడంతో నా చెల్లెల్నీ, నా ఇద్దరి కూతుళ్లనీ వేధించడం మొదలుపెట్టారు వాళ్లు. వారం రోజులపాటు అసభ్యమైన కామెంట్లతో హింసపెట్టారు. వీధిలోని యువకుల్ని మా అమ్మాయిలపైకి ఉసిగొల్పారు. వాళ్లు ఉద్యోగాలు చేసే చోట చెడు ప్రచారం చేశారు. వాళ్లని ఉద్యోగాల్లోంచి తీసేయించే ప్రయత్నాలు చేశారు. పోలీసులకి స్టేట్‌మెంట్ ఇచ్చినందుకు మాపై కక్షగట్టారు.

మా ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి వాళ్లని వెనకేసుకొచ్చాడు. అతని అండ చూసుకుని మా వీధి యువకులు రెచ్చిపోయారు. ఓ రోజు ఆరుగురు అబ్బాయిలు ముఖాలకు ముసుగులు వేసుకుని మా ఇంట్లోకి వచ్చారు. నన్నూ మా అమ్మనీ చంపేస్తామని బెదిరించారు. నా చెల్లీ కూతుళ్లపై లైంగిక దాడికి ప్రయత్నించారు. వారి అంగాంగాల్ని తాకుతూ హింసించారు. గట్టిగా ప్రతిఘటించి తమను తాము కాపాడుకున్నారు వాళ్లు.

అవమానం తట్టుకోలేక, ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాం. కాస్త ఆలోచించాక, మా ఆలోచన సరి కాదనిపించింది నాకు. ధైర్యం చేసి పోలీసు స్టేషన్‌కి వెళ్లాను. మాకు జరిగిన అవమానాల్నీ అన్యాయాల్నీ పూసగుచ్చినట్టు వాళ్లకి వివరించాను. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నా భర్తను కొట్టినందుకు, నా చెల్లీ కూతుళ్లపై లైంగిక దాడులకు ప్రయత్నించినందుకు మొత్తం 18 మందిపై 'నిర్భయ' 'పోక్సో' (Protection of Children from Sexual Offences - POCSO) కింద కేసులు నమోదు చేసి, అరెస్టు చేశారు. పోలీసుల్ని ఆశ్రయించాక వాళ్లు మా జోలికి రావట్లేదు. ఇప్పటికైతే కొంత రక్షణ లభించింది మాకు.

(లలిత కేస్ స్టడీ)

– పరసా సుబ్బారావు,
'సాక్షి' అమలాపురం టౌన్

ఎల్‌సీసీలు ఏవీ?

ప్రతి స్త్రీకి తన జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు ఉంది. ఇష్టం లేని వాణ్ణి తిరస్కరించే హక్కూ ఉంది. మొత్తంగా తమ జీవితాల్ని తాము నిర్దేశించుకునే హక్కులున్నాయి స్త్రీలకి. వాళ్ల మీద పెత్తనం చేయబూనుకోవడం ఎంతైనా దారుణం. లలిత కేసులో మాదిరిగా స్త్రీలపై పోలీసింగ్ చేయడానికి, ఆమె సెక్సువాలిటీని కంట్రోల్ చేయడానికి తనకు అధికారం ఉందని ఈ పురుష సమాజం భావిస్తోంది. ఆమెను వెంటాడి వేధించే అధికారం తనకుందని అనుకుంటోంది. స్త్రీలను చెప్పుచేతుల్లోకి తీసుకోవడానికి.. కుదరకపోతే ఆమెపై పెత్తనం చేయడానికి.. అది కూడా సాధ్యం కాకపోతే దుష్ప్రచారం చేయడానికి.. అంతిమంగా దాడికి సైతం దిగేందుకు తెగిస్తోంది. ఇలాంటి పితృస్వామ్య ధోరణుల్ని అడ్డుకోవడానికి, వీటిపై సమాజాన్ని సెన్సిటైజ్ చేయడానికి మహిళా ఉద్యమాలు కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ చట్టం లాంటివి వచ్చాయి. కానీ వాటి అమలు గురించి ప్రభుత్వ శాఖలు పట్టించుకోవడం లేదు. చాలా కంపెనీల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు కావడం లేదు. స్థానిక ఫిర్యాదుల కమిటీల (ఎల్‌సీసీ) ఊసే లేదు. లలిత లాంటి బాధిత మహిళలకు సాయపడేందుకు స్థానిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు కావాల్సివుంది. ఆమె విషయంలో పోలీసులు బాధ్యతగా స్పందించడం, చట్టాల్ని అమలు చేయడానికి ప్రయత్నించడం బాగుంది. ప్రతిచోటా ఇలాంటి సానుకూల వాతావరణం చోటు చేసుకోవాలి.



– ఎమ్. లక్ష్మి, ప్రధాన కార్యదర్శి,
ప్రగతిశీల మహిళా సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ

చెట్టు నీడ

మౌనంగా ఒక పూట

ఒక ఆశ్రమ పాఠశాలలో ఆ రోజు మౌనం గొప్పతనం గురించి బోధించాడు గురువు. వారానికి ఒక రోజైనా మౌనంగా ఉండటం వల్ల ఎంత మానసిక ప్రశాంతత దొరుకుతుందో వివరించాడు. పాఠం విన్న నలుగురు యువ విద్యార్థులు ఆరోజు నుంచే దాన్ని అమలు చేయాలనుకున్నారు. వాళ్లు అలిఖితంగా సంజ్ఞల ద్వారానే ఆ రోజంతా పెదవి విప్పకూడదని ఒప్పందం చేసుకున్నారు.

నలుగురూ తమ బసకు వెళ్లారు. మౌనంగా వారి పొద్దు గడిచింది. ఒక్క మాటా మాట్లాడకుండానే వారి వారి పనులు చేసుకున్నారు. సాయంత్రమైంది. పొద్దు గుంకింది. నిశ్శబ్దంగా చీకటి ఆవరిస్తోంది. బయట కీచురాళ్ల చప్పుడు మొదలవుతోంది.

'ఎవరైనా లాంతరు వెలిగిస్తే బాగుంటుంది' అన్నాడు ఒక యువకుడు.

అంతసేపూ వున్న మౌన వాతావరణం ఆ మాటతో భంగపడింది.

మొదటి యువకుడి మాటకు ఆశ్చర్యపోతూ, 'మనం ఈరోజంతా ఒక్క మాట కూడా మాట్లాడకూడదని అనుకున్నాం కదా!' అని గుర్తు చేశాడు మరో యువకుడు.

> **సాయంత్రమైంది. పొద్దు గుంకింది.**
> **నిశ్శబ్దంగా చీకటి ఆవరిస్తోంది.**
> **బయట కీచురాళ్ల చప్పుడు మొదలవుతోంది.**

ఈ ఇద్దరి సంభాషణ వల్ల మూడో యువకుడికి కోపమొచ్చింది. 'మీ ఇద్దరూ మూర్ఖుల్లా వున్నారు. ఎందుకు మాట్లాడారు?' అని అడిగాడు.

'అయితే నేనొక్కడినే అన్నమాట ఇంతసేపూ మాట్లాడకుండా వున్నది' అని ముగించాడు నాలుగో యువకుడు.

రేపటి ఫన్‌డేలో..



అమ్మ చూస్తోంది

తనకు ఒకప్పుడు బాల్యం ఉండేదన్న ఆలోచన, బాల్యంలోని అనుభూతిని తనివితీరా అనుభవించానన్న సంతృప్తి – ఆ వృద్ధుడిలో కనిపించింది. అందుకే మరణశయ్యపై చిరునవ్వు చిందించగలిగాడు. జీవిత కాలమంతా బాధను భరించిన వృద్ధుడు, చివరి దశలో బాల్యాన్ని వెతికి తెచ్చుకున్నాడు. నవ్వాడు. నవ్వుతూనే ఉన్నాడు. ఓ వృద్ధుడికి తిరిగొచ్చిన బాల్యం గురించి చెప్పే కథ.. 'అమ్మ చూస్తోంది'.

చీకటి



చుట్టుపక్కల చీకట్లకు అంటకుండా వెళ్తోంది బస్సు. పెద్ద గుంతలో పడబోయింది టైరు. డ్రైవర్ బస్సును పక్కకు తిప్పాడు. లోయలో లీనమైపోతోంది బస్సు. నా చెవుల్లో న్యూటన్స్ క్రేడిల్ శబ్దం మొదలైంది. క్లిక్.. క్లిక్.. క్లిక్.. ఆ బస్సులో ఉన్న వ్యక్తి చెప్పాలనుకున్న కథ ఏంటి? అతను చెబుతున్న కథ ఎవరిది? ఆ బస్సు లోయలో పడ్డాక కథ చెబుతున్న వ్యక్తి కథ ఎక్కడ ఆగింది?

మిగిలిందెవరు?



అకస్మాత్తుగా యమభటులొచ్చి, "మీ అమ్మానాన్నలలో ఒకరిని ఇవ్వాళ మేము తీసుకుపోతాం.." అన్నారు. ఆ పిల్లలిద్దరూ భయపడ్డారు. అంటే అమ్మా, నాన్నలలో ఎవరో ఒకరు చనిపోతారు. "ఎవరు కావాలో మీరే కోరుకోండి!" అని చాయిస్ ఇచ్చారు ఆ యమభటులు. పిల్లలిద్దరూ ఇంకా భయపడ్డారు. వాళ్లేం చేస్తారు? ఎవరిని బతికించమని అడుగుతారు?

న్యాపీ డేస్

పావనీ.. ప్రెజెంట్ సార్.. యామినీ.. ప్రెజెంట్ సార్!

ఓ అనాథ బిడ్డను ఏడాది పాటు దత్తత తీసుకున్నాం అనుకోండి. దానర్థం.. ఒక ఏడాదిపాటు ఆ బిడ్డ పోషణకు అయ్యే ఖర్చును విరాళంగా ఇవ్వడం అన్నమాట. అలాగే ఒక విద్యార్థిని దత్తత తీసుకుంటే వారి చదువుకు ఏడాదికయ్యే ఖర్చును స్పాన్సర్ చెయ్యడం. ఇప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వం ఇదే ఫార్ములాను బాలికలలో 'రుతుక్రమ పరిశుభ్రత' కోసం అనుసరించబోతోంది.

ప్రతి నెలా 'పరీక్షా సమయమే'!

గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అబ్బాయిలు, అమ్మాయిల నిష్పత్తిలో చాలా వ్యత్యాసం ఉంటుంది. అంటే.. అమ్మాయిల సంఖ్య బాగా తక్కువగా ఉంటుంది. వారిలోనూ కనీసం ఐదవ తరగతైనా పూర్తి చేసే అమ్మాయిలు మరీ తక్కువ. అసలు వాళ్లు అక్కడి వరకు రావడమే పెద్ద విజయం అన్నట్లు ఉంటాయి బాలికలకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు. ఐదవ తరగతిని కూడా దాటుకుని ఎనిమిది, తొమ్మిది క్లాసులకొచ్చేటప్పటికి వారి హాజరు శాతం మరింత పడిపోతోంది. ఏడాదిలో ముప్పై రోజులకు పైగా ఆ తరగతి బాలికలు స్కూలుకు రాలేకపోతున్నారు! ఈ పరిస్థితిపై పరిశీలన జరిపించిన మహారాష్ట్ర ప్రభుత్వం.. అందుకు కారణం 'రుతుక్రమం' అని గుర్తించింది.

సంకల్పించింది. ఇందుకోసం 'అస్మిత' అనే పేరుతో ఒక పోర్టల్ ప్రారంభించబోతోంది. అందులో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పేర్లు, వాటిల్లో చదువుకుంటున్న విద్యార్థినుల పేర్లు ఉంటాయి. వారందరికీ అస్మిత కార్డు ఇస్తారు. ఆ కార్డు ఉన్న అందరికీ ప్రతి నెలా... ఎనిమిది శానిటరీ ప్యాడ్స్ ఉన్న ప్యాకెట్‌ను ఐదు రూపాయలకే అందిస్తారు. వీటి పంపిణీ బాధ్యతను స్థానిక



> **ఏడాదిలో ముప్పై రోజులకు పైగా బాలికలు స్కూలుకు రాకపోవడంపై పరిశీలన జరిపించిన మహారాష్ట్ర ప్రభుత్వం.. అందుకు కారణం 'రుతుక్రమం' అని గుర్తించింది. వారి హాజరు శాతాన్ని పెంచేందుకు 'అస్మిత' అనే పథకాన్ని మార్చి ఎనిమిది నుంచి అమలుచేయబోతోంది. ఆ పథకంలో మీరూ పాలుపంచుకోవచ్చు.**



'ప్యాడ్ ఉమన్': పంకజా ముండే, మహారాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి

మనసు బడిలో.. మనిషి ఇంట్లో..

పరిశుభ్రమైన పద్ధతుల్లో నెలనెలా రుతుక్రమాన్ని దాటుకుని రావడం గ్రామాల్లోని విద్యార్థినులకు ఒక సమస్యగా పరిణమిస్తోంది. డబ్బు పెట్టి ప్యాడ్స్ కొని వాడలేరు. దాంతో నెలకు నాలుగు రోజులు వారిని ఇంట్లోనే ఉంచేస్తున్నారు తల్లిదండ్రులు. ఈ పరిస్థితిని గుర్తించిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి పంకజా ముండే ఓ కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. రుతుక్రమ పరిశుభ్రత గురించి తెలియజెప్పి ఊరుకుంటే సరిపోదు, అంతకు మించిన సహకారం బాలికలకు ఉండాలని భావించారు. ఫలితమే.. 'అస్మిత' ప్రోగ్రామ్.

ప్రభుత్వమే 'ప్యాడ్‌మాన్' అయింది!

గ్రామాల్లో అల్పాదాయ వర్గాల బాలికలకు ఏడాదికి దాదాపుగా 183 రూపాయలు రుతుక్రమ పరిశుభ్రత కోసం ఖర్చు చేయడం కష్టమైన పని. అందుకని ప్రభుత్వమే నామమాత్రపు ధరకు ప్యాడ్‌లను అందించాలని స్వయం సహాయక గ్రూపులు తీసుకుంటాయి. ప్యాడ్‌ల తయారీకి పాతిక నుంచి ముప్పై రూపాయలవుతుంది. ఐదు రూపాయలు పోగా మిగిలిన ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

మనమూ ప్యాడ్‌మాన్ కావచ్చు!


గ్రామీణ బాలికలకు సహాయం చేయాలనుకునే వాళ్లు ఆన్‌లైన్‌లో అస్మిత పోర్టల్‌లోకి వెళ్లి ఒక బాలికకు ఒక ఏడాదికి అయ్యే ఖర్చు 183 రూపాయలను విరాళంగా ఇవ్వవచ్చు. ఈ స్కీమ్‌ని మార్చి ఎనిమిదవ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభిస్తోంది మహారాష్ట్ర ప్రభుత్వం.

ఈ సందర్భంలో మనం అరుణాచలం మురుగనాథమ్ సేవల్ని తప్పనిసరిగా గుర్తు చేసుకోవాలి. 'ప్యాడ్‌మ్యాన్' చిత్ర దర్శక నిర్మాతలకు ప్రేరణనిచ్చిన నిజజీవితపు ప్యాడ్‌మ్యాన్ అరుణాచలం మురుగనాథమ్.. బాలికలలో రుతుక్రమ బిడియాన్ని పోగొట్టి, వారు చదువులో వెనుకబడకుండా తోడ్పాటునివ్వగలిగారు.

– మంజీర

ఈట్ వరి బీట్ వర్రీ

పిల్ల
ఇలా



రైస్ ఫ్లోర్ బాల్స్

కావలసినవి: **బియ్యప్పిండి** – కప్పు; **మైదా పిండి** – ఒక టేబుల్ స్పూను; **కొబ్బరి తురుము** – ఒక టేబుల్ స్పూను; **నువ్వులు** – ఒక టేబుల్ స్పూను; **వాము**– అర టేబుల్ స్పూను; **తేనె** – ఒక టేబుల్ స్పూను; **నెయ్యి** – ఒక టేబుల్ స్పూను; **పాలు** – అర కప్పు; **నూనె / నెయ్యి** – డీప్ ఫ్రై చేయడానికి సరిపడా.

తయారి: ఒక పాత్రలో బియ్యప్పిండి, మైదా పిండి, తేనె, కొబ్బరి తురుము, నువ్వులు, నెయ్యి, వాము వేసి కలపాలి ● కొద్దికొద్దిగా పాలు జత చేస్తూ, చపాతీపిండిలా కలపాలి ● చిన్న చిన్న గోళీల పరిమాణంలో ఉండలు చేసి పక్కన ఉంచాలి ● బాణలిలో నూనె లేదా నెయ్యి వేసి కాగిన తరవాత, తయారుచేసి ఉంచుకున్న ఉండలను నెయ్యి / నూనెలో వేసి వేయించి తీసేయాలి.

అక్కి రొట్టె

కావలసినవి: **బియ్యప్పిండి** – ఒక కప్పు; **ఉల్లి పాయ** – 1 (సన్నగా తరగాలి); **పచ్చి కొబ్బరి తురుము** – 3 టేబుల్ స్పూన్లు; **క్యారట్ తురుము** – ఒక టేబుల్ స్పూను; **పచ్చి మిర్చి** – 2 (చిన్నచిన్న ముక్కలు చేయాలి); **కొత్తిమీర** – కొద్దిగా; **జీలకర్ర** – అర టీ స్పూను; **జీడిపప్పు** – 5 (చిన్న చిన్న ముక్కలు చేయాలి); **బాదం పప్పులు** – 5 (చిన్న చిన్న ముక్కలు చేయాలి); **పల్లీలు** – ఒక టేబుల్ స్పూను (చిన్న చిన్న ముక్కలు చేయాలి); **ఉప్పు** – తగినంత; **నీళ్లు** – తగినన్ని; **నూనె** – తగినంత; **అల్లం వెల్లుల్లి ముద్ద** – ఒక టీ స్పూను; **పచ్చి సెనగపప్పు** – ఒక టేబుల్ స్పూను (నానబెట్టాలి)

తయారి: ఒక పాత్రలో బియ్యప్పిండి, ఉల్లి తరుగు, పచ్చి కొబ్బరి తురుము, క్యారట్ తురుము, పచ్చి మిర్చి తరుగు, కొత్తిమీర, జీలకర్ర, ఉప్పు వేసి, తగినన్ని నీళ్లు జత చేస్తూ, చపాతీ పిండిలా కలపాలి ● చిన్న చిన్న ముక్కలుగా చేసిన... జీడిపప్పులు, బాదం పప్పులు, పల్లీలు, అల్లం వెల్లుల్లి ముద్ద, నానబెట్టిన పచ్చి సెనగపప్పు జత చేసి మరోమారు కలపాలి ● కలిపిన పిండిని పెద్ద పెద్ద ఉండలుగా చేసి పక్కన ఉంచాలి ● స్టౌ మీద పాన్ ఉంచి వేడి చేయాలి ● ఒక్కో ఉండను చేతిలోకి తీసుకుని, పెనం మీద ఉంచి రొట్టె మాదిరిగా చేతితో ఒత్తుతూ సమానంగా పరవాలి ● రెండు వైపులా నూనె వేసి కాల్చి తీసేయాలి.





కావలసినవి:
వేయించిన పల్లీలు – అర కప్పు (ప... కారం జత చేయాలి); **వేయించిన బా...** – పావు కప్పు; **వేయించిన వాల్నట్స్...** కప్పు; **వేయించిన నువ్వులు** – పావు... **బ్రౌన్ సుగర్** – ఒక కప్పు; **నువ్వుల ...** టేబుల్ స్పూను; **పల్లీ నూనె** – రెండ... కప్పులు; **నీళ్లు** – ఒక కప్పు.

తయారి:
మిక్సీ జార్లో పల్లీలు, బాదం పప్పు... నువ్వుల నూనె వేసి కచ్చాపచ్చాగా ప... నీళ్లు వేసి చపాతీ పిండిలా కలపాలి ... ఒక్కో ఉండను మందంగా ఒత్తి, తం... మిశ్రమాన్ని ఉండ మధ్యలో ఉంచి వ... మీద కొద్దిగా పల్లీ నూనె వేసి, తయా... రెం...



మిల్క్ రైస్ బాల్స్

కావలసినవి: **బియ్యప్పిండి** – ఒక కప్పు; **ఉప్పు** – తగినంత; **నీళ్లు** – ఒకటిన్నర కప్పులు; **చిక్కటి కొబ్బరి పాలు** – ఒక కప్పు; **పల్చటి కొబ్బరి పాలు** – 2 కప్పులు; **ఏలకుల పొడి** – ఒక టీ స్పూను; **నెయ్యి** – ఒక టీ స్పూను; **పంచదార** – అర కప్పు, **డ్రై ఫ్రూట్స్**– కొద్దిగా

తయారి: ఒక పాత్రలో బియ్యప్పిండి, ఉప్పు, నీళ్లు పోసి దోసెల పిండి మాదిరిగా కలపాలి ● స్టౌ మీద బాణలి వేడయ్యాక, బియ్యప్పిండి మిశ్రమం అందులో పోసి ఆపకుండా కలుపుతుండాలి ● బాగా దగ్గర పడిన తరవాత, దింపేసి, చల్లారిన తరవాత నెయ్యి జత చేస్తూ చపాతీ పిండిలా కలుపుకోవాలి ● చేతికి నెయ్యి పూసుకుని, బియ్యప్పిండిని చేతిలోకి తీసుకుని, చిన్న చిన్న ఉండలు చేసి పక్కన పెట్టుకోవాలి ● ఒక పాత్రలో పల్చటి కొబ్బరి పాలు పోసి, స్టౌ మీద ఉంచి, మరుగుతుండగా... ముందుగా తయారుచేసి ఉంచుకున్న రైస్ బాల్స్‌ను ఇందులో వేయాలి ● బాగా ఉడికిన తరవాత, పంచదార, ఏలకుల పొడి వేసి, గరిటెతో కలిపి రెండు నిమిషాలు ఉంచి దింపేయాలి ● బాగా చల్లారిన తరవాత చిక్కటి కొబ్బరి పాలు, డ్రై ఫ్రూట్స్ జత చేసి, అందించాలి.



ఇడియాప్పమ్

కావలసినవి: **బియ్యప్పిండి** – ఒక కప్పు; **నీళ్లు** – ఒకటిన్నర కప్పులకు తక్కువగా; **ఉప్పు** – తగినంత; **పచ్చి కొబ్బరి తురుము** – పావు కప్పు

తయారి: స్టౌ మీద బాణలి వేడి చేసి మంట బాగా తగ్గించి, కప్పు బియ్యప్పిండి వేసి నాలుగైదు నిమిషాలు దోరగా వేయించాలి ● పిండిలో నుంచి కొద్దిగా ... వస్తుండగా దింపి, పిండిని వేరే పాత్రలోకి తీసుకోవాలి ● అదే బాణలిలో నీ... తగినంత ఉప్పు జత చేసి నీళ్లు మరిగించాలి ● బియ్యప్పిండి జత చేసి బాగా... దింపేసి, పిండి చల్లారేవరకు గరిటెతో కలిపాక, బియ్యప్పిండి మృదువుగా అ... చేతితో కలపాలి. (మిశ్రమం ఎండినట్టుగా అనిపిస్తే, కొద్దిగా తడి చేయాలి. ... అంటుతున్నట్లు అనిపిస్తే, కాస్తంత బియ్యప్పిండి జత చేయాలి) ● తగినంత... జంతికల గొట్టంలోకి తీసుకోవాలి ● అరటి ఆకులను చిన్న చిన్నగా కత్తిరించి... మీద ఉంచి, జంతికల గొట్టంలోని పిండిని, జంతికల మాదిరిగా ఆకుల మీద... వాటి మీద పచ్చి కొబ్బరి తురుము పొడిపొడిగా చల్లాలి ● అన్నిటినీ తయా... తరవాత, ఇడ్లీ రేకులను కుకర్‌లో ఉంచి (విజిల్ లేకుండా) ఉడికించి తీసేయ... తయారైన నూల్ పుట్టలను ప్లేట్‌లోకి తీసుకుని, చట్నీతో అందించాలి.

శక్తి | కౌన్సెలింగ్

నా నిర్ణయం తప్పా?

పాపాయి పుట్టినప్పుడు ఉద్యోగం మానేశాను. అప్పటికీ తొమ్మిదో నెల వరకు డ్యూటీకి వెళ్లాను. ఇప్పుడు పాపాయికి తొమ్మిది నెలలు. పాప కొంచెం పెద్దయిన తర్వాత మళ్లీ చేరవచ్చని అతడే చెప్పాడు కూడా. ఇప్పుడు నేరుగా ఏమీ అనరు. కానీ 'ఒక్కడి జీతంతో ఎన్ని ఖర్చులని భరిస్తాడు' అని అత్తగారు, 'పాపాయి ఖర్చులు వచ్చాయిగా, అందరికీ అన్నీ అమరాలంటే మీ పుట్టింటిలో పోసిన రాశుల్లో ఒకటి తేవాల్సిందే' అని భర్త సూటిపోటి మాటలంటున్నారు.



ప్రతీకాత్మక చిత్రం

నా బర్త్‌డేకి డ్రస్ కొనడానికే ఇదంతా. తల్లీ కొడుకు ముఖాలు గుర్తుకు వస్తుంటే కొత్త డ్రస్ వేసుకోవాలనే కోరిక కూడా చచ్చిపోయింది. 'నేను ఉద్యోగం మానేసి తప్పు చేశాను' అనుకోని రోజు ఉండడం లేదు.

– స్వాతి, చిత్తూరు

ఫ్యామిలీ కోర్టుకు వచ్చే కేసుల్లో కొంత మంది వాదన విచిత్రంగా ఉంటుంది. పిల్లలను పెంచాల్సిన బాధ్యత పూర్తిగా ఆడవాళ్లదే అన్నట్లుంటారు భర్తలు. అదే వారి మధ్య వివాదానికి కారణమవుతుంటుంది. పిల్లల్ని పెంచడంలో ఈక్వల్ షేరింగ్ ఉండాలనే అవగాహనకు తీసుకు రావడానికి చాలా ఎక్సర్‌సైజ్ చేయాల్సి ఉంటుంది. పిల్లల పెంపకంలో మగవాళ్లు కూడా సమాన బాధ్యతను పంచుకోవాలి.

ఇక ఆడవాళ్లు ఆర్థిక వెసులుబాటును కాపాడుకోవాలి. పిల్లల్ని కని, పెంచడానికి తల్లి ఉద్యోగంలో విరామం తీసుకోవాల్సిందే. అలాంటప్పుడు కొన్ని అన్‌ఆర్గనైజ్‌డ్ జాబ్స్‌లో ఆమెకి జీతం రాదు. అలాంటప్పుడు స్వాతి విషయంలో జరిగినట్లే డ్రెస్ కొనుక్కోవాలనిపించినా కూడా చేతిలో డబ్బు ఉండదు. తనకు జీతం వస్తున్న రోజుల్లో సొంతానికి సేవ్ చేసుకుంటే ఈ సమస్య ఉండదు. ఆర్థిక వెసులుబాటు ఉన్న అమ్మాయి చాలా సమస్యలను గోరంతలు కొండంతలు కాకముందే తనకు తానుగా చక్కదిద్దుకోగలుగుతుంది.

కొన్ని సందర్భాలలో ఆర్థిక స్వావలంబన అవసరానికి మించి ఉండి, స్వీయ క్రమశిక్షణ లేకపోతే ఆ డబ్బే వివాదాలకు కారణమవుతుంటుంది. అలాంటిది ఒక్కటి కనిపిస్తే చాలు... ఇక ఆ అమ్మాయి వైపే వేలెత్తి చూపిస్తూ 'అమ్మాయిల చేతిలో డబ్బుంటే ఇలాగే ఉంటుంది' అనేస్తారు. ఆర్థిక స్వావలంబన కారణంగా ఎంత మంది మహిళలు కుటుంబాలను తీర్చి దిద్దుకుంటున్నారనే విషయాలను పట్టించుకోరు. ఆ వాస్తవాన్ని అంగీకరించడానికి ఇష్టపడరు కూడా.



నిశ్చల సిద్ధారెడ్డి
లాయర్, ఫ్యామిలీ కౌన్సెలర్

మాకు పంపండి: ఒక మహిళగా మీరు గృహహింస వంటి వేధింపులకు గానీ, సామాజికంగా వివక్షకుగానీ లేదా సంబంధిత ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? మీ సమస్యను రాసి మాకు మెయిల్ ద్వారా పంపించండి.ఆయా రంగాలకు చెందిన నిపుణులతో మీకు తగిన సూచనలు / సలహాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

కాసుకో సుడోకు

3	2		5			7		
				1	8	5	9	2
5		8						
9	7		2		4	1	5	
	8						4	
	6	4	9		5		7	8
						8		5
8	3	6	1	5				
		1			2		6	7

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	9	7	3	5	1	4	6	2
6	5	2	7	9	4	8	3	1
3	1	4	8	6	2	5	9	7
7	6	8	2	4	9	1	5	3
5	4	9	1	7	3	6	2	8
2	3	1	6	8	5	7	4	9
4	8	5	9	2	7	3	1	6
9	7	3	4	1	6	2	8	5
1	2	6	5	3	8	9	7	4

రాశి ఫలాలు (సౌరమానం)

జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్!
మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి
ఈవారం (మార్చి 3 నుంచి 9 వరకు)
మీ రాశి ఫలితాలు



డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)

గంతల్ని కట్టుకుని బండిని లాగుతూ పరిగెత్తుతున్న గుర్రాన్ని చూస్తే ఎవరికైనా ఆశ్చర్యమే! కనిపించే కళ్లకి గంతలు కట్టేస్తే దానికి వెళ్తున్న మార్గం ఎలా కనిపిస్తుంది? గోతులూ, గొప్పులూ పల్లాలూగా జారుడు నేలలూ.. ఎలా తెలుస్తాయి? అనుకుంటాం. దాని కళ్లకి గంతలు కట్టి దాన్ని పరిగెత్తించే రౌతుది దాని ఆ బాధ్యతంతా. అలాగే మీరున్న పరిస్థితిలో మీకెలా విజయం లభిస్తుంది? అనుకుంటారందరూ. అయితే మీకు ఇది కలిసొచ్చే కాలం కాబట్టి, పైన అనుకున్న గుర్రం రక్షణ, బాధ్యత రౌతుదైనట్టుగా మీ రక్షణ బాధ్యత దైవానిదే. ఇంతగా దైవబలం అనుకూలిస్తున్న కాలమిది. దూసుకుపొండి. 'మనపని మనకి కాకున్నా, బాధపడటం గాని ఎదుటివారికి పని గనుక అయినట్లయితే ఆ బాధ వర్ణనాతీతం అనే ఈ తీరు మనస్తత్వంతో– ఉండే ఈ తీరు వ్యాధితో బాధపడే జనం ఎక్కువ లోకంలో. ఆ కారణంగా విజయ పథాన వెళ్తున్న మీతో ఎవరైనా నిష్కారణ వైరాన్ని చూపిస్తూ, ఏవో సూటిపోటి మాటలని అంటూ, మోకాలిని అడ్డుపెట్టబోతే వాగ్వివాదానికి దిగకండి గాని, మెత్తగా చిరునవ్వు నవ్వుతూ అతని మాటకి ప్రతిస్పందించకుండా కదిలి పొండి. వరద వచ్చినప్పుడు ఏమైనా సరే నిలబడే ఉంటాననే తాటిచెట్టు విరిగి పడుతుంది తప్ప, తలొంచి ప్రవాహం వెళ్లిపోయాక తలెత్తి నిలబడే చిన్న మొక్క ఏ ప్రమాదానికీ లోను కాదు. బతికి బట్ట కడుతుంది. గుర్తుంచుకోండి. చీకట్లోనైనా వెళ్లగలను– నాకు ముందెళ్లిన వాళ్లకి ఏ దీపం సహాయపడింది? అనుకుంటూ ఆత్మస్థైర్యంతో ముందుకి కదలండి! ఆ ధైర్యమే దీపమౌతూ మిమ్మల్ని నడిపిస్తుంది. ముఖ్యంగా కొనుగోళ్ల దిశగా భూమినీ పొలాన్నీ ఇంటినీ వ్యాపారపు పెట్టుబడినీ ఉద్యోగి అయితే వీటితోపాటు పోటీ పరీక్షలనీ... ఇలా అన్నింటా విజయాన్ని పొందే అవకాశముంది. విస్తరి ముందు కూచోవడమే ఆలస్యం! విందు భోజనం దానికదే వస్తుంది. శుభమస్తు.

లౌకిక పరిష్కారం: వాగ్వివాదానికి సిద్ధమై ఎవరైనా వస్తే ప్రతిస్పందించకండి.

అలౌకిక పరిష్కారం: గణపతికి సంబంధించిన సుముఖశ్చైక దంతశ్చ... శ్లోకాలని రోజు మొత్తం మీద 16 మార్లు పఠించుకోండి.

మిథునం
(మే 21 - జూన్ 20)

సాక్షాత్తూ లక్ష్మీనారాయణుల్ని తన మీద ఎక్కించుకుని సర్వలోకాలకీ వెళ్లే గరుత్మంతుడైనా రెక్కల్ని మూసుకు కూర్చుంటే ఉన్న చోటు నుండి కదల(లే)డు. అదే మరి ప్రయాణించడాన్ని ప్రారంభించిన చీమ కొన్ని రోజులకైనా సముద్రానికి వెళ్ల గలుగుతుంది. సరిగ్గా మీ స్థితీ ఇదే. ప్రణాళికా, దాన్ని అమలు చేయగల సిబ్బందీ, పనిముట్లూ, కాలానుకూలతా.. అన్నీ ఉన్నా మీ వైపునుండి లోపం– ప్రయత్నాన్ని ప్రారంభించకపోవడమే. అది సరికాదు. కార్యంలోకి దిగండి.

ఇంత పెద్ద పనిని నెత్తిన వేసుకున్నాను– మోయగలనా? అనుకోవద్దు. సహాయ పడడానికి ఎందరో చేతులు చాచి మరీ సిద్ధంగా ఉన్నారని గమనించండి. అదృష్టయోగం మీకు పుష్కలంగా ఉన్న కారణంగా మీ ఖర్చు కోసం రుణాన్ని అందించేందుకు ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు సిద్ధంగా ఉన్నామని మీకు చెప్పినా, మీరు రుణాన్ని తీసుకోవలసిన అవసరమే లేకుండా కాలం మీకు అనుకూలిస్తుంది. మీరు చేయవలసిందల్లా ఆత్మస్థైర్యంతో పనిలోకి దిగడమే. పనిని గురించి అపోహలతో భయపెట్టేవారినీ, నిరుత్సాహపరిచేవారినీ ఒకప్పుడు ఓటమికి గురైనవారినీ పలకరించకండి– దగ్గరికి రానీయకండి. వారితో సంప్రదింపులు చేయకండి. వారంతట వారే మీకు సలహాలు సంప్రదింపులు చేయదలిస్తే వారిని వినకుండా మాట్లాడండి తప్ప ఒక్క అక్షరాన్ని కూడా చెవిలో పడనిచ్చుకోకండి. ఇలాంటివారిని శాస్త్రం అనుకూల శత్రువులనే పేరిట చెప్తుంది. జాగ్రత్త. అయితే వారిని విరోధులుగా చేసుకుంటూ నిష్ఠురంగా మాట్లాడకండి. మీకు అందరితోనూ అవసరం ఉంది.

చినుకు చినుకు మధ్య సహదేవుడు వెళ్లగలడని చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పినట్టుగా, అవసర సమయాల్లో మీరు చూసే మీ వినయం, మృదుభాషణం కారణంగా మీ పై అధికారులూ, కింది సిబ్బందీ ప్రభుత్వాధికారులూ ఇతరులూ కూడా అనుకూలురుగా మారిపోతారు.

లౌకిక పరిష్కారం: అపోహలతో భయాన్ని కలిగించేవారిని దూరంగా ఉంచండి.

అలౌకిక పరిష్కారం: శ్రీవిష్ణుసహస్రనామాలని రోజు మొత్తం మీద ముమ్మారు పఠించడం తప్పనిసరి.

సింహం
(జూలై 23 - ఆగస్ట్ 22)

దత్తు తీసుకున్న సంతానాన్ని ఎంత ప్రేమానురాగాలతో చూసుకుంటున్నా, సొంత సంతానం అని ఎవరూ అనరు. కోపం వచ్చినప్పుడు శ్రుతి మించి మాట్లాడి – 'కోపం కారణంగా అలా అన్నాను తప్ప నా మనసు మంచిదే –' అంటే ఎవరూ హర్షించరు, నమ్మరు కూడా. అలాగే అప్పుగా తెచ్చిన సొమ్ముని చూసుకుంటూ దాన్ని స్వార్జితంగా భావించకూడదు. ప్రస్తుతం మీరు చేస్తున్న పని అదే. ఋణంగా తెచ్చిన సొమ్ముని సొంతమనుకుంటూ మంచినీళ్లలా వ్యయం చేస్తూండడం సరి కాదు.

చేయబోతున్న రెండవ పొరపాటు – ఋణంగా తెచ్చిన ద్రవ్యాన్ని మరొకరు చేస్తున్న వ్యాపారానికి పెట్టుబడిగా ఇస్తూ, చేయబోయే వ్యాపారంలో రాబోయే లాభాన్ని ఆశించడం. దీనికి మీ కుటుంబ సభ్యులంతా అనుకూలిస్తూ మిమ్మల్ని ప్రోత్సహిస్తూ ఉండడం కూడ సరికాని అంశం. మునిగిపోయిన నావ నుండి ప్రాణాలతో బయటపడి చిల్లున్న పడవని ఎక్కుతున్నారని గమనించండి. అయితే మీకు భగవంతుడు ఇచ్చిన నిజమైన ఆస్తి మీ బుద్ధి కార్యాచరణ శక్తి – నైపుణ్యం. ఎవరో చేయబోతున్న వ్యాపారానికి వీటిని పెట్టుబడులుగా పెడతానని చెప్పండి. వారు అంగీకరిస్తారు. ఆ నమ్మకాన్ని ఒమ్ము చేసుకోవడమంటే తానెక్కిన కొమ్మని తానే నరుక్కున్నట్టు – జాగ్రత్త!

ప్రస్తుతం ఆ పొలం బీడు పడి ఉన్నా – ఇదొకప్పటి ద్రాక్ష పొలం – అని చెప్పినప్పుడు ఆ మాట నిజమే కాబట్టి కొనుగోలుదారు ముందుకొచ్చినట్టుగా, మీకు ఒకప్పుడు సంఘంలో ఉన్న కీర్తిప్రతిష్ఠలు, నమ్మకం కారణంగా మీకు గాని, మీ గౌరవానికి గానీ భంగం ఉండదు. మీ మీద గౌరవాన్ని చూపిస్తూండే వ్యక్తులతో ప్రయత్నాలని ప్రారంభించండి. తిరుగులేని విజయం లభిస్తుంది. మళ్లీ మీరు సరైన మార్గంలో ప్రయోగించేందుకు సిద్ధం కాగలరు.

లౌకిక పరిష్కారం: నమ్మకాన్ని చెడగొట్టుకోకండి. మీ గౌరవాన్ని పెట్టుబడిగా చేసుకుని ప్రయత్నం ప్రారంభించండి.

అలౌకిక పరిష్కారం: గణపతి స్తోత్రమే మాకు వజ్రాయుధం. ఎన్నిమార్లు చదువుకుంటే అంతగానూ ఫలితమిస్తుంది.

వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)

ఒకప్పుడు మీరు దూకడం, ఎత్తు ఎగరడం మొదలైన క్రీడల్లో ఉత్తమ పురస్కారాలని పొంది ఉన్నవారు కావచ్చేమో కానీ, ప్రస్తుతదశలో మాత్రం మెట్టుని చూసుకు మరీ దిగడం అంటే ఆరోగ్య విషయంలో అంత జాగ్రత్తని పాటించడం అవసరం. ఇది మన చేతిలో పని కదా! కొద్దిమనసుతో ఆలోచిస్తూ ఆరోగ్య విషయంలో శ్రద్ధ పట్టండి. అహంకరించకండి. తేలిగ్గా తీసుకోకండి. మీ పనులన్నింటిలోనూ సర్వైక మార్గాన్ని (మా తమ్మునికి మీ చెల్లెల్నీ, మీ అన్నకి మా చెల్లెల్నీ ఇచ్చి వివాహం చేద్దాం వంటి ఎదురు బదురు విధానాలు కాకుండా ఉండడం ఎన్నుకోండి తప్ప ఒకదానితో మరొకదాన్ని ముడిపెట్టుకోకండి – అది వివాహం కావచ్చు, వ్యాపారం కావచ్చు ఉద్యోగం కావచ్చు ఏదైనా సరే! ఏ రోజుకి ఏ పనిని చేయాలనే తీరు నిర్ణయాన్ని చేశారో లేదా చేసుకున్నారో లేదా చేయవలసి ఉందో దాన్ని ఆ కారణమో ఈ కారణమో చెప్పుకుంటూ వాయిదా వేసుకోవడంలోనే మీ ఓటమి మొత్తం దాగుంది. కనుక, చెప్పిన సమయానికి అనుకున్న పనిని చేసి తీరండి! చేయగలిగితేనే వస్తానని చెప్పండి. చెప్పబోయే ముందే ఆలోచించి చెప్పండి. లేని పక్షంలో – సమయానికి అనుకున్న పనిని చేసి తీరండి. చేయగలిగితేనే చేస్తానని చెప్పండి. చెప్పబోయే ముందే ఆలోచించి చెప్పండి. లేని పక్షంలో – సమయంలో చేయడం కుదరని పక్షంలో తీవ్రమైన ఇబ్బందికి గురి కావడమే కాక, మీ మీది నమ్మకాన్ని కోల్పోతారు. ఇది సరికాదు మీకు. చలీ మంచూ నిండిన సమయంలో సూర్యుడు వచ్చి ఎండని రప్పించినట్టు, ఈ దశలో మీకు మీ బంధువులూ మిత్రులూ సహాయ సహకారాలని అందిస్తారు కాబట్టి, మీరు ఓ పనికి ప్రణాళిక వేసుకోవడానికి ముందే వీరికి ఓ మాట చెప్పి సరేనని అనిపించుకోండి. అన్నీ సక్రమంగా సాగుతాయి. కోటిరూపాయల వాహనానికైనా గాలి తగ్గడం, మధ్యలో మొరాయించడం, వేడెక్కడం వంటి బాధలు ఎప్పుడో ఒకప్పుడు తప్పవు. అలాగే ప్రారంభించిన పనిలో చిన్న విఘ్నం ఎదురైతే కంగారు పడకండి. అది కేవలం తాత్కాలికమేనని గ్రహించండి.

లౌకిక పరిష్కారం: సమయపాలనతో చెప్పిన మాట మీద నిలబడి కార్యాన్ని పూర్తి చేయండి. పొదుపు పాటించండి.

అలౌకిక పరిష్కారం: ఆంజనేయుని ద్వాదశనామ స్తోత్రాన్ని రోజు మొత్తం మీద 12 మార్లు పఠించండి. అరటి పండ్లని నివేదగా సమర్పించండి.

కర్కాటకం
(జూన్ 21 - జూలై 22)

రాబడినిచ్చే పొలానికి ఎరువు రైతు పాదధూళేనట. అంటే రైతు తన పాదాన్ని రోజూ పొలంలో పెట్టాలిట. అంటే స్వయంగా వెళ్లి రోజుకోసారి చూసుకుంటూ ఉండాలని దానర్థం. మీ విషయంలో జరుగుతున్నది ఇలా మీ స్థిరమైన ఆస్తుల్నీ, వాటినుండి రావలసిన ఆదాయాల లెక్కల్నీ సరిచూసుకుంటూ ఉండకపోవడమే. ఒక్కోసారి వెనక్కి ఆలోచించి చూసుకుంటే ఉద్యోగం వృత్తీ వ్యాపారం పని చేస్తున్న సంస్థ మాత్రమే మీకు బంధువులూ మిత్రులూ ఆప్తులుగా అయిపోయి, నిజమైన మీ దగ్గరి వారినందరినీ దూరం చేసుకుంటున్నారనిపిస్తుంది. అది అంత మంచిది కాదు. దాహం వేసినప్పుడు తాగవలసినన్ని నీళ్లు మాత్రం చాలు. తాగగలిగినన్ని తాగడం సరికాదు. పూర్తి గుడ్డితనం ఉంటే అసలు కల్పించే వీలే లేదు. అదే మరి మెల్ల అయితే చూసే వీలుంది కదా! ఈ విషయాన్నే గుడ్డిలో మెల్ల అనే సామెత చెప్తుంది. అలా మీకు మీ ఆస్తుల మీద రావలసిన సొమ్ము మొత్తం రాకపోయినప్పటికీ, మరో తీరుగా నెలసరి ఆదాయం వస్తూ మీకు ధనానికి సంబంధించిన లోటు లేకుండా జరిగిపోతుంటుంది. అయితే అధర్మపద్ధతిలో (అక్రమ వ్యాపారాలు... మోసాలు)సంపాదించాలనుకోవడం, అలాంటి వారికి సహకరించడం అనేది ఏమాత్రమూ సరికాదు. ప్రస్తుతం నడుస్తున్న యోగం ప్రకారం అలాంటివారితో మంతనాలూ రాయబారాలూ సంభాషణలూ కూడా ఇబ్బంది కలిగించే అంశాలే. తెలియకుండా ఏదైనా జరిగితే పొరపాటు అవుతుంది. తెలిసి చేస్తే అది నేరం అవుతుంది. అత్యాశకి పోయి నేరం వైపుకి దృష్టిని మళ్లించకండి. కనీసం పొరపాటు కూడా లేకుండా జరక్కుండా ఉండేలా జాగ్రత్తతో వ్యవహరించండి. అతి ముఖ్యమైన పత్రాలనీ నగలనీ సొమ్మునీ ఎవరి ద్వారానూ పంపకండి. స్వయంగా తీసుకు వెళ్లడం కంటె ఎవరికి అందజేయాల్సి ఉందో, వారినే వచ్చి తీసుకు వెళ్లవలసిందిగా చెప్పండి. అలాగే మీకు రావాల్సిన సొమ్ము, నగలు... మొదలైన వాటిని కూడా తెచ్చి ఇమ్మనండి తప్ప మీరు వెళ్లి అంత సంపదతో ప్రయాణించడం వద్దు.

లౌకిక పరిష్కారం: అత్యాశ, ఆలోచనా– అధర్మ సంపాదన మీద దృష్టీ వద్దే వద్దు.

అలౌకిక పరిష్కారం: సాయికి సంబంధించిన పల్లకీ సేవలో పాల్గొనండి. సచ్చరిత్రని పారాయణం చేయాలనే నిర్ణయానికి రండి.

కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

ఉద్యోగంలో మీకున్న నేర్పరితనం, నైపుణ్యం కారణంగా మీరు చేస్తున్న పనికి అదనంగా మరో బాధ్యత కూడ అప్పచెప్పబడుతుంది. ఆ కారణంగా కుటుంబంతో తగినంత సమయాన్ని గడిపే అవకాశాన్ని తాత్కాలికంగా కోల్పోవడమే కాక, అదనపు ఉద్యోగ బాధ్యతల నిర్వహణకై కొంతదూరం కూడా ప్రయాణించవలసి ఉన్న కారణంగా శారీరకంగా కూడా శ్రమని పొందుతారు. అయితే ఆదాయపు ఎక్కువదనం కారణంగా ఈ శ్రమని మీరు ఇష్టంతో ఆహ్వానిస్తూ ఉంటారే తప్ప విరమించుకునే ఉద్దేశ్యంతో ఉండనే ఉండరు.

మీరు ఈ మధ్యలో మారిన ఉద్యోగం, వృత్తి, నూతనంగా ప్రారంభించిన వ్యాపారం, కొత్తగా కట్టుకున్న ఇంటిలో ప్రవేశించడం వంటి వాటి కారణంగా ఖర్చులకి సరిపడిన ఆదాయం లభిస్తూ ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తల కారణంగా శారీరక ఆరోగ్యంలో మంచి అభివృద్ధి ఉంటుంది.

మీ భార్య /భర్త గాని పై చదువుల కోసం విశేష శ్రమని చేస్తూ ఉండచ్చు. వారికి చేదోడు వాదోడుగా ఉండేందుకు మీ మామ అత్త లేదా మరెవరైనా మీరడిగితే చాలు – రావడానికి సిద్ధంగా ఉన్నారని గమనించి ఆ సహాయంగా తెచ్చుకోదలచినవారితో మాట్లాడండి. ప్రయత్నించి సానుకూల ఫలితాన్ని పొందండి.

అమోఘ విజయాలని సాధించగల అవకాశాలు వేచి ఉన్నాయి కాబట్టి, కాలక్షేపపు స్నేహాలని మాని, చేయవలసని కర్తవ్యం మీద దృష్టిని కేంద్రీకరించండి. ఆస్తులని ఎక్కువ ధర వస్తుంది కదా అనే ఉద్దేశ్యంతో పొరపాటున కూడ బేరానికి పెట్టకండి. అమ్ముడు పోకపోగా సొమ్ము కూడ సక్రమంగా లభించే అవకాశం ఉండదు ఈ దశలో. దానికి కారణం ఈ కాలం మీకు అమ్మకానికి సరైనది కాకపోవడమే.

సంతానానికి సద్గుణాలబ్బుతాయి. విద్యలో ముందుంటారు కూడ. ప్రవర్తన విషయంలో చక్కగా ఉండే కారణంగా మీ కుటుంబం ఆనందోత్సాహాలతో ఉంటుంది.

లౌకిక పరిష్కారం: ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ ఉండంది. సకల ఔషధ సేవని మానకండి.

అలౌకిక పరిష్కారం: ఇంట్లో చేసుకుంటూండే నిత్యపూజని మానకండి.

డోంట్ వర్రీ.. బీ హ్యాపీ
పరీక్షలు వచ్చేశాయి
...కూ పేరెంట్స్‌కూ కావలసినంత వర్రీ
...టప్పుడు ఫుడ్ ఇంకో వర్రీ కాకూడదు
అందుకే వరి పిండితో వరివరిగా
...సారీ... వరివరిగా కాదు.. వడివడిగా
హెల్దీ ఫుడ్ చేసుకుని
ఈట్ వరి... బీట్ వర్రీ!

పిండి వంటలు 2



డేట్స్ కొళుకట్టై

కావలసినవి: బియ్యప్పిండి – 2 కప్పులు; గింజలు తీసిన ఖర్జూరాలు – ఒక కప్పు; బెల్లం పొడి – పావు కప్పు; పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు; ఉప్పు – చిటికెడు; నూనె – 2 టీ స్పూన్లు

తయారి: ఒక బాణలిలో ఖర్జూరాలు, తగినన్ని నీళ్లు పోసి స్టౌ మీద ఉంచి, సన్నని సెగ మీద ఉడికించిన తరవాత, బెల్లం పొడి, పచ్చి కొబ్బరి తురుము జత చేసి, బాగా కలిపి, హల్వా మాదిరిగా అయ్యేవరకు ఉడికించి పక్కన ఉంచాలి ● పెద్ద పాత్రలో మూడు కప్పుల నీళ్లు, రెండు టీ స్పూన్ల నూనె, చిటికెడు ఉప్పు వేసి మరిగించాలి ● మంట బాగా తగ్గించి, బియ్యప్పిండి కొద్దికొద్దిగా వేస్తూ, బాగా దగ్గరపడి గట్టిగా అయ్యేవరకు కలిపి దింపి, మూత పెట్టేయాలి ● కొద్దిగా చల్లారాక, కమలాపండు పరిమాణంలో పిండి తీసుకుని, చపాతీ కర్రతో ఒత్తి, ఒక టేబుల్ స్పూనుడు ఖర్జూరం మిశ్రమాన్ని దాని మీద ఉంచి గుండ్రంగా గొట్టం మాదిరిగా చుట్టి, అంచులు మూసేయాలి ● ఇలా మొత్తం మిశ్రమం పిండి అంతా తయారుచేసుకుని, నెయ్యి పూసిన పళ్లెంలో అమర్చి, కుకర్‌లో ఉంచి, ఆవిరి మీద ఉడికించి దింపేయాలి ● చల్లారిన తరవాత వాటిని మధ్యకు కట్ చేసి అందించాలి.



స్వీట్ స్టఫ్డ్ కట్‌లెట్



...లీలకు ఉప్పు,
...దం పప్పులు
... – పావు
... కప్పు; డార్క్
... నూనె – ఒక
... టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – 2

...లు, నువ్వులు, వాల్నట్స్, బ్రౌన్ సుగర్,
...ట్టాలి ● ఒక పెద్ద పాత్రలో బియ్యప్పిండి,
... ● పెద్ద పెద్ద ఉండలు చేసుకోవాలి ●
...యారుచేసి ఉంచుకున్న డ్రైఫ్రూట్స్
...మూసేసి, కొద్దిగా పల్చగా ఒత్తాలి ● పాన్
...రుచేసి ఉంచుకున్న కట్‌లెట్‌లను వేసి
...ండు వైపులా దోరగా కాల్చి తీసేయాలి ●
(స్టౌ మంట బాగా తగ్గించి, సన్నటి సెగ మీద ఎక్కువసేపు కాల్చాలి)



...ఆవిరి
...ళ్లు పోసి,
... కలిపి
...అయ్యేవరకు
...చేతికి
... పిండిని
... ఇడ్లీ రేకుల
... ఒత్తాలి ●
...రుచేసుకున్న
...ాలి ●

రైస్ ఫ్లోర్ సూప్

కావలసినవి: చిన్నచిన్న ముక్కలుగా తరిగిన క్యారట్ + క్యాబేజి + బీన్స్ + బఠాణీ – 5 కప్పులు; బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు; ఉల్లి తరుగు – ఒక టేబుల్ స్పూను; పచ్చి మిర్చి – 2 (చిన్న ముక్కలుగా కట్ చేయాలి); అల్లం తురుము – ఒక టేబుల్ స్పూను; వెల్లుల్లి తరుగు – ఒక టేబుల్ స్పూను; మిరియాల పొడి – ఒక టీ స్పూను; కార్న్ ఫ్లోర్ – ఒక టేబుల్ స్పూను; పాలు – 2 టేబుల్ స్పూన్లు; కొత్తి మీర – కొద్దిగా; బటర్ – ఒక టేబుల్ స్పూను ఉప్పు – తగినంత

తయారి: ● స్టౌ మీద బాణలి వేడి చేశాక, బటర్ వేసి కరిగించాలి ● ఉల్లి తరుగు, అల్లం తురుము, వెల్లుల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు వేసి పచ్చి వాసన పోయేవరకు వేయించాలి ● కూర ముక్కలు, ఉప్పు జత చేసి మరో రెండు నిమిషాలు వేయించాలి ● మూడు కప్పుల నీళ్లు జత చేసి, ముక్కలు మెత్తబడేవరకు ఉడికించాలి ● ఒక చిన్న గిన్నెలో పాలు, బియ్యప్పిండి వేసి బాగా కలిపి, ఉడుకుతున్న కూరముక్కలలో వేసి సన్నటి మంట మీద ఐదు నిమిషాలు ఉంచాలి ● మిరియాల పొడి, కొత్తిమీర జత చేస్తే, వేడి వేడి రైస్ ఫ్లోర్ సూప్ రెడీ అయినట్లే ● బ్రెడ్ లేదా పావ్‌తో అందించాలి.



సేకరణ: **వైజయంతి**

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు – 21

ఆఖరు ప్రయత్నం



● అబ్బూరి ఛాయాదేవి

'ఇవాళ ఎలాగైనా సరే' అనుకుంది.

వెళ్లి మెయిన్ డోర్ వేసేసింది. కిటికీ కర్టెన్లు లాగేసింది. రెండు బాల్కనీలు ఉన్నాయి. రెండిటి తలుపులు వేసేసింది. కిచెన్‌లో వాటర్ ప్యూరిఫయర్ ఉంది. అది ఆన్‌లో ఉందా ఆఫ్‌లో ఉందా చెక్ చేసుకుంది. స్టవ్ చెక్ చేసింది. బాత్‌రూమ్‌లో ట్యాప్‌లు కట్టేసి ఉన్నాయా లేదా చూసుకుంది. టీవీ ఒక్కటే రన్ అవుతూ ఉంది... దానిని ఆఫ్ చేయాలా లేదా మ్యూట్‌లో పెట్టాలా అని ఒక్క క్షణం ఆలోచించింది.

ఇంట్లో టీవీ ఉంటే మనిషి ఉన్నట్టు.

పెద్దాడు రెండేళ్ల క్రితం యూఎస్ వెళ్లిపోయాడు కోడలితో, పిల్లవాడితో. కూతురు ఈ మధ్యే కాన్పుకొచ్చి తిరిగి వెళ్లిపోయింది. ఇంట్లో మిగిలింది ఇద్దరు. భర్తా తను. భర్త ఏవో పుస్తకాలు చదువుకుంటూ పార్క్‌కు వెళ్లి తన ఈడు వాళ్లతో బాతాఖానీ వేస్తూ లేదా క్లబ్‌లో తొమ్మిదీ పది దాకా కార్డ్స్ ఆడుతూ.... ఇక ఇంట్లో ఏ శబ్దం ఉంటుంది... టీవీ శబ్దం తప్ప.

ఇవాళ దానిని కూడా ఆఫ్ చేసేద్దామనుకుంది.

చేసేసింది.

టైమ్ చూసుకుంది. రాత్రి ఎనిమిది.

భర్త స్పేర్ కీ తీసుకెళ్లాడా లేదా చెక్ చేసింది. తీసుకెళ్లాడు. తలుపు తప్పనిసరిగా తీయాలన్న నియమం లేదు. తీసుకుని వచ్చేస్తాడు. మంచిది.



బెడ్‌రూమ్‌లోకి వెళ్లింది. శుభ్రమైన దుప్పటి పరచి, లేత రంగుల్లో ఉన్న పిల్లో కవర్స్‌తో ఎంతో ప్రశాంతంగా ఉంది. ఇలా పడుకోగానే అలా నిద్ర రావాలి దాని మీద. కాని రావడం లేదే.

కప్‌బోర్డ్‌లో నిద్ర మాత్రల బాటిల్ తీసుకుని జాగ్రత్తగా ఒక టాబ్లెట్ తీసి మంచినీళ్లతో వేసుకుంది.

ఇది వేసుకుంటే నిద్ర రావాలి.

వస్తుందనే డాక్టర్ చెప్పాడు.

కానీ రాదు. నిద్ర సరిగా పట్టదు. నిద్రకు భయపడి, నిద్రపోవడం తప్పని స్థిరపడి, గాఢమైన నిద్రపోయే హక్కు తనకు లేదు అని కండీషనింగ్ చేసుకోవడం వల్ల తనకు నిద్ర పట్టదు. ఎంత ప్రయత్నించినా పట్టదే.

చిన్నప్పుడు బాగా నిద్ర పట్టిన గుర్తు ఉంది. కానీ మూడు నాలుగు తరగతులకు వచ్చే సరికి ముఖాన ధడేలుమని నీళ్లు చల్లి 'లేవే లే... చదువుకోవాలి లే' అని అమ్మ నిద్ర లేపేసేది. ఎంతో ముఖ్యమైన నిద్ర ఆ తెల్లవారుజాము ట్యూషన్లలో నాశనమైపోయింది. స్కూల్లో మధ్యాహ్నం క్లాసులలో బయట ఆ ఎండకీ లోపల అర్థం కాని పాఠానికి చాలా నిద్ర వచ్చేది. ఒకసారి దాదాపు నిద్రపోబోయింది. కానీ టీచర్ డస్టర్‌తో తల మీద ఎంత గట్టిగా కొట్టిందంటే పగటి నిద్ర ఆ దెబ్బతో చచ్చిపోయింది. హమ్మయ్య... ఆదివారం వచ్చింది ఆ రోజన్నా కాస్త మనసుతీరా నిద్రపోయి లేద్దాం అంటే అమ్మ తలంటు అని అప్పుడు కూడా లేపేసేది.

ఇక వయసు రావడం నిద్ర లేకపోవడం ఒకేసారి జరుగుతాయి.

'ఏమిటే... వయసొచ్చిన పిల్ల అంత సేపు పడుకోవచ్చా' అని అమ్మ వెలుతురొచ్చే ముందే లేపేసేది. ఇక వాకిలి ఊడ్చి, కళ్లాపి చల్లి, మోటార్ వేసి, బంతిపూలు ఏమైనా పూసి ఉంటే కనుక వాటిని తెంచి, కాసేపు చదువుకుని, కాలేజీకి తయారయ్యి... నిద్రే లేదు. అందమైన కళ్లు... అందమైన కళ్లు అని అందరూ అనేవారు. పొగడ్తలు ఎవరికి కావాలి... నిద్ర కావాలి వాటికి.

అసలు నిద్రకూ పరీక్షలకు లంకె ఏమిటో ఎంత ఆలోచించినా అర్థమయ్యేది కాదు. పరీక్షలప్పుడు నిద్ర పది టన్నుల బరువుతో వచ్చేది. కనురెప్పల మీద రాక్షసులు ఎక్కి తొక్కుతున్నట్టే ఉండేది. ఆ నిద్రను కాపలాకాచే బాధ్యత నాన్న తీసుకునేవాడు.

'మా తల్లి కదూ... ఈ టీ తాగి చదువుకోమ్మా' అని ఫ్లాస్క్ విప్పి టీ అందించేవాడు.

చదువుకు, పెళ్లికి మధ్య ఒక గ్యాప్ ఉంటుంది. అప్పుడు నిద్రపోవచ్చు ఆడపిల్ల.

కానీ 'ఆడపిల్ల నిద్ర ఇంటికి దరిద్రం. ఇలా పడుకుంటే సంబంధాలు కుదరవు' అని అమ్మ నిద్ర పోనిచ్చేది కాదు.

ఇక పెళ్లయ్యాక భర్తను కొన్నాళ్ల పాటు శ్రీవారు అని మురిపెం చేయడం కద్దు. ఈ శ్రీవారు నిద్రకు విరోధి. రాత్రికి హక్కుదారు. మెలుకువకు పట్టాదారు. ఆ శ్రీవారు శ్రీమతిని మెలుకువగా ఉంచి మెలుకువను పదే పదే తెప్పించి ఆఖరికి తను మాత్రం గుర్రు పెట్టి నిద్రపోయేవాడు. శ్రీమతి చచ్చినట్టు లేవాల్సిందే. లేకుంటే అత్తగారు ఏమనుకుంటారు... ఆడపడుచు ఏమనుకుంటుంది... తెల్లవారే లేచి ముగ్గు వేసే కోడలే ఉత్తమురాలు.. ఆ కోడలి నిద్ర ఏ గంగలో అయినా కలవనీగాక.

ఈ మురిపెం ఇలా ఉంటుందా... తొమ్మిది నెలలు తిరిగేసరికల్లా ఒడిలో కయ్‌మని ఏడుపు.

బాలింతకు నిద్ర కరువు. పాలు పట్టాలి.

పిల్లవాడికి నిద్ర కరువు. బాలింత మేలుకోవాలి.

మూడు నాలుగేళ్ల వయసు వచ్చేసరికి– అదే సర్కిల్– నిద్ర లేవడం, లేపడం, స్కూళ్లకు సిద్ధం చేయడం, వంట చేసుకోవడం....

పిల్లలు కొంచెం ఎదిగొచ్చి పైస్కూళ్లకు వెళ్లే టైమ్‌లో మధ్యాహ్నం పూట నిద్ర పోవడానికి ట్రై చేసింది. సరిగ్గా కునుకు పట్టే వేళకు ఏ పోస్ట్‌మేనో తలుపు తట్టేవాడు. ఇరుగమ్మో పొరుగమ్మో వొదినా అంటూ వచ్చేది. లేదంటే పక్కింటి అల్లరి కుర్రాడు బెల్‌కొట్టి పారిపోయేవాడు. నాలుగవుతూనే పనిమనిషి తయారు– అంట్ల కోసం.

కొడుకు పెళ్లి జరుగుతుంది– పురుడొస్తుంది– మేలుకోవాలి.

కూతురు పెళ్లి జరుగుతుంది– బిడ్డ పుడుతుంది– మేలుకోవాలి.

అమ్మమ్మ, నానమ్మ హోదాలు నిద్రను ష్యూరిటీగా ఇస్తే తప్ప దక్కవు.

ఇన్నాళ్లకు అన్నీ సెటిలయ్యి హాయిగా నిద్ర పోదామనుకుంటే భర్తకు రాత్రి పూట ఒకటి రెండుసార్లు బాత్‌రూమ్‌కు వెళ్లే అలవాటు. లేస్తాడు. లేస్తే లేచాడు... లైటు వేసేసి... ట్యాప్ తిప్పేసి.. అదొక జాతర. అలెర్జిక్ కాఫట... మధ్య మధ్య లేచి దగ్గుతాడు.

నిద్ర రాత లేదా తనకు.

'ఇవాళ ఎలాగైనా' అని మళ్లీ గట్టిగా అనుకుంది.

'శవం నిద్ర పోయినంత గాఢంగా నిద్రపోవాలి' అనుకుంది.

కానీ టాబ్లెట్ వేసుకుని ఇంత సేపైనా నిద్ర రావడం లేదే.

ఇంకో టాబ్లెట్ వేసుకుంటే? ట్రై చేద్దాం. బాటిల్ విప్పి అరచేతిలో వొంచింది. మొత్తం టాబ్లెట్లు పడ్డాయి. మొత్తం. వాటి నిండా నిద్రే ఉంటుందా?

లాగుతోంది మనసు. నిద్ర కావాలని వెర్రెక్కిపోతోంది మనసు.

ఒక్కొక్కటే వేసుకుంటూ నీళ్లు తాగేసింది.

కళ్ల మీద మగత. హమ్మయ్య. నిద్ర వస్తున్నట్టుంది.

భర్త వచ్చి ఎక్కడ డిస్టర్బ్ చేస్తాడో.

'ఏమండీ... చచ్చిపోవట్లేదు. నిద్రపోతున్నా' కాగితం రాసి కళ్లు మూసుకుంది.

కథ ముగిసింది.

అబ్బూరి ఛాయాదేవి రాసిన 'సుఖాంతం' కథ ఇది.

అన్నింటికీ నెపం మగాడి మీద వేయాల్సిన అవసరం లేదు. స్త్రీని పట్టించుకోవడం అంటే మగాడు మాత్రమే కాదు.. మొత్తం కుటుంబం పట్టించుకోవాలి. సాటి స్త్రీ పట్టించుకోవాలి. తల్లి, తండ్రి, పిల్లలు, తోబుట్టువులు... అందరూ పట్టించుకుంటేనే ఆమెకు కనీస విశ్రాంతి దొరుకుతుంది. ఏమడుగుతోంది స్త్రీ... మణులా మాణిక్యాలా... కంటి నిండా నిద్ర. మనింట్లో అమ్మ ఎన్ని గంటలు నిద్రపోతున్నదో ఇవాళ గమనిద్దామా?

పునః కథనం: **ఖదీర్**

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)



అద్దంలో చూసుకుంటున్నట్లయితే రోజురోజుకీ మార్పు కనపడకపోయినా ఏదో ఒక రోజున స్పష్టమైన మార్పు ఉందని ఎలా గుర్తించగలుగుతామో, అప్పటి నుండీ ప్రతిరోజూ పరిశీలించుకుంటూ ఉంటామో, అలా జరిగిపోయిన రోజుల్లో ఉండే మీ ప్రవర్తనకీ ప్రస్తుతం ఉన్న మీ పరిస్థితికీ ప్రవర్తనకీ ఎంత ఆనందకరమైన మార్పు మీలో వచ్చిందో గుర్తించుకోగలుగుతారు. ఒకప్పటి తీవ్ర ఆవేశం, నోటి నుంచి మాటలని వింటి నుండి బాణాల్లా విడిచిన తనం, లెక్కలేకుండా మాట్లాడే విధానం క్రమంగా తగ్గుతాయి. తగ్గినట్టు అర్థమౌతాయి కూడ. ఇది మంచి పరిణామం మీకు. మొదటి నుండీ కూడ శ్రమపడి పనిచేసే అలవాటు ఉన్న మీకు శ్రమపడడం కొత్త కానే కాదు కాని, అప్పుడు ఒక లక్ష్యం లేదు – ఇప్పుడు విజయాన్ని సాధించి తీరాలనే పట్టుదలా గమ్యమూ ఉన్నాయి. మంచిదే.ఈ కొత్త మార్పు కారణంగానూ, మీ ప్రవర్తనలోని మార్పు కారణంగానూ కొన్ని అవమానాలకి గురవుతారు. తాత్కాలికంగా అయినా తట్టుకుని విజేత కావాలనే ఉద్దేశ్యంతో సంయమనంతోనే వ్యవహరించగలుగుతారు. దీంతో ఒకప్పుడున్న ఒత్తిడి దాదాపు ఉండదు. బాగా తగ్గుతుంది. మీలో ఉన్న చిన్న లోపం ఒకటేనేమో గుర్తుంచుకోండి. గ్రహించుకోండి. జ్యోతిషంలో బుధగ్రహం పాపగ్రహంతో చేరితే వ్యక్తికి నష్టాన్నీ, దుఃఖాన్నీ, కష్టాన్నీ, అదే బుధగ్రహం పుణ్యగ్రహంతో చేరితే లాభాన్నీ సుఖాన్నీ ఆనందాన్నీ ఇస్తాడు. (బుధః పాపయుతః పాపః పుణ్యయుతః పుణ్యః) అలా మీ భర్త భార్యతో ఉన్నప్పుడు ఒకలా, తల్లిదండ్రులతో – విశేషించి – తల్లితో ఉన్నప్పుడు ఒకలా ప్రవర్తిస్తున్నారేమో మీలో మీరే అంచనా వేసుకోండి. ఇంకా ఏమీ పోలేదు. వెనక్కి ఒక్క అడుగు వేయగలిగితే అవన్నీ మీవే. దేవుడు వరమిస్తానంటున్నా పూజారి కుదరదంటున్నట్టుగా మీ భర్త / భార్య అనుకూలురౌతూ కలిసిపోతామన్నా తల్లి / తండ్రి లేదా ఉభయులూ విశేషించి ఓ కుటుంబానికి చెందిన ఆప్తుడూ కుటుంబ సభ్యులూ అడ్డు పడుతున్నారేమో గమనించుకోండి. చెట్టు ఎదిగేది ప్రధానమైన కాండం (మాను) ద్వారా తప్ప ఆకులూ కొమ్మలూ ద్వారా కాదు. ఈ ఆకులు రాలిపోతుంటాయి. కొమ్మలు ఎండిపోతుంటాయి. కాండమే జాగ్రత్తగా ఉండాలి. గమనించండి.

లౌకిక పరిష్కారం: పట్టుదలని మాని, నా జీవితం నాది అనే భావనతో ఒక మెట్టు దిగండి.

అలౌకిక పరిష్కారం: శ్రీమద్రామాయణంలోని సుందరకాండ పారాయణాన్ని చేయండి, చేయించండి.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)



ఓ విత్తనాన్ని భూమిలో నాటి కొన్ని నీళ్లు పోస్తే ఒకట్రెండు రోజులకి భూమి పగులుతూ మరో రోజుకి చిన్న అంకురం ప్రారంభమై మరో రోజుకి రెండాకులని వేస్తూ... ఇలా క్రమంగా పెరిగి పెరిగి మహావృక్షంగా మారుతుంది. చిన్న మొక్కగా ఎదుగుతున్న దశలో పైకి దాన్ని లాగి పెద్దగా చేద్దామనుకుంటే మొదటికే మోసం వస్తుంది. మీ ఆలోచన ఎలా ఉండొచ్చంటే – ఒక్కసారిగా ఎదిగిపోవా–లని. అది సరికాదు. పెద్ద పెట్టుబడితో పూర్వ అనుభవం లేని వ్యాపారంలోకి ఏదో కొందరు తెలిసినవారున్నారు గదా! అని దిగడం సరి కానే కాదు. నిదానంగానూ ఏకాగ్రతతోనూ ప్రయాణించడం మంచిదని పెద్దల మాట! ముందు మీ అనారోగ్యాన్ని మరింతగా పోషించుకుంటూ అనారోగ్య దిశగా ప్రయాణిస్తున్నారేమో గమనించుకోండి. గిన్నెని సరిగా తోమకుంటే పాలు విరిగిపోతాయనేది ఎలా నిజమో, అలాగే శారీరకారోగ్యం సరిలేని పక్షంలో అది మనసు మీద ప్రభావాన్ని చూపించి వ్యక్తికి నిస్పృహ ని, నిరాశనీ కలగజేస్తుంది. ఆ తీరు, భావన ఎదుగుదలకి వ్యతిరేకమైన దిగుదలకి కారణమౌతుంది. ఆరోగ్య జాగ్రత్త అవసరం.

భూములనీ ఇళ్లనీ పొలాలనీ కొనాలనే ఆలోచన మంచిదే కాని, ప్రస్తుతం మీకు జరుగుతున్న దశ ప్రకారం, ఎంత దగ్గరి బంధువునైనా సరే ఆర్థికమైన లావాదేవీల విషయంలో ప్రతిపక్ష వ్యక్తిగానే భావించి వ్యవహారాన్ని వ్యవహార శైలిలోనే నడిపించుకోవాలి గాని, అక్కడ బంధుత్వం – మొగమాటం – తర్వాత చూసుకుందాం!... వంటి మాటలకి తావుండనే ఉండకూడదు.

అనుకోకుండా వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల ద్వారా ఆర్థిక లాభం చేకూరే అవకాశం బలంగా ఉంది. సహజంగా ఇలాంటి సందర్భాల్లో ఆర్థిక నిపుణుల సలహాలని మాత్రమే తీసుకోవడం, అలాగే భార్యాభర్తల పరస్పర నిర్ణయం మంచిది తప్ప తొందరపాటు నిర్ణయం లేదా ఏకపక్ష నిర్ణయం ఏ మాత్రమూ మీ విషయంలో సరికావు. ఈ సందర్భంలో పట్టుదలకి పోవద్దు – అస్వతంత్రతా భావనకి వెళ్లద్దు.

లౌకిక పరిష్కారం: దంపతుల పరస్పర సమన్వయ భావంతో నిర్ణయాన్ని తీసుకోవడం అవసరం.

అలౌకిక పరిష్కారం: లక్ష్మీ సహస్రనామార్చనని వారంలో ఒకరోజున చేసుకోండి.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)



'చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష!' అనుకుంటూ కూర్చునే రోజులు కావివి. మన వంతు ప్రయత్నాన్ని మనం చేస్తూనే ఉంటే తప్ప, పనులు నెరవేరని కాలమిది. ఈ మర్మం తెలిసినవారు కాబట్టే, మిమ్మల్ని మీరు పరిచయం చేసుకునేందుకు అనేక ప్రయత్నాలను చేసి చేసి మొత్తానికి ఓ గుర్తింపుని తెచ్చుకోగలిగారు సంఘంలో. ఈ కారణంగా మీరనుకున్న పనుల్లో జాప్యం తొలగిపోయి, మీ గుర్తింపు వల్ల పనుల్లో శీఘ్రత చోటు చేసుకుంటుంది. ఇది చెప్పుకోదగ్గ పరిణామం.

స్పష్టంగా ఓ పనిని గురించి అడగదలిచి వెళ్లినప్పటికీ, కొంత సంకోచం లేదా మొగమాటం వల్ల కొన్ని పనులు ఆరంభదశలోనే ఉండిపోయే ప్రమాదముంది. రెండు మూడుమార్లు మిమ్మల్ని మీరు లోలోపల ప్రోత్సహించుకుని ప్రేరేపించుకున్నాక ఆ పనిని గురించిన అసలైన వ్యక్తితో మీ విషయాన్ని ముచ్చటించుకుంటారు. అకస్మాత్తుగా వచ్చిన ఓ మాటపట్టింపుకి సంబంధించి ఇబ్బంది మీ ఒక మిత్రుని ద్వారా పరిష్కరింపబడి మనశ్శాంతి కలుగజేస్తుంది. రావలసిన బాకీలు చేతికందిన కారణంగానూ, ఎప్పుడో దాచిన సొమ్ము అక్కరకు రావడం ద్వారానూ, ఒకప్పుడు బేరానికి పెట్టిన స్థిరమైన ఆస్తి అమ్ముబడిన కారణంగానూ .. ఇలా ఏదో ఒక తీరున ధనం పుష్కలంగా మీకు చేరుతుంది. అయితే అత్యాశకిపోయి ఎక్కువ వడ్డీకి అప్పుగా ఇవ్వడం లేదా మిత్రునికి ఆప్తుడైన కారణంగా చేబదులుగా ఇవ్వడం వంటివి చేయద్దు. ఆర్థికంగా కలిసిరాదు అప్పుగా ఇస్తే.

విదేశాల నుండి మీకు ఆర్థికంగా లాభించే తీరుగా పిలుపు మీ ఉద్యోగపరంగానో వ్యాపారపరంగానో రావచ్చు. ముందుకు ముందే నిబంధనలన్నీ వ్యవహారరూపంగా మాట్లాడుకుని మాత్రమే వెళ్లడం మంచిది తప్ప విదేశం కదా! అనే మోజుతో వెళ్లినట్లయితే – విదేశాలకి వెళ్లొచ్చానని చెప్పుకోవడానికి మాత్రమే ఉపకరిస్తుంది మీ ప్రయాణం. లాభమేమాత్రమూ ఉండ(బో)దు.

లౌకిక పరిష్కారం: మొగమాటం లేకుండా స్పష్టంగా చేసుకోవాల్సిన పనిని ముందే మాట్లాడుకోండి.

అలౌకికపరిష్కారం: శివాలయంలో రుద్రాభిషేకాన్ని చేయించుకోండి.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)



'ఏ మార్గమైనా రాజప్రాసాదానికే వెళ్తుంది. ఏ వాహనాన్నెక్కినా రాజప్రాసాదానికే తీసుకెడుతుం'దని మీకు తెలుసు. అయితే మీరు చెప్పిన మార్గంలోనే వెళ్లాలనీ – మీరు సూచించిన వాహనాన్నే ఎక్కాలనీ నిర్ణయించి దాన్ని అమలు చేసేవరకూ ఒత్తిడి చేస్తారు/ చేశారు కాబట్టే ప్రస్తుతం చిక్కులో పడి, మెల్లగా చిక్కుముడి నుండి బయటికొస్తున్నారు. ఇప్పటివరకూ పట్టుదలని పట్టి ఉండటం తప్పు. ఇప్పటినుండి కార్యదీక్ష వైపు దృష్టి పెట్టి పట్టుదలతో ఉండకపోవడం తప్పు. ధర్మబద్ధంగానే వ్యవహరించారు కాబట్టి ఇప్పుడు మెత్తపడనవసరం లేదు. శస్త్ర చికిత్సకి సిద్ధమై సగం చికిత్స అయ్యాక ఇప్పుడు 'నొప్పి' అంటూ మానెయ్యమనడమూ సరికాదు – మానడం సాధ్యమూ కాదు. ముగింపుకొచ్చేశారు. ధైర్యంగా ఉండండి. కర్ణపిశాచి (సెల్)లో మాట్లాడేటప్పుడు గాని, ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు గాని, రాతకోతల విషయంలో గాని, మీ ప్రత్యర్థి మీ పక్కనే ఉన్నాడనుకుంటూ వ్యవహరించండి తప్ప, ప్రమత్తంగా ఉండ(నే)కూడదు. భయపెట్టడం కాదు – ఇది జాగ్రత్తని చెప్పడమని గమనించండి. చాలాకాలం నుండి పరిష్కారం కాని జీవితము ఖ్యాంశం ఒకటి పరిష్కార దశకొచ్చింది కాబట్టి ఈ జాగ్రత్త సుమా! మధ్యవర్తి/ర్తులు గాని వచ్చినట్లయితే వారినే మాట్లాడనియ్యండి. 'అంతేనా? నిజమేనంటారా? అవునా?' అంటూ మీ అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయబోతే 'చెప్పేదేమిటో పూర్తిగా చెప్పం'డంటూ మొత్తాన్ని విని – ఆలోచించి చెప్తా–ననండి తప్ప నిర్ణయాన్ని ముఖ కవళికల్లో లేదా మాటల్లో తెలియనీయకండి. ఇదేదో రాజనీతీ లౌక్యమూ కాదు – ఎదుటివారు మిమ్మల్ని ఇలా మార్చేసిన తీరుకి సాక్ష్యం – మీ మంచితనాన్ని అసమర్థతగా లెక్కించిన వైనానికి ఉదాహరణ. ఎదుటివారు ఏం మాట్లాడినా, ఎంత మెత్తగా/ గట్టిగా మాట్లాడినా ప్రయత్నించినా/ విరోధించినా విజయం మాత్రం మీదే. నిర్భయంగా ఉండండి. ధర్మబద్ధంగానే ఉండండి.

లౌకిక పరిష్కారం: ఆచి తూచి మాట్లాడండి. మెత్తగా మాట్లాడుతూ విషయం గట్టిగా అర్థమయ్యేలా చెప్పండి.

అలౌకిక పరిష్కారం: మన్యుసూక్తం పారాయణాన్ని చేయించుకోండి. శని శ్లోకాన్ని 19 మార్లు చదువుకుంటూ ఉండండి.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)



భారతంలోని ఓ కథ. ఆ ఇంటి ఈ ఇంటి బలిష్టమైన ఆహారాన్ని తిని బాగా బొద్దుగా అయిన ఓ పక్షి (కాకి) ఆకాశంలో ఎగురుతున్న హంసలా ఎగరాలని ఆలోచించి, పదిమంది ప్రోత్సాహం మీద వాటితో సమానంగా ఎగరదలిచి ఎగరలేక నేలన పడింది. తన జాతిలో తాను బాగా బలిష్టమైనదే తప్ప హంసజాతితో పోల్చదగినంత శక్తి తనకి లేదని గమనించుకోకపోవడమే దాని తప్పు. ఇతరుల ప్రోత్సాహం దీనికి తోడయింది. మీ స్థాయిలో మీరు వ్యాపారంలో బలంగా ఉన్నవారే అయినా, ఆలోచిస్తున్న నూతన వ్యాపారం మాత్రం మీ స్థాయిని మించినదే. అనుమానం లేదు. ఇది మిమ్మల్ని అవమానించే మాటగా భావించకండి. శ్రేయస్సు కోరే శాస్త్రం నిజాన్ని నిష్కర్షగా చెబుతుంది. ప్రస్తుత దశలో విజయాలు లభించే అవకాశం రాబోతోంది తప్ప, విజయాలు పొందే కాలం ఈ వారం మాత్రం కాదు. ఆధ్యాత్మికమైన ప్రయాణాలు తీర్థయాత్రలూ, దైవదర్శనాలూ, పుణ్యస్నానాలూ మంచివే కాని, అవి శృతిమించిన సందర్భంలో నిత్యకృత్య కర్తవ్యం దెబ్బతింటుంది. ఇది మీ విషయంలో అక్షరసత్యంగా ఉందేమో గమనించుకోండి.

మీకు భూ–గృహ–ధాన్యక్షేత్రాలు (పొలం) కొనాలనే ఆలోచన ఉన్నమాట నిజమే అయినా, ముందుగా మీ భార్య/భర్తకి' ప్రణాళికబద్ధంగా మాత్రమే ఆర్థిక విషయాల్లో ఉందామనే గట్టి నిర్ణయం రావాలి. ముఖ్యంగా మధ్య – దిగువ తరగతి సంసారాలు దెబ్బతిన్న(నే)ది ఇక్కడే ఈ అంశంలోనే.

చేస్తున్న వృత్తి, ఉద్యోగ, వ్యాపార విషయాల్లో మరింత శ్రద్ధని పాటించి తీరాల్సిందే. పాడి కుండలాటి మీ నిత్య కృత్యంలో ఏ చిన్నపొరపాటు దొర్లినా – పాలలో ఉప్పురాయి పడి పాలు విరిగిపోయేటట్లుగా అనవసరమైన ఇబ్బందిని కలగజేస్తుంది. అడుసు తొక్కనేల? కాలు కడగనేల?

లౌకిక పరిష్కారం: వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో నిబద్ధతని పాటించండి.

అలౌకిక పరిష్కారం: వారంలో ఒక్కరోజు మీ కిష్టమైన దేవాలయాన్ని శుభ్రపరిచి ముగ్గులు వేసి దైవాన్ని దర్శించి రండి.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)



'వెనకటికెవరో సగం దూరం వెళ్లాక ఇంతకీ ఏ ఊరెళ్లాలి? తోవ ఎటు?' అని అడిగాట్ట. అలా పుల్లయ్య వేమవరం వ్యవహారం కాకుండా స్పష్టంగా అవగాహనతో – ఏం మాట్లాడాలి? ఎలా సమస్యని పరిష్కరించుకోవాలి? వ్యవహారం అడ్డం తిరిగితే ఏం చేయాల్సి వస్తుంది? ఇలా ఆలోచించుకున్నాకే పనికి బయలుదేరండి. అక్కడికెళ్లాక పరిస్థితి ఎలా ఉంటే దానికి అనుగుణంగా మాట్లాడడమనేది ఒక సందర్భంలో ఎదురుకావచ్చు. దానికి తాత్కాలిక మౌనమే సరైన సమాధానంగా ఎంచుకోండి. ప్రస్తుతానికి.

ఇటువైపువారు ఒక బాణాన్ని విడిస్తే అటువైపు వారూ బాణాన్ని సంధిస్తారనేది నిజం. సర్వసాధారణమూ కదా! అవతలివారు తగిన విధంగా సాక్ష్యాలూ ఉదాహరణలూ వంటి సరంజామాతో బాగా సిద్ధమై వచ్చే అవకాశముంది కాబట్టి, వాళ్ల మన సంభాషణని ఎవరికి వినిపించినా మన నుండి తప్పులేకుండా ఉండేలా సంయమనంతో మాట్లాడండి. రెచ్చగొట్టినా ప్రశాంతంగా సమాధానాన్నియ్యడం తప్పనిసరి ప్రస్తుత దశలో. లేని పక్షంలో మీ భవిష్యత్కార్యాచరణకి ఈ సంభాషణలే ముందు కాళ్లకి బంధాలుగా అయ్యే ప్రమాదముంది.

ఎప్పుడూ వ్యతిరేకాలోచనలని రానిచ్చుకోకండి. అంతా మంచే జరుగుతుందనే సానుకూల దృక్పథంతోనే ఉండండి. నేటి విజ్ఞానశాస్త్రం ద్వారా అది నిరూపింపబడ(లే)కపోవచ్చు గాని, అనర్థాన్ని ఊహిస్తూ ఉంటే ఎప్పుడూ పని సానుకూల పడదనేది ధర్మశాస్త్రం నిరూపించిన సత్యం. అనుభవంలో కన్పించే యథార్థం కూడా.


ఏ మాత్రమూ దిగులు పడాల్సిన పనిలేదు నిర్భయంగా వెళ్లండి ప్రతిపనిలోకీ. విజయమే వరిస్తుంది. మీకు బంధుమిత్రుల అండదండలున్నాయనే విషయాన్ని మరిచిపోకండి. మీకు ఈ వారంలో పని సానుకూలపడుతుంది. గౌరవం కీర్తి ప్రతిష్ఠ మీ సొంతం అవుతాయి.

లౌకిక పరిష్కారం: రెచ్చగొట్టబడినా ప్రశాంతంగా ఉంటే చాలు విజయం మీదే ఈ వారంలో.

అలౌకిక పరిష్కారం: ఆదిత్యహృదయస్తోత్రాన్ని రోజుమొత్తం మీద 12 మార్లు పఠించండి.

మల్టీప్లెక్స్ మూవీ

రియల్ మామ్



మామ్.... శ్రీదేవి జీవించిన సినిమా. కూతురికి జరిగిన అన్యాయానికి లోపల్లోపలే కుమిలిపోతూ తమ రాత ఇంతేనని తలపట్టుకుని ఏడుస్తూ కూర్చునే అమ్మ కాదు. బిడ్డ క్షోభను తీర్చడానికి తన బతుకును పణంగా పెట్టే సాహసానికి ఒడిగడుతుంది... విజయం సాధిస్తుంది ఈ అమ్మ. ఆమె పేరు దేవకి సబర్వాల్ (శ్రీదేవి). ఢిల్లీలోని ఓ పెద్ద స్కూల్లో బయాలజీ టీచర్. అదే స్కూల్లో తన కూతురు ఆర్యా పన్నెండో తరగతి చదువుతుంటుంది. అయితే ఆమెకు దేవకి సవతి తల్లి. దేవకి.. ఆర్యాను కూడా తన కడుపున పుట్టిన చిన్న కూతురు ప్రియాలాగే చూసుకున్నా సవతి తల్లిని తల్లిగా ఆమోదించదు ఆర్యా. స్కూల్లో పిలిచినట్టుగానే ఇంట్లో కూడా 'మామ్' (మేడమ్) అనే పిలుస్తుంది. కూతురి ప్రవర్తనకు నొచ్చుకుంటుంటాడు తండ్రి ఆనంద్. సర్దిచెప్పే ప్రయత్నం చేస్తాడు. "నాన్నా... అమ్మ తర్వాత నీ జీవితంలోకి ఇంకో స్త్రీ రావచ్చు. కాని కూతురి జీవితంలోకి ఇంకో అమ్మ రాదు. దయచేసి నన్ను ప్రెషర్ చేయొద్దు ఈ విషయంలో" అని చెప్తుంది తండ్రితో. ఇటు బిడ్డ బిహేవియర్తో భార్య ఏం ఫీలవుతుందోనని సతమతమవుతుంటాడు ఆనంద్. అతను భావిస్తున్నట్టుగానే పెద్ద కూతురి పద్ధతికి దేవకి మనసు చివుక్కుమంటుంటుంది కాని ఆర్యా స్థానంలో ఉండి ఆలోచిస్తుంది. తన స్నేహితురాలకు ఆర్యాను తన కూతురుగా పరిచయం చేయడాన్ని కూడా ఆ పిల్ల సహించదు. ఆ విషయాన్ని మొహమ్మీదే స్పష్టం చేస్తుంది. అలాగని దేవకికి పుట్టిన ప్రియతో సొంత అక్కలాగే మెదులుతుంది మళ్లీ. దేవకిని తల్లిగా తప్ప మిగతా అన్ని విషయాలను యాక్సెప్ట్ చేస్తుంది. ఈ విషయం అర్థం చేసుకున్న దేవకి ఆనంద్తో అంటుంది.. ''ఆర్యాకు మన పరిస్థితి అర్థం చేయించడం కాదు.. మనమే ఆర్యాను అర్థం చేసుకోవాలి'' అని.

వాలంటైన్స్ డే

ఆర్యాపై ఆమె క్లాస్మేట్ అబ్బాయి ఒకడు క్రష్ పెంచుకుంటాడు. అసభ్యంగా ఏవేవో మెసేజ్లు పంపిస్తుంటాడు. ఆర్యా చిరాకుపడుతుంటుంది. ఒకసారి క్లాస్లో దేవకి లెసన్ చెప్తుంటే ఏదో బూతు వీడియో పంపిస్తాడు. తన పక్కనే ఉన్న స్నేహితురాలికి చూపించి ఏమిటని చికాకు పడుతుంది ఆర్యా. ఈ కలకలంతో దేవకి వాళ్ల బెంచ్ దగ్గరకు వచ్చి ఏం జరిగిందంటూ ఆ సెల్ ఫోన్ తీసి చూస్తుంది. విస్తుపోయి ఆ అబ్బాయి సెల్ లాక్కుని కిటికీలోంచి బయటకు పారేస్తుంది. ఈ విషయం మనసులో పెట్టుకొని పగ పెంచుకుంటాడు ఆ అబ్బాయి. ఇదిలా ఉండగా వాలంటైన్స్ డేకి ఓ రిసార్ట్లో పార్టీ ప్లాన్ చేసుకుంటారు ఆర్యా ఫ్రెండ్స్. తండ్రిని పర్మిషన్ అడుగుతుంది. అది చాలా దూరం. వద్దు అని దేవకి అంటుంది. నేను మా నాన్నను అడుగుతున్నాను అంటూ తండ్రిని బతిమాలుతుంది. రాత్రి పన్నెండు కల్లా ఇంటికి వచ్చేస్తాను అని మాటిచ్చి తండ్రి దగ్గర అనుమతి తీసుకుంటుంది. తెల్లవారి తండ్రి బిజినెస్ ట్రిప్ మీద అమెరికా వెళ్తాడు. వాలంటైన్స్ డే రోజు రాత్రి పార్టీకి ఆర్య వెళ్తుంది. అక్కడ తనకు ఇష్టమైన అబ్బాయిని ప్రపోజ్ చేయాలనుకుంటుంది. కాని అతను ఇంకో అమ్మాయితో కనిపించే సరికి ఇక అక్కడ ఆర్యాకు ఉండాలనిపించదు. ఫ్రెండ్తో చెప్పి వెళ్లిపోదామంటుంది. కాని ఫ్రెండ్ అప్పటికే తాగిన మత్తులో ఉండడం వల్ల క్యాబ్ బుక్ చేద్దామని కాస్త పక్కకు వెళ్తుంటే క్లాస్లో తన మీద క్రష్ పెంచుకున్న అబ్బాయి అండ్ గ్యాంగ్ కనిపిస్తారు. ఆ అబ్బాయి ఆర్యాను తనతో డ్యాన్స్ చేయమని అడుగుతాడు. ఆర్యా తిరస్కరించి క్యాబ్ బుక్ చేయడానికి బయటకు వెళ్తుంది. ఆ అవమానాన్ని తట్టుకోలేని ఆ క్లాస్మేట్ తనతోపాటే ఉన్న తన కజిన్, కార్ డ్రైవర్కి చెప్పి ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయాలంటాడు. ఆ రిసార్ట్ వాచ్మన్తో కలిసి ఆర్యాను కిడ్నాప్ చేస్తారు. అంతకు ముందే ఆర్యాకు దేవకి కాల్ చేస్తుంది బయలుదేరమని. క్యాబ్ బుక్ చేస్తున్నాను,... 45 నిమిషాల్లో ఉంటాను ఇంట్లో అని చెప్తుంది ఆర్యా. కాని రెండున్నర గంటలు గడిచినా ఆర్య రాకపోయేసరికి కంగారు పడ్తుంది. ఫోన్ చేస్తుంటే కూడా ఆర్యా ఎత్తకపోయేసరికి దేవకి కంగారు భయంగా మారుతుంది.

గటేరులో...

రాత్రి రెండున్నర గంటలకు కార్లో రిసార్ట్కు బయలుదేరుతుంది దేవకి. అక్కడ ఆర్యాతో పాటు వెళ్లిన వాళ్లను ఆరా తీస్తుంది. ఆర్యా అప్పుడే వెళ్లిపోయింది అంటారు. కాళ్లు చేతులు వణుకుతాయి దేవకికి. నేరుగా పోలీస్స్టేషన్కు వెళ్తుంది. కంప్లయింట్ ఇస్తుంది. వాలంటైన్స్ డే కదా... ఏ బాయ్ఫ్రెండ్తోనో వెళ్లి ఉంటుంది. ఎంజాయ్ చేసి వస్తుందిలే అని పోలీసులు నిర్లక్ష్యంగా మాట్లాడుతుంటే తట్టుకోలేకపోతుంది. మీకిలాంటివన్నీ మామూలే కావచ్చు, కాని మాకు కాదు. నా కూతురు అలాంటిది కాదు అని తీవ్రంగానే చెప్పి తన కూతురు జాడ వెతకమని సీరియస్గా అంటుంది. అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ డిటెక్టివ్ దయాశంకర్ కపూర్ (నవాజుద్దీన్ సిద్దిఖీ)దేవకి బయటకు వెళ్లగానే వెంటే వెళ్లి తన గురించి చెప్పి బిజినెస్ కార్డ్ ఇస్తాడు. అవసరం ఉంటే కాంటాక్ట్ చేయమని. తనకు అవసరం లేదని చెప్తుంది. ''నాకూ ఓ కూతురు ఉంది. మీ బాధను అర్థం చేసుకోగలను. అందుకే హెల్ప్ చేయగలను అంటున్నా'' అని చెప్తాడు. ఇదిలా ఉంటే మార్నింగ్ వాక్కు వెళ్లిన వాళ్లు పద్దెనిమిదేళ్ల ఓ అమ్మాయి గటేరులో పడి ఉండడం చూసి హాస్పిటల్లో చేరుస్తారు. ఆ అమ్మాయి ఆర్యా అని తెలిసి దేవకికి కబురు పంపిస్తారు. పరీక్షల్లో ఆమె గ్యాంగ్ రేప్కి గురయిందని తెలుస్తుంది. అపస్మారక స్థితిలో ఉన్న బిడ్డను చూసి గుండె పగిలేలా ఏడుస్తుంది దేవకి. భర్తకు ఫోన్ చేస్తుంది వెంటనే రమ్మని.

ఒక్కొక్కరుగా...

విషయం కోర్ట్ వరకూ వెళ్తుంది. రేప్ చేసింది ఆర్యా క్లాస్మేట్ అయిన ఆ అబ్బాయి, కజిన్, వాళ్ల డ్రైవర్, వాచ్మన్ అని ఆర్యా చెప్తుంది. కాని డబ్బుతో మేనేజ్ చేసి నిర్దోషులుగా బయటకు వస్తారు. ఈ కేసును టేక్ చేసిన పోలీస్ ఇన్స్పెక్టర్ ఫ్రాన్సిస్ మాథ్యూ (అక్షయ్ ఖన్నా) కూడా ఖంగు తింటాడు. ఎలాగైనా వాళ్లకు శిక్ష పడేలా చేయాలని సరైన సాక్ష్యాలను వెదికే పనిలో ఉంటాడు. ఇంకో వైపు ఆర్యా లోకంతో సంబంధంలేని దానిలా అయిపోతుంది. దేనికీ స్పందించదు. గది నుంచి బయటకు రాదు. జరిగిన సంఘటన గుర్తుకొచ్చినప్పుడల్లా కంపించిపోతుంటుంది. అర్ధరాత్రి లేచి షవర్ కింద కూర్చుని శరీరాన్ని తోలి చేసుకునే ప్రయత్నం చేస్తుంటుంది. బిడ్డ మానసిక స్థితి అర్థమైన దేవకికి కంటి మీద కునుకు ఉండదు. దాంతో దయాశంకర్ కపూర్ను కలుస్తుంది. ఆ నలుగురి వివరాలను తీసుకుంటుంది. వాచ్మన్ క్యాస్ట్రేషన్కు లోనవుతాడు. ఆర్యా క్లాస్మేట్ వాళ్ల కజిన్ యాపిల్ సీడ్స్ పౌడర్ (ఇది సైనైడ్లాంటిది) కలిసి ఉన్న ప్రొటీన్ షేక్ తాగడం వల్ల పక్షవాతానికి లోనై చావుకి దగ్గరవుతాడు. ఇది చేసింది అతని కజినే అని పోలీస్ ఎంక్వయిరీలో తేలి ఆర్యా క్లాస్మేట్ జైలు పాలవుతాడు. వీళ్లందరూ వరుసగా ఇలా పనిష్మెంట్కు గురవుతుంటే అటు పోలీస్ ఫ్రాన్సిస్, ఇటు ఆర్యా ఆశ్చర్యపోతారు. ఆర్యా కాస్త తేలికపడుతుంది. ఫ్యామిలీ అంతా కుదుట పడుతుంది. అడుగుతుంది తండ్రిని. వెళ్తారు. అయితే పోలీస్ ఫ్రాన్సిస్కు దేవకి మీద అనుమానం మొదలై గమనిస్తుంటాడు. వాళ్లను మట్టుబెడుతుంది దేవకే అని నిర్ధారణకూ వస్తాడు. చట్టాన్ని ఆమె చేతుల్లోకి తీసుకోకుండా ఆపాలనుకుంటాడు. ఇంతలోకే ఆర్యా క్లాస్మేట్ కజిన్ వాళ్ల డ్రైవర్కు దయాశంకర్ మీద డౌట్ వచ్చి నివృత్తి చేసుకుని అతన్ని చంపేస్తాడు, కుప్రీకి వస్తాడు దేవకీని మట్టుబెట్టడానికి. ఫ్రాన్సిస్ కూడా చేరుకుంటాడు అతన్ని ఫాలో అవుతూ. దేవకి మీద దాడి చేస్తాడు డ్రైవర్. అక్కడే ఉన్న ఆర్యానూ చంపాలనుకుంటాడు కాని దేవకి చెప్పడంతో ఆర్యా అక్కడి నుంచి పారిపోతుంది. మంచులో ఛేజింగ్.... చివరకు దేవకి చేతికి చిక్కుతాడు డ్రైవర్. వెనకే పోలీస్. తన గన్ ఇస్తాడు చంపేదుంటే దాంతో చంపమని. తన తల్లి తన కోసం ఎంత చేసిందో అప్పుడు అర్థమవుతుంది ఆర్యాకు. అప్పుడు పిలుస్తుంది 'మామ్' (అమ్మ) అని. దేవకి ఆ డ్రైవర్ను చంపేస్తుంది. బిడ్డ తల్లిని అక్కున చేర్చుకుంటుంది. గుండెలవిసేలా ఏడుస్తుంది దేవకి.

సవతి తల్లిని రాక్షసిగా కాకుండా... బిడ్డను అర్థం చేసుకునే రియల్ మామ్లా చూపించిందీ సినిమా. ఓ పాశవిక చర్యకు బలైన అమ్మాయి పట్ల కుటుంబం ఎలా ప్రవర్తించాలో చెప్తుంది. ఎలాంటి నైతిక అండ ఉండాలో వివరిస్తుంది. ఈ సినిమా షూటింగ్ విరామ సమయాల్లో కూడా శ్రీదేవి తన పిల్లలకు ఫోన్ చేయలేదట. గ్యాప్ గ్యాప్కి ఫోన్ చేసే అమ్మ ఫోన్ చేయట్లేదేంటి అని శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ తన అక్క జాన్వీని అడిగేదట. 'ఈ సినిమాలో అంత లీనమయ్యా... ఆర్యా ప్లేస్లో నా కూతరే ఉందనుకున్నా' అని చెప్పింది శ్రీదేవి ఓ ఇంటర్వ్యూలో. ఆ మాట నిజమే అనిపిస్తుంది ఈ సినిమా చూస్తే. ఆమేజాన్ ప్రైమ్లో దొరకొచ్చు. ఆల్ఫా మూవీస్ చానెల్లో కూడా తరచుగా ఈ సినిమా ప్లే అవుతోంది.

– శరాది

"శ్రీదేవిలాంటి ఆర్టిస్ట్ వేరీ రేర్. భౌతికంగా ఆమె దూరమైనా శ్రీదేవి జ్ఞాపకాలు అలా బతికే ఉంటాయి" అన్నారు వెంకటేశ్. ముంబై వెళ్లి, శ్రీదేవి అంత్యక్రియల్లో పాల్గొని హైదరాబాద్ వచ్చాక, 'సాక్షి'తో ఆయన ఎక్స్క్లూజివ్గా మాట్లాడారు.

జ్ఞాపకాలు బతికే ఉంటాయి

– వెంకటేశ్


'క్షణక్షణం'లో శ్రీదేవి, వెంకటేశ్

● మీతో యాక్ట్ చేయకముందు శ్రీదేవిగారి గురించి మీరు విన్న మాటలు...

యాక్చువల్లీ శ్రీదేవి చైల్డ్ ఆర్టిస్ట్గా ఉన్నప్పటి నుంచే తన గురించి నాకు తెలుసు. 'శ్రీదేవి అనే చైల్డ్ ఆర్టిస్ట్ ఉంది. చాలా బాగా యాక్ట్ చేస్తోంది' అని చెబుతుండేవారు. మేమంతా అప్పుడు చెన్నైలో ఉండేవాళ్లం. నాలుగైదేళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చింది తను. 14–15 ఇయర్స్కే హీరోయిన్ అయిపోయింది. కమల్హాసన్గారు చైల్డ్ ఆర్టిస్ట్లాగా ఎలా వచ్చారో శ్రీదేవి కూడా అలానే వచ్చారు. హీరోలుగా మేం తర్వాత ఎంట్రీ ఇచ్చాం. యాక్టర్గా తను మోస్ట్ సీనియర్. తనుకున్న ఎక్స్పీరియన్స్ కానీ తన జర్నీ కానీ మోస్ట్ రేర్. ప్రపంచంలో అలా చాలా తక్కువ మంది యాక్టర్స్ ఉంటారు. శ్రీదేవిలాంటి వాళ్లు సినిమా కోసమే పుట్టిన అరుదైన ఆర్టిస్టులు. అందుకే మనం వాళ్లను లెజెండ్స్ అంటుంటాం. 5 ఇయర్స్ నుంచి 50 ఇయర్స్ వరకు సినిమాకు డెడికేట్ చేయడమంటే మాటలు కాదు.

● ఏయన్నార్, ఎన్టీఆర్గార్లతో యాక్ట్ చేసిన శ్రీదేవి ఆ తర్వాతి తరం అయిన మీతో కూడా యాక్ట్ చేశారు. హీరోయిన్స్ విషయంలో ఇలా జరగడం రేర్ కదా..

డెఫినెట్లీ. అప్పటి టాప్ హీరోస్, టాప్ డైరెక్టర్స్ అందరితో వర్క్ చేసి, మళ్లీ మా తరం హీరోస్ అందరితోనూ యాక్ట్ చేయడమే కాకుండా వెళ్లిన ప్రతీ లాంగ్వేజ్లోనూ సూపర్ సక్సెస్ అవ్వడం శ్రీదేవి స్పెషాలిటీ. జనరల్గా హీరోయిన్ లైఫ్ స్పాన్ కొన్ని సంవత్సరాలే అని అంటుంటాం. కానీ శ్రీదేవి విషయంలో ఇది వర్తించదు. డీ–గ్లామర్ రోల్ చేసినా, మోస్ట్ గ్లామరస్ రోల్ చేసినా.. ఎక్సెల్ అయ్యారామె. డ్యాన్స్లు అంటే శ్రీదేవి. కాస్ట్యూమ్స్ అంటే శ్రీదేవి. యాక్టింగ్లో తీసుకుంటే 'పదహారేళ్ల వయసు, 'దేవత' వంటి సినిమాలు ఉన్నాయి. మళ్లీ 'ఇంగ్లిష్ వింగ్లిష్'లాంటి సినిమాతో రీ–ఎంట్రీ ఇచ్చి, తన యాక్టింగ్ కేపబులిటీ చూపించారు. బేసిక్గా శ్రీదేవి బ్లడ్లోనే యాక్టింగ్ ఉంది.

● 'క్షణక్షణం' అప్పుడు శ్రీదేవిగారు మీకంటే సీనియర్ కాబట్టి ఆవిడతో యాక్ట్ చేయడానికి వెనకాడారా?

అలాంటిదేం లేదు. శ్రీదేవి హీరోయిన్ అనగానే టీమ్ అంతా చాలా ఎగ్జైట్ అయ్యాం. ఇద్దరం చాలా బాగా యాక్ట్ చేశాం. అది ప్రతీ సీన్లోనూ కనిపిస్తుంది. కొన్ని కొన్ని సెటిల్డ్ ఎక్స్ప్రెషన్స్ను బాగా క్యాప్చర్ చేశాడు డైరెక్టర్ రామ్గోపాల్ వర్మ. శ్రీదేవికి కూడా ఇది చాలా డిఫరెంట్ రోల్. మ్యూజిక్ చాలా ఫ్రెష్గా ఉంటుంది. క్లైమాక్స్లో ట్రైన్ సీక్వెన్స్ అప్పుడు నేను పడిపోతే తను చేయి ఇవ్వడం.. చాలా ఫన్నీగా బావుంటాయి. సినిమా అయిపోతున్నా హీరో హీరోయిన్కు లవ్ ఎక్స్ప్రెస్ చేయడు. ఫైనల్గా జస్ట్ ఇద్దరం హగ్ చేసుకుంటాం. జస్ట్ ఒక్క ఎక్స్ప్రెషన్తో చెప్పేస్తాం. ఆ సీన్లో ఇద్దరం చాలా న్యాచురల్గా ఎక్స్ప్రెషన్ ఇచ్చాం.

● 'జామురాతిరి జాబిలమ్మ...' సాంగ్ ఎక్స్పీరియన్స్ గురించి?

మేం రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు చేసే టైమ్లో రాము 'క్షణ క్షణం' సినిమాతో రావడం, అందులో నన్ను, శ్రీదేవిని కొత్త స్టైల్లో చూపించడం, అదొక కల్ట్ సినిమా అవ్వడం.. టోటల్గా బ్యూటిఫుల్ ఎక్స్పీరియన్స్. 'జాము రాతిరి...' సాంగ్ అంతా ఇద్దరం కూర్చుని, ఎక్స్ప్రెషన్స్తో చేశాం. నాకు తెలిసి ఇప్పటికీ ఏ హీరో హీరోయిన్ కంప్లీట్ సాంగ్ అంతా అలా కూర్చుని చేయలేదు. అది మాకు చాలెంజింగ్గా అనిపించింది. శ్రీదేవి ఎక్స్ప్రెషన్స్ గమనిస్తూ నేను, నా ఎక్స్ప్రెషన్స్ అబ్జర్వ్ చేస్తూ తనూ... అలా ఎంజాయ్ చేస్తూ చేశాం. ఆ సాంగ్లో ఓ బ్యూటిఫుల్ కెమిస్ట్రీ కనిపిస్తుంటుంది. ఆ జనరేషన్ ఈ జనరేషన్.. నెక్ట్స్ జనరేషన్... ఎవ్వరికైనా ఈ సాంగ్ ఓ క్లాసిక్.

● మీ సురేష్ ప్రొడక్షన్స్ బేనర్తో శ్రీదేవిగారికి మంచి అనుబంధం ఉంది..

అవును. నేను యాక్టర్ అవ్వకముందే శ్రీదేవి మా బ్యానర్లో 'ముందడుగు, తోఫా' వంటి సినిమాలు చేశారు. మా డాడీ ఫేవరెట్ ఆర్టిస్ట్. తను చూపించే ప్రొఫెషనలిజం, క్యారెక్టర్స్ విషయాల్లో చూపించే ఇంట్రెస్ట్, దర్శక–నిర్మాతల పట్ల గౌరవం... ఇవన్నీ శ్రీదేవి అంత పెద్ద స్టార్ అవ్వడానికి హెల్ప్ చేశాయి. యాక్టర్ కావాలనుకునే ప్రతి ఒక్కరికి శ్రీదేవి జర్నీ చాలా ఇన్స్పైరింగ్గా ఉంటుంది. తనతో వర్క్ చేసినందుకు చాలా హ్యాపీగా ఉంది. అప్పుడే మనందరినీ వదిలిపెట్టి వెళ్లిపోవడం బాధగా ఉంది.

● శ్రీదేవిగారి మరణ వార్త వినగానే షాకింగ్గా ఉండి ఉంటుంది..

చాలా. వెంటనే ముంబై వెళ్లాలనిపించింది. బోనీ కపూర్, అనిల్ కపూర్ నాకు, మా అన్నయ్య సురేష్కు క్లోజ్. అందుకే అక్కడ మేం ఉండాలి, వాళ్లకు మా సపోర్ట్ ఉండాలనిపించింది. అక్కడే ఉండిపోయాను. మేమే కాదు ఇండస్ట్రీ అంతా శ్రీదేవి కోసం వచ్చింది. మంచి ఫేర్వెల్ ఇచ్చారు. శ్రీదేవి డిజర్వ్ దట్ రెస్పెక్ట్.


● శ్రీదేవిలాంటి ఆర్టిస్ట్ భవిష్యత్లో రారని చాలామంది అంటున్నారు..

యస్.. శ్రీదేవిలా అంటే కష్టమే. ఫిల్మ్ ఇండస్ట్రీకు, అభిమానులకు మర్చిపోలేనన్ని జ్ఞాపకాల్ని వదిలి వెళ్లారు శ్రీదేవి. ఇప్పుడు తను లేదని బాధపడటం కంటే తన జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుందాం. తనలాంటి అద్భుతమైన యాక్టర్ను భూమ్మీదకు పంపినందుకు ఆ దేవుడికి మనందరం థ్యాంక్స్ చెప్పుకోవాలి.

దిల్ ఉంటే గుంపుగా రండి రా!


● రజనీకాంత్

ఒక్కసారి చెబితే వంద సార్లు చెప్పినట్టు... దాదాపు 20 ఏళ్ల క్రితం 'బాషా'లో రజనీకాంత్ చెప్పిన డైలాగ్ ఇది. ఆ తర్వాత ఇలాంటి పంచ్ డైలాగులు బోలెడన్ని చెప్పారు. వాటిలో 'శివాజీ'లో చెప్పిన 'నాన్నా.. సింహం సింగిల్గా వస్తుంది. పందులే గుంపుగా వస్తాయి' అనే డైలాగ్ ఒకటి. ఇప్పుడు రజనీ 'గుంపుగా రండి రా' అంటున్నారు. ఇలా పిలుస్తున్నది 'కాలా' గెటప్లో. 'కబాలి' ఫేమ్ రంజిత్. పా దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా వండర్ బార్ ఫిలింస్ పతాకంపై దర్శక–నటుడు, రజనీ అల్లుడు ధనుష్ నిర్మించిన చిత్రం 'కాలా'. తమిళ్, తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న 'కాలా' టీజర్ను శుక్రవారం విడుదల చేశారు. 'కాలా అంటే.. ఎవరు? కాలుడు. కరికాలుడు. గొడవపడైనా సరే కాపాడేవాడు...', 'క్యారె.. సెట్టింగా? వీరయ్య బిడ్డను రా ఒక్కడినే ఉన్నా.. దిల్ ఉంటే గుంపుగా రండిరా!' అని టీజర్లో రజనీకాంత్ పలికిన డైలాగ్స్ అదిరిపోయేలా ఉన్నాయంటున్నారు అభిమానులు. 'కాలా' చిత్రాన్ని ఏప్రిల్ 27న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. రజనీకాంత్ నెక్ట్స్ చిత్రం 'పిజ్జా' ఫేమ్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు అనిరుధ్ను సంగీతదర్శకునిగా తీసుకున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.


● రామ్చరణ్

డుంగురు... డుంగురు... డుంగురు

.... అంటూ చిట్టిబాబు రంగస్థలంలో చిందేసాడు. రామ్చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మించిన చిత్రం 'రంగస్థలం'. ఇందులో సమంత కథానాయిక. దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఈ సినిమాలోని రెండో పాట 'రంగా.. రంగా.. రంగస్థలాన. రంగు పూసుకోకున్నా.. ఏసమేసుకోకున్నా ఆటబొమ్మలం అంట.. మనమంత తోలుబొమ్మలం అంట' సాంగ్ను శుక్రవారం రిలీజ్ చేశారు. డుంగురు.. డుంగురు.. డుంగురు అంటూ సందడిగా సాగే ఈ సాంగ్ జాతర బ్యాక్డ్రాప్లో వస్తుందట. ఫస్ట్ రిలీజ్ చేసిన 'ఎంత సక్కగున్నవే' పాటను అతిలోకసుందరి శ్రీదేవికి అంకితమిచ్చినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో చిట్టిబాబు, రామలక్ష్మి పాత్రల్లో రామ్చరణ్, సమంత నటించారు. ఈ నెల 30న సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

శ్రీదేవి ఎన్ తంగచ్చి!


● కమల్హాసన్

'శ్రీదేవి ఎన్ తంగచ్చి' అనే షాకింగ్ కామెంట్ చేశారు కమల్హాసన్. అర్థం కావడం లేదా? 'శ్రీదేవి నా సోదరి' అంటున్నారు కమల్. సిల్వర్ స్క్రీన్ పై సూపర్ హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న కమల్హాసన్–శ్రీదేవి ఆఫ్ స్క్రీన్లో అన్నాచెల్లెలిలా మెలిగేవారట. శ్రీదేవి మరణించిన తర్వాత పలువురు సినీ ప్రముఖులు ఆమెతో వాళ్లకున్న అనుబంధం గురించి షేర్ చేసుకుంటున్నారు. శ్రీదేవితో 27 సినిమాలు చేసిన కమల్హాసన్ కూడా పలు ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. ఓ తమిళ పత్రికతో ఆయన మాట్లాడుతూ– ''ఆ రోజుల్లో పెళ్లిళ్లలో జంటను చూసి అచ్చం 'కమల్హాసన్–శ్రీదేవి'లా ఉన్నారు కదా అనుకునేవారు. సినిమాలో మేం ఇద్దరం డ్యూయెట్లు పాడుతూ, డ్యాన్సులు చేస్తూ కనిపించడంతో అలా అనుకొని ఉండుంటారు. వాళ్ల కలల్ని కూల్చేయటం ఎందుకు? అని మా ఇద్దరి మధ్య ఉన్న రిలేషన్షిప్ను ఎప్పుడూ బయటపెట్టలేదు. సినిమాలో దేవుడు–దేవత పాత్రలు పోషించేవాళ్లు.. వాళ్లకు జోడీగా నటించే ఆర్టిస్ట్ను అన్నయ్య అనో చెల్లెమ్మ అనో పిలిచేవారు. నేను, శ్రీదేవి కూడా అన్నాచెల్లెలమే. సునిశితంగా గమనిస్తే.. ఆన్ స్క్రీన్ మేం అన్నాచెల్లెలు లాగా కనిపిస్తాం. మా కాంబినేషన్ ఎంత హిట్టైందంటే మమ్మల్ని సంప్రదించకుండానే ఈ స్టోరీలో వీళ్లిద్దరూ యాక్ట్ చేసేస్తారులే అనుకునేవారు దర్శక–నిర్మాతలు. ఇలా వరుసగా సినిమాలు చేసేసరికి 'మళ్లీ శ్రీదేవేనా?' అనుకునేవాణ్ణి. ఏదో అలా అనుకున్నాను కానీ 'శ్రీదేవితో యాక్ట్ చేయాలని ప్రతి నటుడు కోరుకునేవాడు'' అని పేర్కొన్నారు కమల్హాసన్.

అర్జున్రెడ్డికి మించి...

షఫీ, లక్కీ ఏకరీ, సాయికిరణ్, పూజశ్రీ, మేఘన, జ్యోతికయాదవ్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'నందికొండ వాగుల్లోన'. సత్యనారాయణ ఏకరీని దర్శకుడిగా పరిచయం చేస్తూ రఘు.హెచ్ ఈ చిత్రం నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ని, నవనీత్ స్వరపరచిన పాటలను హైదరాబాద్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సమర్పకులు సాయి వెంకట్, షిరాజ్ మాట్లాడుతూ– ''వినోదాత్మకంగా తెరకెక్కిన చిత్రమిది. 'అర్జున్రెడ్డి' సినిమాలో కంటే ఎక్కువ కంటెంట్ ఉంటుంది. ముఖ్యంగా బి, సి సెంటర్స్లో బాగా ఆడుతుందని నమ్ముతున్నాం. మార్చి 2న సినిమాను విడుదల చేయాలనుకున్నాం. కానీ, థియేటర్ల బంద్ కారణంగా రిలీజ్ చేయడం లేదు. మంచి డేట్ చూసుకొని విడుదల చేస్తాం'' అన్నారు. ''ఎ సర్టిఫికెట్ వచ్చిన సినిమానా? అనుకోకండి. ఎక్కువ ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. తప్పకుండా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు సత్యనారాయణ. ''మా సినిమా రిలీజ్ చేయడానికి ముందుకొచ్చిన సాయివెంకట్, ఆర్.కె. గౌడ్గార్లకు ధన్యవాదాలు'' అని నిర్మాత రఘు అన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, ఆర్.కె. గౌడ్ పాల్గొన్నారు.


● పూజశ్రీ, లక్కీ

మహేశ్ సినిమాతో ఎంట్రీ షురూ


● మోహనన్

ఒక్కొక్కరుగా టీమ్లో యాడ్ అవుతున్నారు. ఎవరి టీమ్లో అంటే.. మహేశ్బాబు టీమ్లో. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్బాబు హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్ పతాకాలపై 'దిల్' రాజు, అశ్వనీదత్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఆల్రెడీ మ్యూజిక్ సిట్టింగ్స్, లొకేషన్స్ హంట్ కంప్లీట్ చేసిన చిత్రబృందం ఇప్పుడు నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపికపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. రీసెంట్గా కథానాయికగా పూజా హెగ్డేను ఎంపిక చేసిన చిత్రబృందం, ఇప్పుడు లేటెస్ట్గా బాలీవుడ్ కెమెరామేన్ కేయు మోహనన్ను టీమ్లోకి తీసుకున్నట్లు అధికారికంగా అనౌన్స్ చేసింది. 'డాన్, తలాష్, రాయీస్' వంటి హిందీ చిత్రాలకు కెమెరామేన్గా వర్క్ చేశారు మోహనన్. తెలుగు సినిమాకి ఆయన వర్క్ చేయడం ఇదే ఫస్ట్ టైమ్. ఈ సినిమా రెగ్యులర్ షూట్ను ఏప్రిల్లో స్టార్ట్ చేయనున్నారని సమాచారం.

పార్టీకి టైమ్ అయ్యింది


● నిఖిల్, సిమ్రాన్

పార్టీకి డేట్ ఫిక్సైంది. ఆ పార్టీ ఏ రేంజ్లో ఉంటుందో తెలుసుకోవాలంటే మాత్రం థియేటర్కు వెళ్లాల్సిందే. నిఖిల్ హీరోగా ఏకే ఎంటర్టైన్మెంట్స్, ఏటీవీ బ్యానర్స్పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన చిత్రం 'కిర్రాక్పార్టీ'. శరన్ కొప్పిశెట్టి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్ సహ నిర్మాతలు. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ కథానాయికలు. కన్నడ హిట్ 'కిర్రిక్ పార్టీ'కి ఇది రీమేక్.

ఈ సినిమాను ఈ నెల 16న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ''నిఖిల్ స్టైలిష్ మ్యాచో లుక్స్ చిత్రంపై అంచనాలను మరింత పెంచాయి. కాలేజీ క్యాంపస్ బ్యాక్డ్రాప్లో రూపొందిన ఈ చిత్రం 'హ్యాపీడేస్' తరహాలో నిఖిల్కు మరో విజయం అందిస్తుంది. ఆల్రెడీ టీజర్, సాంగ్స్కు విశేష స్పందన లభిస్తోంది. ఈ చిత్రానికి దర్శకులు సుధీర్ వర్మ స్క్రీన్ప్లే అందించగా, దర్శకుడు చందూ మొండేటి మాటలు సమకూర్చారు'' అని నిర్మాత తెలిపారు. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్నాథ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిశోర్ గరికిపాటి.

దరఖాస్తు చేశారా?

1. ఇండియన్ బ్యాంక్‌లో 21 స్పోర్ట్స్ కోటా పోస్టులకు చివరి తేదీ: మార్చి 3. వెబ్‌సైట్: www.indianbank.in
2. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్(సీజీహెచ్ఎస్)లో 128 పోస్టులకు చివరి తేదీ: మార్చి 3. వెబ్‌సైట్: http://cghs.gov.in
3. నేవీలో 19 ఎస్సెస్సీ ఆఫీసర్ పోస్టులకు చివరి తేదీ: మార్చి 4. వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in
4. ఇస్రోలో 28 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులకు చివరి తేదీ: మార్చి 5. వెబ్‌సైట్: www.isro.gov.in
5. ఐఐటీ పాట్నాలో 16 పోస్టులకు చివరి తేదీ: మార్చి 5. వెబ్‌సైట్: www.iitp.ac.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్‌లో 23 ఖాళీలు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) విభాగాల్లో 23 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

- పోస్టు: డిప్యూటీ ఇంజనీర్(డీఈ).
- విభాగాల వారీ ఖాళీలు: కంప్యూటర్ సైన్స్-18, ఎలక్ట్రానిక్స్-5.
- వేతనశ్రేణి: రూ.40,000-రూ.1,40,000.
- అర్హతలు: సంబంధిత విభాగాలను బట్టి బీఈ/బీటెక్/ఏఎంఐఈ/బీఎస్సీ ఇంజనీరింగ్ ప్రథమ శ్రేణి(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-పాస్ క్లాస్) మార్కులతో ఉత్తీర్ణత. అలాగే సంబంధిత రంగంలో కనీసం ఏడాది అనుభవం.
- వయసు: 2018, ఫిబ్రవరి 1 నాటికి 26 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- దరఖాస్తు రుసుం: రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: మార్చి 14, 2018.
- వెబ్‌సైట్: www.bel-india.com

మిధానిలో 40 ఖాళీలు

హైదరాబాద్‌లోని కంచన్‌భాగ్ పరిధిలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని).. 40 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: ట్రేడ్ అప్రెంటీస్.
- శిక్షణ వ్యవధి: ఏడాది.
- విభాగాల వారీ ఖాళీలు: ఫిట్టర్-15, ఎలక్ట్రీషియన్-10, మెషినిస్ట్-5, టర్నర్-5, వెల్డర్-5.
- అర్హతలు: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ.
- ఎంపిక: మార్కుల మెరిట్(ఐటీఐ).
- దరఖాస్తు విధానం: అభ్యర్థులు www.apprenticeship.gov.in లేదా www.ncvtmis.gov.in వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకొని, మిధాని ఐడీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- చివరి తేదీ: మార్చి 10, 2018.
- వెబ్‌సైట్: www.midhani.com

ఎయిర్‌లైన్ అల్లైడ్ సర్వీసెస్ లిమిటెడ్‌లో 35 ఖాళీలు

ఎయిర్‌లైన్ అల్లైడ్ సర్వీసెస్ లిమిటెడ్(ఏఏఎస్ఎల్)... 35 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు-ఖాళీలు: డిప్యూటీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్(డీసీఎఫ్‌వో)-1; చీఫ్ ఆఫ్ ఐటీ-1; సింథటిక్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్(ఎస్ఎఫ్ఐ)-2; ట్రైనీ క్యాబిన్ క్ర్యూ-16; స్టేషన్ మేనేజర్-14; ఇన్‌స్ట్రక్టర్(టెక్నికల్)-1.
- వేతనం: డీసీఎఫ్‌వో-రూ.1,00,000; చీఫ్ ఆఫ్ ఐటీ-రూ.80,000; స్టేషన్ మేనేజర్-42,000; ఇన్‌స్ట్రక్టర్(టెక్నికల్)-53,000; ఎస్ఎఫ్ఐ-రూ.4,000(గంటకు);
- అర్హతలు: సంబంధిత పోస్టులను అనుసరించి సీఏ(ఐసీఏఐ)/బీఈ/బీటెక్/ఎంసీఏ/గ్రాడ్యుయేషన్/డీజీసీఏ గ్రౌండ్ ఇన్‌స్ట్రక్టర్స్. అలాగే నిబంధనల మేర అనుభవం ఉండాలి. ఎస్ఎఫ్ఐ పోస్టులకు డీజీసీఏ నిబంధనల మేరకు అర్హతలుండాలి.
- వయసు: 2018, మార్చి 1 నాటికి డీసీఎఫ్‌వో, చీఫ్ ఆఫ్ ఐటీ-45 ఏళ్లు; స్టేషన్ మేనేజర్-40ఏళ్లు; ఇన్‌స్ట్రక్టర్(టెక్నికల్)కు 50 ఏళ్లు; ఎస్ఎఫ్ఐకి 70 ఏళ్లు మించకూడదు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: మార్చి 23, 2018.
- వెబ్‌సైట్: www.airindia.in

బోస్ ఇన్‌స్టిట్యూట్‌లో 9 ఖాళీలు

కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్.. 9 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోనిది.

- పోస్టు: రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ).
- అసోసియేట్‌షిప్: రూ.36,000+హెచ్ఆర్ఏ.
- విభాగాలు: ప్లాంట్ ఫంక్షనల్ బయాలజీ ఆఫ్ స్ట్రెస్ రెస్పాన్సెస్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ అండ్ ఎక్స్‌ప్లోరింగ్ ప్లాంట్ జెనెటిక్స్ రీసోర్సెస్, స్ట్రక్చరల్ స్టడీస్ అండ్ బయోఫిజికల్ ప్రాబ్లమ్స్, కంప్యూటేషనల్ బయాలజీ, మాలిక్యులార్ మెడిసిన్, బేసిక్ అండ్ అప్లైడ్ మైక్రోబయాలజీ, బేసిక్ అండ్ అప్లైడ్ ప్రాబ్లమ్స్ ఇన్ ఫిజికల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్.
- అర్హతలు: పీహెచ్‌డీ(లైఫ్ సైన్సెస్/ఫిజికల్ సైన్సెస్). అలాగే నిబంధనల మేర సంబంధిత రంగంలో అనుభవం.
- వయసు: 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి15, 2018.
- హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ: మార్చి 22, 2018.
- వెబ్‌సైట్: www.jcbose.ac.in

హయ్యర్ ఎడ్యుకేషన్



అవకాశాలకు వేదిక.. ఐఐఎస్‌సీ

2018-19 నోటిఫికేషన్ విడుదల

దేశంలో సైన్స్ ఎడ్యుకేషన్ అంటే టక్కున గుర్తొచ్చే విద్యాసంస్థ... బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ). అంతర్జాతీయంగా యూనివర్సిటీలకు ర్యాంకులు ఇచ్చే క్యూఎస్, టైమ్స్, ఏఆర్‌డబ్ల్యూయూ తదితర సంస్థల ర్యాంకుల జాబితాలో ప్రతిఏటా తప్పనిసరిగా స్థానం పొందే సంస్థ ఇది. దీనికి ప్రధాన కారణం.. బోధన, పరిశోధన పరంగా ఇన్‌స్టిట్యూట్‌లో పాటిస్తున్న ప్రమాణాలే. ఇక్కడ కోర్సులు పూర్తి చేస్తే.. భవిష్యత్తు బంగారమవుతుందనే అభిప్రాయముంది. 2018-19 విద్యా సంవత్సరానికి.. యూజీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఐఐఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పూర్తి వివరాలు...

ప్రయోజనాలు




- ఐఐఎస్‌సీలో ఏ కోర్సులో ప్రవేశం లభించినా.. ఉజ్వల భవిష్యత్తు సొంతమవడం ఖాయం. ఇటీవల కాలంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ గణాంకాలే ఇందుకు నిదర్శనం. బ్యాచిలర్, పీజీ ప్రోగ్రామ్‌ల అభ్యర్థులకు ఆర్ అండ్ డీ సంస్థలు, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు, ఫార్మసీ సంస్థల్లో సగటున రూ.15లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభిస్తున్నాయి.
- పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి డీఆర్‌డీఓ, డీబీటీ తదితర పరిశోధన సంస్థల్లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్స్, సీఎస్ఐఆర్ లేబొరేటరీల్లో సైంటిస్ట్ హోదాలో ఉద్యోగాలు లభిస్తున్నాయి.
- ఐఐఎస్సీలో ప్రవేశం పొందిన విద్యార్థులు సమంజసమైన ట్యూషన్ ఫీజుతోపాటు అత్యాధునిక ల్యాబ్స్, తక్కువ ధరకే భోజనం, వసతి వంటి ఇతర సౌకర్యాలు కూడా అందిపుచ్చుకోవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఎంపికైన అభ్యర్థులకు ఎంహెచ్ఆర్‌డీ, సీఎస్ఐఆర్, యూజీసీ, ఐసీఎంఆర్, డీబీటీ, ఏఐసీటీఈ, డీఏఈ సంస్థలు అందించే స్కాలర్‌షిప్ లభిస్తుంది.

యూజీ ప్రోగ్రామ్స్

ఐఐఎస్‌సీ అందించే యూజీ కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(రీసెర్చ్). ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. కోర్ సైన్స్, ఇంటర్ డిసిప్లినరీ అంశాలు ఇందులో భాగంగా బోధిస్తారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ప్రోగ్రామ్‌ను పూర్తిచేస్తే.. ఇండస్ట్రీలో, ఉన్నత విద్యపరంగా ఆకర్షణీయ అవకాశాలు అందుకోవచ్చు. నాలుగేళ్లు పూర్తి చేసిన తర్వాత అభ్యర్థులకు ఆసక్తి ఉంటే మరో ఏడాది అక్కడే చదివి(ఎంఎస్) మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టా అందుకునే అవకాశాన్ని ఐఐఎస్‌సీ కల్పిస్తోంది. నాలుగేళ్ల బీఎస్ కోర్సుల్లో భాగంగా సైన్స్ సబ్జెక్టులు స్పెషలైజేషన్‌లుగా చదవడంతోపాటు ఇంజనీరింగ్, సోషల్ సైన్సెస్ అంశాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. మొదటి మూడు సెమిస్టర్‌లలో విద్యార్థులంతా తప్పనిసరిగా... ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అంశాలు చదవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 4వ, 5వ, 6వ సెమిస్టర్‌లలో విద్యార్థులు తమకు నచ్చిన స్పెషలైజేషన్లు(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ, మెటీరియల్స్ అండ్ ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) ఎంపిక చేసుకోవచ్చు. 7వ, 8వ సెమిస్టర్స్‌లో ఫ్యాకల్టీ పర్యవేక్షణలో రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రాజెక్టు వర్క్ ఉంటుంది.

అర్హత



- 12వ తరగతి/ఇంటర్‌ను 2017లో పూర్తిచేసిన; 2018లో పూర్తిచేసుకోనున్న విద్యార్థులు యూజీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.
- ఇంటర్/12వ తరగతిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా చదివుండాలి.
- 12వ తరగతి/ఇంటర్‌లో కనీసం 60శాతం మార్కులు సాధించి ఉండాలి.

ఎంపిక విధానం

- కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై)-ఎస్ఏ స్ట్రీమ్-2016లో ఉత్తీర్ణత సాధించి, ఫెలోషిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు.
- కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై)-ఎస్‌బీ స్ట్రీమ్-2017లో ఉత్తీర్ణత సాధించి, ఫెలోషిప్‌నకు ఎంపికైన వారు.
- కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై)-ఎస్ఎక్స్‌కు 2017లో హాజరై, ఫెలోషిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు.
- కేవీపీవై-ఎస్ఏ, ఎస్ఎక్స్‌కు ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్ ద్వారా ఎంపికైన ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు.
- ఐఐటీ జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు 2018లో హాజరవుతున్న అభ్యర్థులు. అయితే ఈ విధానంలో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు.. జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌లలో జనరల్ అభ్యర్థులు తప్పనిసరిగా 60శాతం మార్కులు సాధించాలి. ఓబీసీ అభ్యర్థులు 54శాతం; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు 30 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. నీట్ యూజీ 2018కు హాజరుకానున్న అభ్యర్థులు, కనీసం 60 శాతం(జనరల్), 54 శాతం (ఓబీసీ), 30 శాతం (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ).

దరఖాస్తు విధానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఏప్రిల్ 30, 2018 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- దరఖాస్తు ఫీజు జనరల్/ఓబీసీ/కెఎమ్ (కాశ్మీరీ మైగ్రెంట్) అభ్యర్థులకు రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.250
- వివరాలకు వెబ్‌సైట్: http://www.iisc.ac.in/ug/

పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌తోపాటు పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు కూడా ఐఐఎస్‌సీ ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రోగ్రామ్‌ల వివరాలు...

1. రీసెర్చ్ ప్రోగ్రామ్స్(పీహెచ్‌డీ/ఎంటెక్(రీసెర్చ్).
2. కోర్స్ ప్రోగ్రామ్స్(ఎంటెక్/మాస్టర్ ఆఫ్ డిజైన్/మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్.
3. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.
4. పీహెచ్‌డీ-ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్స్(ఈఆర్‌పీ).

అర్హతలు

- బీటెక్ ఉత్తీర్ణత లేదా సైన్స్/ఎకనామిక్స్/జాగ్రఫీ/సోషల్ వర్క్/సైకాలజీ/మేనేజ్‌మెంట్/కామర్స్/ఆపరేషన్స్ రీసెర్చ్/కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్ స్పెషలైజేషన్లతో పీజీ.
- గేట్ స్కోర్ లేదా నెట్ జేఆర్ఎఫ్ ఉత్తీర్ణత.
- వీటితోపాటు ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/అగ్రికల్చర్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు; బీఈ/బీటెక్ తర్వాత ఎంఎస్/ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరి విషయంలోనూ గేట్, నెట్-జేఆర్ఎఫ్ వారికి కొంత ప్రాధాన్యం ఉంటుంది.
- గేట్ స్కోర్ గుర్తింపు పరంగా.. 2016/ 2017/ 2018 సంవత్సరాల్లో గేట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ

ఎంటెక్‌లో పేర్కొన్న కొన్ని స్పెషలైజేషన్ల (క్లైమేట్ సైన్స్, కంప్యుటేషనల్ డేటాసైన్స్, ఎర్త్ సైన్స్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)కు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూను ఐఐఎస్‌సీ నిర్వహిస్తుంది.

మాస్టర్ ఆఫ్ డిజైన్

ఐఐఎస్‌సీ అందిస్తున్న మరో మాస్టర్స్ కోర్సు.. మాస్టర్ ఆఫ్ డిజైన్. ఇంజనీరింగ్/టెక్నాలజీ/డిజైన్/ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణతతోపాటు గేట్ 2016/2017/2018 స్కోర్/సీడ్ 2018 స్కోర్ పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఆ తర్వాత చివరగా ఇంటర్వ్యూ ఉంటుంది.

మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్

సైన్స్ ఎడ్యుకేషన్‌కు పేరు గడించిన ఐఐఎస్‌సీ వినూత్నంగా మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కోర్సును కూడా అందిస్తోంది. బీటెక్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి గేట్ (2016/2017/2018) స్కోర్లు ఉన్న అభ్యర్థులు/క్యాట్-2017 ఉత్తీర్ణులు, జీమ్యాట్ స్కోర్ పొందిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. ఈ స్కోర్ల ఆధారంగా దరఖాస్తులను షార్ట్ లిస్ట్ చేసి తదుపరి దశలో గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తుంది.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

ఐఐఎస్‌సీ ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ అందిస్తోంది. ప్రస్తుతం బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్ విభాగాల్లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉన్నాయి. బీఎస్‌సీ (ఎంపీసీ, బీజెడ్‌సీ) లేదా బీఫార్మసీ, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతతోపాటు.. జామ్-2018లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులు.

- జెస్ట్-2018 అభ్యర్థులు ఫిజికల్ సైన్సెస్ కోర్సుకు అర్హులు.
- బీఈ/బీటెక్ పూర్తి చేసి.. జామ్-2018లో మ్యాథమెటిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్ పేపర్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మ్యాథమెటికల్ సైన్సెస్‌కు; బయోటెక్నాలజీ పేపర్‌లో ఉత్తీర్ణులు బయలాజికల్ సైన్స్ విభాగాలకు అర్హులు.
- కెమికల్ సైన్సెస్ స్పెషలైజేషన్ ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు మాత్రం జామ్ స్కోర్‌తోపాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు.

పీహెచ్‌డీ-ఈఆర్‌పీ

ఆర్‌అండ్‌డీ సంస్థలు/ఇండస్ట్రీస్‌తోపాటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మాస్యుటికల్, వెటర్నరీ, మెడికల్ కళాశాలలు/యూనివర్సిటీల్లోని అధ్యాపకుల కోసం పీహెచ్‌డీ-ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్స్(ఈఆర్‌పీ)ను ప్రత్యేకంగా ఐఐఎస్‌సీ రూపొందించింది. ఔత్సాహిక అభ్యర్థులు, రెగ్యులర్ కోర్సుల వారికి అవసరమైన అర్హతలతోపాటు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/గేట్/ఎన్‌బీ హెచ్ఎంలలో ఏదో ఒక పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: ఫిబ్రవరి 1, 2018 నుంచి మార్చి 26, 2018 వరకు.
- దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ రూ.800, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.400; అన్ని కేటగిరీల ఈఆర్‌పీ అభ్యర్థులకు ఫీజు రూ.2000; డీఆర్‌డీవో, బార్క్, ఇస్రో, ఎన్ఏఎల్, ఎన్‌టీఆర్‌వో, కెఎస్ఆర్‌టీసీ, బీఎంటీసీ, బీడీఏ, పీడబ్ల్యూడీ, సీపీఆర్ఐ స్పాన్సర్డ్ అభ్యర్థులకు ఫీజు రూ.800.

-వివరాలకు వెబ్‌సైట్: http://www.iisc.ac.in/admission

Current Affairs

India, Canada signed six agreements

INTERNATIONAL

H1-B Visa Approval Tougher

In the US, Trump administration has announced a new policy that makes very tough the procedure of issuing H-1B visas to those to be employed at one or more third-party worksites. The new policy announced on 22nd February, empowers the US Citizenship and Immigration Services to issue H-1B visas to an employee only for the period for which he/she has worked at a third-party worksite. Under the new policy, the company would have to go an extra length to prove that its H-1B employee at a third-party worksite has specific and non-qualifying speculative assignments in specialty occupation. As such the issuing of H-1B visas could be of less than three years. This would reverse the tradition of issuing the H-1B visas for three years at a time.

China elected as Vice President of FATF

China became the Vice President of the Financial Action Task Force (FATF). FATF had in its plenary session on 23 February decided to put Pakistan back on the "grey list", subjecting it to direct monitoring and intense scrutiny by the International Co-operation Review Group (ICRG) on terror financing, pending a further review in June. Financial Action Task Force on Money Laundering was formed in 1989 during G7 Summit in Paris in order to tackle the problem of money laundering.

NATIONAL

AIR, NBT sign MoU to preserve, promote cultural heritage

All India Radio and National Book Trust (NBT), on 27th February signed a MoU to preserve and promote cultural heritage and folk songs sung on various occasion across the country. Several traditional and folk songs have been recorded under the Akashvani Lok Sampada Sanrakshan Mahapariyojana. NBT, All India Radio will provide information to people about the rich heritage of folk songs preserved by it. The NBT will publish the Sanskar and folk songs.



Cabinet approves the Trafficking of Persons Bill

The Union Cabinet chaired by Prime Minister Narendra Modi has approved the Trafficking of Persons (Prevention, Protection and Rehabilitation) Bill, 2018 for introduction in the Parliament.

BILATERAL

India, Canada signed six agreements

India and Canada entered into six agreements on 23rd February. The Memorandum of Agreements are Cooperation in Sports, Cooperation in Higher Education, Cooperation on Intellectual Property Rights, Terms of Reference for the India-Canada Ministerial Energy Dialogue, Cooperation in the Fields of Science, Technology and Innovation, Joint declaration of Intent on Cooperation in the Field of Information Communications Technology and Electronics.

India, Germany sign pact for smart city cooperation

India on 23rd February signed a MoU with Germany to develop modules for providing urban basic services and housing for smart cities. Technical cooperation measure will support approaches for sustainable urban development in the area of integrated planning, provision of affordable housing and basic services with particular focus on water, waste water and solid waste management and mobility.

India, Jordan sign 12 agreements

India and Jordan have inked 12 agreements in areas including Defence, Health and Cultural Exchange Programme. The other MoUs include cooperation between Prasar Bharati and Jordan TV Cooperation and Indian Institute of Mass Communication and Jordan Media Institute (JMI). The pacts were inked after delegation-level talks between Prime Minister Narendra Modi and King of Jordan Abdullah II Bin Al Hussein in New Delhi on 1st March.

ECONOMY

RBI launches Ombudsman Scheme for NBFC

The Reserve Bank of India on 23rd February has launched Ombudsman Scheme for non-banking financial companies (NBFCs) for redressal of complaints against them. Any customer or person can file a compliant with the ombudsman on various grounds like non-payment or inordinate delay in payment of interest, non-repayment of deposits, lack of transparency in loan agreement, non-compliance with RBI directives on fair practices code for NBFCs, levying of charges without sufficient notice to the customers and failure or delay in returning the securities documents despite repayment of dues among others. The offices of the NBFC ombudsman will function at four metro centres - New Delhi, Mumbai, Kolkata and Chennai.

Cabinet approves Fugitive Economic Offenders Bill 2018

The Union Cabinet approves Fugitive Economic Offenders Bill 2018. It empowers government to seize all properties of the fugitive offender within the country. The bill has specific provision that will pave the way for declaring an economic offender a fugitive. It has provisions for attachment of the properties of the fugitive economic offender resulting from proceeds of crime; not only it has provision for confiscation of other property belonging to such offender in India and abroad, including benami property. The bill provides for Disentitlement of the fugitive economic offender from defending any civil claim. An Administrator will be appointed to manage and dispose of the confiscated property under the Act.

SCIENCE AND TECHNOLOGY

'Dhanush' ballistic missile successfully test-fired

India on 23rd February successfully test-fired the nuclear-capable 'Dhanush' ballistic missile with a strike range of 350 kms from a naval ship off Odisha coast. Dhanush' missile is capable of carrying a payload of 500 kg and hitting both land and sea-based targets. Its trial was carried out by the Strategic Force Command (SFC) of the defence forces.

SPORTS

India clinch 11 medals at Strandja MBT

In the 69th Strandja Memorial Boxing Tournament in Bulgaria, India had won 11 medals - five from men and six from women boxers. Overall, the contingent clinched two gold, three silver and six bronze medals. Vikas Krishan, who claimed a gold medal in 75 kg category, was also adjudged the best boxer of the event, a first for an Indian.

PERSONS IN NEWS



Sridevi: Veteran Actress Sridevi passed away on 24th February. She starred in more than 150 films. In 2013, the Indian government awarded her the Padma Shri, the fourth highest civilian honour.



Shankaracharya: Kanchi Shankaracharya Jayendra Saraswathi, the 69th pontiff of the Kanchi Mutt, passed away on 28th February in Kanchipuram, Tamil Nadu. He became the younger pontiff on March 22, 1954 and became elder pontiff in 1994. Jayendra wanted to solve the Ayodhya issue in a peaceful manner.



Rajendra Sharma
Current Affairs Faculty,
Hyderabad.

కన్నీటి గోస

వేసవి ఆరంభంలోనే రాష్ట్రవ్యాప్తంగా నీటి ఎద్దడి • అడుగంటిన భూగర్భ జలాలు

పనిచేయని మంచినీటి పథకాలు • చాలా చోట్ల వ్యవసాయ బావులు, బోర్లే దిక్కు

కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న జనం • ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టని సర్కారు

• 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి





వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట హవేళి గ్రామంలో ప్రభుత్వ బావికి మోటార్లు బిగించుకున్న గ్రామస్తులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో వేసవికి ముందే నీటి కష్టాలు మొదలయ్యాయి. మార్చి తొలివారంలోనే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. చాలా చోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి.. బోర్లు, బావులు ఎండిపోయాయి. నీటి కష్టాలపై 'సాక్షి'క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ ఆందోళనకర పరిస్థితులు వెల్లడయ్యాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురం భీం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన తండాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. జనం కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బావుల నుంచి, వాగులు, ఒర్రెల్లో చెలిమెలు తవ్వి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వేసవి మొదలవుతున్నా ప్రభుత్వం 'వాటర్ యాక్షన్ ప్లాన్'ను సిద్ధం చేయకపోవడం, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాలు మరమ్మతులతో మూలన పడడంతో మిగతా జిల్లాల్లోనూ తాగునీటి కటకట మొదలైంది. తాగునీటి కోసం పలు గ్రామాల్లో ప్రజలు ఆందోళనలకు కూడా దిగుతున్నారు.

కొనుక్కుంటేనే నీళ్లు

రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల నీటి కష్టాలు మొదలయ్యాయి. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. జనం తాగడానికే కాదు, ఇతర అవసరాలకూ నీళ్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. నిర్మల్ జిల్లాలో గత మేలో 11.25 మీటర్ల లోతులో భూగర్భ జలాలుండగా.. ఈసారి ఫిబ్రవరిలోనే 11.85 మీటర్ల లోతుకు పడిపోయాయి. కుమురం భీం జిల్లాలో డిసెంబర్‌లో సగటున 7.95 మీటర్ల లోతున ఉన్న నీటిమట్టాలు.. జనవరిలోనే 8.35 మీటర్లకు తగ్గిపోయాయి. మంచిర్యాల జిల్లాలో 6,234 బోర్లు ఉండగా.. అందులో ఇప్పటికే 713 పనిచేయడం లేదు. వేమనపల్లి, నెన్నెల, కోటపల్లి, కన్నెపల్లి మండలాల్లో నీటి సమస్య ఏర్పడింది.

పాతాళానికి నీటి మట్టాలు

కామారెడ్డి జిల్లాలో జనవరిలో 12.14 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ఫిబ్రవరి నాటికి 13.89 మీటర్ల లోతుకు.. అంటే ఒక్క నెలలోనే 1.75 మీటర్ల లోతుకు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో 38.21 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గిరిజన తండాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. రంగారెడ్డి జిల్లాలోనూ భూగర్భజలాలు భారీగా తగ్గిపోయాయి. జిల్లాలో ఏడు పథకాల మరమ్మతులకు ఈ ఏడాది రూ.1.72 కోట్లు కేటాయించినా పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేకపోయారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల పరిధిలోని తండాల్లో జనం నీటి కోసం అవస్థలు పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్, కురుమూర్తి, జడ్చర్లలలో భూగర్భజలాలు ప్రమాదకర స్థాయిలో 31.80 మీటర్లకు పడిపోయాయి. గతేడాది నీటి ఎద్దడి నెలకొనగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. కానీ చాలామంది ట్యాంకర్ల యజమానులకు ఇంకా బిల్లులు చెల్లించకపోవడంతో.. ఈసారి వారు ముందుకొచ్చే పరిస్థితి లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 35.73 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది. 80 శాతం బోర్లు వట్టిపోవడంతో కేఎల్‌ఐ కాల్వ సమీపంలోని ప్రైవేటు బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ఆత్మకూరు(ఎస్), తిప్పర్తి, మోటకొండూరు, బొమ్మలరామారం, యాదగిరిగుట్ట ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తింది.

అడుగంటిన బోర్లు..



జనగామ జిల్లా వడ్లకొండలో ఆరు వేల జనాభాకు 24 బోర్లు ఉన్నాయి. అందులో ఆరు బోర్ల నుంచి నేరుగా, మరో 4 బోర్ల నుంచి ఓవర్ హెడ్ ట్యాంకుకు, మిగతా 14 సింగిల్ ఫేస్ బోర్ల ద్వారా అధికారులు నీటి సరఫరా చేస్తున్నారు. కానీ భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బోర్లు, బావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

జనగామ జిల్లా వడ్లకొండలోని వ్యవసాయ బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

నీటి కోసం తండా తండ్లాట



మెదక్ జిల్లా చిల్పచెడ్ మండలం పానాది తండాలో వేసవికి ముందే నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. నీటి కోసం కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సి వస్తోంది. 300 మంది వరకు జనాభా ఉన్నా ఎలాంటి నీటి పథకాలు లేవు. అధికారులు తమ కష్టాలను పట్టించుకోవడం లేదని తండాకు చెందిన నిర్మల వాపోయారు. ఏటా వ్యవసాయ బావుల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని తెలిపారు.

చందాలతో బావి తవ్వుకున్నారు



కుమురం భీం జిల్లా జైనూర్ మండలం శివనూర్‌లో ఏటా వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదు. దాంతో ఇటీవల గ్రామస్తులంతా కలసి చందాలు వేసుకుని బావిని తవ్వించుకున్నారు. ఇంతా చేసీ ఆ బావిలో నీళ్లు పడలేదు. సమీపంలోని వాగుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు.

రోజు సంపాదన రూ.150.. నీళ్ల ఖర్చు రూ.40



ఈమె పేరు మధునమ్మ. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఎన్టీఆర్ కాలనీ. నలుగురున్న కుటుంబాన్ని పోషించుకోవాల్సిన బాధ్యత ఆమెదే. రోజు కూలీకి వెళితే రూ.150 వస్తాయి. కానీ అందులో రోజుకు రూ.40 కేవలం నీటి కోసమే ఖర్చవుతున్నాయి. కాలనీలోని బోరు ఎండిపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్ల వద్ద నీళ్లు కొనుక్కోక తప్పడం లేదు. ఇంట్లో డ్రమ్ము నీళ్లు సరిపోవని, మరో డ్రమ్ము నీళ్లు కొందామంటే తిండికి తిప్పలవుతుందని ఆమె వాపోయింది.

మూడు నెలల కిందే వట్టిపోయిన బోర్లు

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం భూతాయి(కే) గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజాయిలో 102 కుటుంబాలకు చెందిన 800 మంది జనాభా ఉన్నారు. కానీ ఉన్నది రెండు చేతి పంపులు మాత్రమే. భూగర్భ జలాలు అడుగంటడంతో మూడు నెలల నుంచి చేతి పంపుల్లో నీరు రావడం లేదు. ఈ గ్రామంలో ప్రతి ఇంటి ముందు ఎడ్లబండి, దానిపై నీళ్ల డ్రమ్ము కనిపిస్తాయి. రెండు కిలోమీటర్ల దూరంలోని ఓ వ్యవసాయ బావి నుంచి ఎడ్ల బండ్లపై నీళ్లు తెచ్చుకుంటున్నారు.



ఒర్రె నీరే దిక్కు

కుమురం భీం జిల్లా వాంకిడి మండలం సాలేగూడలో 25 కుటుంబాలకు ఒకే చేతిపంపు ఉంది. అదీ మరమ్మతులతో మూల నపడింది. గ్రామస్తులు చేసేదేమీ లేక సమీపంలోని ఒర్రె నీరు తెచ్చుకుంటున్నా రు. ఎండలు ముదిరితే ఆ నీరూ దొరకదని.. అధికారులు, ప్రజాప్రతినిధు లు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

'ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల' ఫలితాలు ప్రకటించొద్దు

8 వారాల పాటు ఫలితాలు వెల్లడించొద్దన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గతేడాది అక్టోబర్‌లో రాష్ట్ర అటవీశాఖలోని బీట్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల ఫలితాల్ని 8 వారాల పాటు వెల్లడించరాదని ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ యాక్ట్ ప్రకారం 2 శాతం పోస్టుల్ని మాజీ సైనికులకు రిజర్వు చేయాలన్న నిబంధనను ఉల్లంఘించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారన్న కేసులో న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ సైనికోద్యోగి ఆర్.రఘుపతిరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులైన టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి, అటవీ శాఖ కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. అటవీ శాఖలో 1,857 బీట్ ఆఫీసర్ల పోస్టులకు గతేడాదిలో నోటిఫికేషన్ వెలువడిందని, ఇందులో మాజీ సైనికోద్యోగులకు 2 శాతం రిజర్వేషన్లు కల్పించలేదని విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది కె.వెంకటేశ్ గుప్తా వాదించారు. మాజీ సైనికోద్యోగులకు రిజర్వేషన్లు కల్పించేలా ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌ను సవరించాలని కోరారు. దీంతో నోటిఫికేషన్ పరిశీలించిన న్యాయమూర్తి.. పరీక్షల ఫలితాల్ని నిలిపివేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

సీఎం వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి: నల్లు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీని కించపరిచేలా సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఏ మైకంలో ప్రధానిని అవమానించారో సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రానికి పెద్ద మొత్తంలో కేంద్రం నిధులు కేటాయించినా అవి పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడకుండా చేసి ఇప్పుడు కేంద్రాన్ని విమర్శించడం దారుణమన్నారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత ఏ శాఖ విషయంలో ఎంత ఉంటుందో కూడా తెలియని దుస్థితిలో కేసీఆర్ ఉన్నారని విమర్శించారు. వ్యవసాయశాఖ విషయంలో రాష్ట్రానిదే ప్రధాన బాధ్యత అనే విషయం కూడా ఆయనకు తెలియకపోవటం దారుణమన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించకపోవటంతో రావాల్సిన నిధులు ఆగిపోయాయన్నారు.

నేడు టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రగతిభవన్‌లో జరగనుంది. ఈ నెల 5 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో పార్టీ వ్యవహరించాల్సిన తీరు, అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేస్తారు. ఈ సమావేశానికి హాజరు కావాలని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఇప్పటికే ఆహ్వానం పంపారు.

విపత్తు నిర్వహణపై నేడు సమావేశం

సాక్షి, హైదరాబాద్: భూకంపాలు, వడగళ్లు, పిడుగులు, మెరుపులతో కూడిన వర్షాలు తదితర విపత్తు నిర్వహణ అంశాలపై శనివారం సాయంత్రం 3.30 గంటలకు సచివాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

పక్షి జాతిని కాపాడండి: పార్థసారథి

సాక్షి, హైదరాబాద్: పక్షి జాతిని కాపాడాల్సిన అవసరముందని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి అన్నారు. 'ఈ వేసవిలో పక్షులను కాపాడండి' అనే నినాదంతో సామాజిక కార్యకర్త రామచంద్రారెడ్డి ప్రారంభించిన అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను పార్థసారథి శుక్రవారం ఆవిష్కరించారు. మిషన్ కాకతీయ చెరువులు పక్షులకు ప్రయోజనకారిగా మారాయని పేర్కొన్నారు. పట్టణాల్లో మాత్రం అలాంటి పరిస్థితి లేదన్నారు.

తెలంగాణకు ఇచ్చిన నిధులివీ..!

- హైదరాబాద్ వచ్చి శాఖలవారీగా కేంద్ర మంత్రుల సమీక్షలు
- టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఎదురుదాడికి సిద్ధమైన బీజేపీ అగ్రనాయకత్వం
- నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేదని చెప్పే యోచన
- నిర్మలా సీతారామన్‌తో పార్టీ రాష్ట్ర నేతల చర్చలు
- మోదీపై సీఎం కామెంట్ల వీడియోను అమిత్‌షాకు పంపిన లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు ఆశించిన స్థాయిలో నిధులు అందటం లేదని తరచూ ముఖ్యమంత్రి సహా రాష్ట్ర మంత్రులు చేస్తున్న ప్రచారానికి చెక్ పెట్టేందుకు బీజేపీ అగ్ర నాయకత్వం వ్యూహం రచిస్తోంది. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రధాని నరేంద్రమోదీని ఉద్దేశించి వాడిన పదాలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ నాయకత్వం టీఆర్‌ఎస్ సర్కార్‌పై ఎదురుదాడి చేయాలని నిర్ణయించింది. కొంతకాలంగా ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నా పెద్దగా పట్టించుకోని కాషాయ దళం.. ఇప్పుడు మోదీపై సీఎం కేసీఆర్ మాటలతో ఆగ్రహంగా ఉంది. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ బాహాటంగానే కేసీఆర్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో తాజాగా ఆ పార్టీ కేంద్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రాధాన్యమేర్పడింది.

ఇచ్చిన నిధులపై ప్రజలకు వివరణ

నాలుగేళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన నిధులపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని బీజేపీ నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి రాష్ట్రానికి భారీగానే నిధులు విడుదలయ్యాయని, అందులో కొన్ని కీలక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా సరిగా అమలు చేయటం లేదని కేంద్రం భావిస్తోంది. తెలంగాణకు కేంద్రం నుంచి వచ్చిన నిధులపై కేంద్ర మంత్రులు శాఖలవారీగా హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించి.. మంజూరు చేసిన నిధులు, అందులో ఇప్పటి వరకు విడుదలైన మొత్తం, వాటిల్లో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం ఎంతో బహిర్గతం చేయాలని తాజాగా నిర్ణయించింది. దేశవ్యాప్తంగా మంచి ఫలితాలను ఇస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం తెలంగాణలో సరిగా అమలు కావటం లేదని ఇప్పటికే కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఇలాంటి ముఖ్యమైన పథకాలు ఇక్కడ సరిగా అమలు కాకపోవటం వల్ల బీజేపీకి మంచిపేరు రాకుండా పోతోందని ఆ పార్టీ జాతీయ నాయకత్వం గుర్తించింది. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి చౌదరీ బీరేంద్రసింగ్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవటంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

రాష్ట్ర నేతలతో నిర్మలా సీతారామన్ భేటీ

గురువారం నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు సీఎం కామెంట్లపై బాహాటంగా అసంతృప్తి వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్టీ రాష్ట్ర నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాజీ గవర్నర్ దివంగత వి.రామారావు ఇంట్లో అల్పాహార సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు నగరంలో సమీక్షలు నిర్వహించే విషయంపై ఆమె వారికి స్పష్టతనిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం కావాలనే కేంద్రంపై పనిగట్టుకుని ఆరోపణలు చేస్తోందన్న నిర్ణయానికొచ్చారు. ఈ విషయం ఇప్పటికే ప్రధాని మోదీ దృష్టికి వెళ్లిందని పేర్కొన్నారు.

అమిత్‌షాకు సీఎం కామెంట్ల వీడియో

ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ ఏకవచన సంబోధన, కించపరిచేలా మాట్లాడినట్టుగా ఉన్న వీడియో క్లిప్పింగ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షాకు పంపారు. అందులో సీఎం మాట్లాడిన మాటల వివరాలను, కొంతకాలంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రంపై, ప్రధానిపై చేస్తున్న విమర్శల వివరాలతో కూడిన లేఖను జతచేశారు.



టూరిస్ట్ స్పాట్స్‌లో 'ఈ-సైకిల్' పెట్రోలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం హైదరాబాద్ పోలీసు విభాగం గస్తీ కోసం ద్విచక్ర వాహనాలు, ఇన్నోవాలు వినియోగిస్తోంది. వీటికితోడు ఒక్కో సబ్ డివిజన్‌లో ఒకటి చొప్పున ఇంటర్‌సెప్టర్ వాహనాలు తిరుగుతున్నాయి. ఇవన్నీ పెట్రోల్ లేదా డీజిల్ ఇంధనంగా పని చేస్తూ అత్యంత వేగంగా దూసుకుపోయేవి. వీటివల్ల కాలుష్యంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో అశ్వక దళాన్ని వాడుతున్నా.. అన్ని సందర్భాల్లోనూ ఇది అనువైంది కాదు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు ఈ–సైకిల్స్ సమీకరించుకోవాలని నిర్ణయించారు. బ్యాటరీ సాయంతో పని చేసే ఈ సైకిల్స్‌ను తొలిదశలో టూరిస్ట్ స్పాట్స్‌లో పోలీసింగ్, పెట్రోలింగ్ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఐఐటీ విద్యార్థులు టీ-హబ్‌లో ఏర్పాటు చేసిన స్టార్టప్ కంపెనీ ఓ తరహాకు చెందిన ఈ–సైకిల్‌ను రూపొందించింది. దీని పనితీరును కొత్వాల్ శుక్రవారం తన కార్యాలయంలో పరిశీలించారు. ఇవే మోడల్స్ లేదా ఇదే తరహాకు చెందిన ఈ–సైకిల్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో ట్యాంక్‌బండ్ చుట్టూ సంచరించే లేక్ పోలీసులతో పాటు కేబీఆర్ పార్క్, చార్మినార్, కుతుబ్‌షాహీ టూంబ్స్, గోల్కొండ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించే బృందాలకు కేటాయిస్తామన్నారు. ఈ సైకిల్ ఒక్కసారి చార్జ్ చేస్తే 50 కి.మీ. నడుస్తుంది. ఒక్కసారి ఫెడల్ చేస్తే సార్టయ్యే ఈ బై సైకిల్ ఆగకుండా ముందుకు వెళ్తుంది. గరిష్టంగా మూడు నెలల్లో వీటిని పోలీసు విభాగంలోకి తీసుకురావాలని భావిస్తున్నామని తెలిపారు.

రెండో రోజూ స్తంభించిన హైకోర్టు కార్యకలాపాలు

- అత్యవసర కేసులు మాత్రమే విచారణ..
- హైకోర్టు న్యాయమూర్తుల ఖాళీల భర్తీకి డిమాండ్



శుక్రవారం హైకోర్టు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదుల విధుల బహిష్కరణతో హైకోర్టు కార్యకలాపాలు రెండో రోజు కూడా స్తంభించాయి. దీంతో తీర్మానించిన విధంగానే కోర్టు విధులను రెండ్రోజుల పాటు న్యాయవాదులు విజయవంతంగా బహిష్కరించినట్లైంది. న్యాయవాదుల అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు అత్యవసర కేసులు మినహా వేరే కేసుల విచారణ చేపట్టలేదు. శుక్రవారం ఉదయం కోర్టు పని వేళలు ప్రారంభం కాగానే న్యాయవాదులు ఆయా కోర్టు హాళ్లలోకి వెళ్లి విధుల బహిష్కరణకు సహకరించాలని సహచర న్యాయవాదులను కోరారు. దీంతో కోర్టు హాళ్లలో ఉన్న న్యాయవాదులందరూ బయటకు వచ్చేశారు. రెండో రోజు కూడా హైకోర్టు బార్ కౌన్సిల్ గేటు నుంచి మదీనా వరకు ర్యాలీ నిర్వహించారు.

త్వరలో భవిష్యత్ కార్యాచరణ..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు జెల్లి కనకయ్య, చల్లా ధనంజయలతో నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. వెంటనే హైకోర్టు న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయాలంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. హైకోర్టు నాలుగో గేటు వద్ద బైఠాయించి కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉభయ సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ.. ప్రస్తుతం హైకోర్టులో తగినంత మంది న్యాయమూర్తులు లేరని, దీంతో కక్షిదారులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసులు విచారణకు నోచుకోకపోవడంతో కక్షిదారులు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో న్యాయవాదులు ఉన్నారని చెప్పారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు, కేంద్రం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రెండు వారాల తర్వాత సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను నిర్ణయిస్తామన్నారు.

సాక్షి బిజినెస్

శనివారం 3-3-2018

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్	నిఫ్టీ
137 ▼	34 ▼
34,047	10,458

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)


సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,206	▲ 25
డోజోన్స్	24,479	▼ 130
ఎఫ్‌టీఎస్ఈ 100	7,070	▼ 106
డాక్స్	11,914	▼ 277
షాంఘై	3,255	▼ 19
నికాయ్	21,182	▼ 543

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.95	66.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.01	91.19
€	యూరో	ఎస్‌బీఐ	80.79	80.95
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.04	62.16
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.28	51.38
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.96	50.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.77	18.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.14	18.87
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.27	11.80

ప్రతి 4 గంటలకు ఒక ఇంటి దొంగ!



- బ్యాంకింగ్‌లో కొందరు ఉద్యోగుల అవినీతి
- మూడున్నరేళ్లలో రూ.66వేల కోట్లకు కన్నం
- భారీ మోసాల్లో సిబ్బంది పాత్ర
- రిజర్వ్ బ్యాంక్ గణాంకాల్లో వెల్లడి

భారత ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా భావిస్తున్న బ్యాంకింగ్‌లో లొసుగులకు సంబంధించి వస్తున్న గణాంకాలు యావత్తు జాతినీ నివ్వెరపరుస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) చోటుచేసుకున్న దాదాపు రూ.11,400 కుంభకోణం తరువాత భారత బ్యాంకుల్లో చోటుచేసుకుంటున్న మోసాలపై పరిశీలకులు, విశ్లేషకులు మరింతగా దృష్టి పెట్టారు. బ్యాంకింగ్ రెగ్యులేటర్- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూపొందించిన గణాంకాల ప్రకారం... ఇక్కడ సగటున ప్రతి 4 గంటలకూ ఒక ఇంటిదొంగ బయటపడుతున్నాడు. అంతేకాదు!! గడిచిన మూడున్నరేళ్లలోనే ఉద్యోగుల తాలూకు మోసాల వల్ల ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులు ఏకంగా రూ.66వేల కోట్లకుపైగా నష్టపోయాయి. ఆ వివరాలు చూస్తే...

సిబ్బంది ప్రమేయంతో...

- 2013 ఏప్రిల్ నుంచి జూన్ 2016 మధ్య ఉద్యోగుల ప్రమేయంతో జరిగిన మోసాల సంఖ్య (రూ. లక్ష ఆపైన) 1,232. దీనివల్ల బ్యాంకులు రూ.2,450 కోట్లు నష్టపోయాయి.
- కేసుల్లో మహారాష్ట్ర సహా దక్షిణాది రాష్ట్రాల వాటా 49 శాతం. అయితే మోసం విలువలో చూస్తే 19 శాతమే.
- కేసుల విషయంలో కేవలం 3 శాతం ఉన్న (38) రాజస్థాన్, విలువ రూపంలో మాత్రం 44 శాతం (రూ.1,096 కోట్లు) ఉంది.
- రూ. లక్ష దిగువన కేసులను పరిగణనలోకి తీసుకోలేదు.

రాష్ట్రాల వారీగా చూస్తే...

రాష్ట్రం	కేసుల సంఖ్య	మొత్తం కేసుల్లో (శాతం)	విలువ మొత్తం (రూ.కోట్లలో)	నష్టంలో వాటా (శాతం)
తమిళనాడు	170	14	83.09	3
తెలుగు రాష్ట్రాలు	157	13	148.41	6
కర్ణాటక	125	10	89.34	4
మహారాష్ట్ర	107	9	110.43	4.5
కేరళ	50	4	30.53	1.2
రాజస్థాన్	38	3	1,096	45
చండీగఢ్	03	0.02	253.44	10
ఢిల్లీ	37	3	188.22	8
పశ్చిమబెంగాల్	69	6	167	7
విదేశీ బ్రాంచీలు	9	0.7	41.6	1.7
21 ఇతర రాష్ట్రాలు	467	38	241.53	10
మొత్తం	1,232	100	2450	100

ఆధారం: ఆర్‌బీఐ గణాంకాలు

మోసం.. శిక్ష..!



- సగటున ప్రతి నాలుగు గంటలకు కనీసం ఒక బ్యాంకర్ 'మోసం' లావాదేవీతో పట్టుబడుతున్నాడు. శిక్షకు గురవుతున్నాడు.
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మోసానికి సంబంధించి 2015 జనవరి 1- 2017 మార్చి 31 మధ్య దాదాపు 5,200 అధికారులకు శిక్ష పడింది. జరిమానాలు వేయటం, సేవల నుంచి డిస్మిస్ చేయటం వంటివి కూడా జరిగాయి.
- బ్యాంకుల పరంగా చూస్తే, మోసాలకు సంబంధించి శిక్షకు గురయిన బ్యాంకుల్లో ఎస్‌బీఐది మొదటి స్థానం. ఇక్కడ ఈ తరహా మోసాలకు పాల్పడిన అధికారుల సంఖ్య 1,538.
- తరువాతి స్థానాల్లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (449), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (406)లు ఉన్నాయి.
- ఇదే కాలంలో మోసపూరిత లావాదేవీలకు సంబంధించి 184 మంది పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులు శిక్షకు గురయ్యారు.

ప్రభుత్వ బ్యాంకుల్లో శిక్షకు గురైన సిబ్బంది

బ్యాంక్	2015	2016	2017 (జనవరి-మార్చి)	మొత్తం
	(జనవరి-డిసెంబర్)			
ఎస్‌బీఐ	888	547	103	1,538
ఐఓబీ	245	160	44	449
సెంట్రల్ బ్యాంక్	248	130	28	406
యూనియన్ బ్యాంక్	125	72	17	214
పీఎన్‌బీ	115	58	11	184
22 ఇతర బ్యాంకులు	1,127	1,027	255	2,409
మొత్తం	2,748	1,994	458	5,200

ఆధారం: ఆర్‌బీఐ గణాంకాలు

మూడున్నరేళ్ల చరిత్ర ఇలా...

ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం- 2013 ఏప్రిల్ 1 నుంచి 2016 డిసెంబర్ 31వ తేదీ వరకూ చూస్తే, ప్రైవేటు బ్యాంకులుసహా అన్ని వాణిజ్య బాంకులు 17,504 మోసాలకు సంబంధించి రూ.66,066 కోట్లు నష్టపోయాయి. ఇందులో 2,084 కేసులు ఉద్యోగుల ప్రమేయంతో జరిగాయి.

దృష్టి పెట్టడం లేదు...

మోసాలను నిరోధించడానికి బ్యాంకులు బయటివైపే చూస్తుంటాయి. దీనికే అధిక సమయం కేటాయిస్తుంటాయి. నెట్‌వర్క్ అంతటా రిస్క్‌ను తగ్గించుకోవటం, నివారించటం వంటి చర్యలపై అసలు దృష్టి పెట్టడం లేదు.

– సంజయ్ కౌశిక్,
ఎండీ, నెట్‌రికా కన్సల్టింగ్

బాసిజం తీవ్రత...

ఒక నిర్ణయం పట్ల పలు దశల్లో పరిశీలన అవసరం. అయితే భారత్ బ్యాంకుల్లో ఇది కనిపించదు. ఇక్కడ బాసిజం ఎక్కువ. ఒక మేనేజర్ ఒక నిర్ణయం తీసుకున్నాడూ అంటే, దిగువ స్థాయిల్లో ఇక ఎవ్వరూ దీనిని ప్రశ్నించరు. బ్యాంకింగ్ నిర్వహణలో ఇది తగదు.

– బికాశ్ గంగాధరన్,
బ్యాంకింగ్ నిపుణులు

గుర్తించడంలోనే లోపం...

ఇబ్బంది ఎక్కడుంది? వాటిని నివారించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి అన్న విషయంలోనే బ్యాంకింగ్‌లో లోపం ఉంది. దీనివల్ల జరిగిన తప్పుకు ఎవరిని బాధ్యులను చేయాలో అర్థంకాని అయోమయ స్థితి ఏర్పడుతుంది. నిర్వహణ మెరుగుపడాలి.

– టోబే సిమన్,
సినర్జియా ఫౌండేషన్

మొండి బకాయిలు...

మొండి బకాయిల సమస్య ప్రభుత్వ బ్యాంక్‌లను అతలాకుతలం చేస్తోన్న విషయం తెలిసిందే. ళ గత ఏడాది సెప్టెంబర్ నాటికి మొత్తం రుణాల్లో 10.2 శాతంగా ఉన్న మొండి బకాయిలు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 11.1 శాతానికి చేరతాయని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. ప్రభుత్వ ఇటీవలి చర్యలు కొంత ఊరట కలిగించినప్పటికీ తాజా పీఎన్‌బీ స్కామ్ వ్యవహారం సమస్యను మళ్లీ మొదటికి తెచ్చింది.

మోసాలు... మొత్తం... ఉద్యోగుల జోక్యం...

	2013-14	2014-15	2015-16	2016-17 (క్యూ3 వరకూ)	మొత్తం
మొత్తం మోసాలు	4,305	4,639	4,690	3,870	17,504
మోసానికి గురయిన మొత్తం (కోట్ల రూపాయల్లో)	10,170	19,455	18,691	17,750	66,066
సిబ్బంది ప్రమేయం	501	551	582	450	2,084

ఆధారం: ఆర్‌బీఐ గణాంకాలు

జెట్‌లో ఎతిహాద్ వాటాల విక్రయం!

- డిసెంబర్ కల్లా విక్రయించొచ్చని కాపా అంచనా
- మొత్తం 24 శాతం వాటాల అమ్మకం
- అలాంటిదేమీ లేదు; జెట్ కీలక భాగస్వామి: ఎతిహాద్



న్యూఢిల్లీ: విమానయాన దిగ్గజం జెట్ ఎయిర్‌వేస్‌లో తనకున్న వాటాను దుబాయ్‌కి చెందిన ఎతిహాద్ ఎయిర్‌వేస్ విక్రయించవచ్చనే వార్తలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఈ ఏడాది ముగిసే సరికల్లా జెట్‌లో తనకున్న 24 శాతం వాటానూ ఎతిహాద్ విక్రయించేసే అవకాశం ఉందని కన్సల్టెన్సీ సంస్థ కాపా-సెంటర్ ఫర్ ఏవియేషన్ వెల్లడించింది. దీనితో అబుదాబి, భారత్ మధ్య విమాన సర్వీసుల క్రమబద్ధీకరణ జరగవచ్చని ట్వీట్ చేసింది. ఎతిహాద్ ఈ వార్తలను ఖండించగా, జెట్ ఎయిర్‌వేస్ మాత్రం ఇవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేసింది. కాపా అంచనాలు తప్పని, జెట్ ఎయిర్‌వేస్ తమకు విలువైన భాగస్వామని ఎతిహాద్ తెలిపింది. జెట్‌లో వాటాల విక్రయ యోచనేదీ లేదని స్పష్టం చేసింది.

సంక్లిష్ట బంధం...

జెట్‌లో ఎతిహాద్‌కు 24 శాతం వాటా ఉంది. అలాగే, లండన్‌లో కొన్ని ఫ్లయిట్ స్లాట్లను కూడా జెట్ నుంచి ఎతిహాద్ కొనుగోలు చేసింది. వీటిని మళ్లీ జెట్ లీజుకు తీసుకుంది. ఇక జెట్‌కి చెందిన కొన్ని విమానాలను కొంత సిబ్బందితో సహా ఎతిహాద్ లీజుకు తీసుకుంది. ఇలా ఈ రెండింటి మధ్య సంక్లిష్టమైన ఒప్పందాలున్నాయి. వీరు విడిపోవటం అంత తేలిక కాదనేది పరిశీలకుల మాట. ఈ ఒప్పందంతో ఎతిహాద్‌కే అధిక లాభం ఉన్నట్లు కూడా వారు పేర్కొన్నారు. ఎతిహాద్ యూరప్‌లో ఇన్వెస్ట్ చేసిన అలిటాలియా, ఎయిర్ బెర్లిన్ సంస్థలు నష్టాల్లో ఉండగా.. జెట్ ఒక్కటే నిలకడగా కాస్తంత లాభాల్లో ఉంది. ఎమిరేట్స్, కతార్ ఎయిర్‌వేస్‌తో పాటు ఇతర కంపెనీలకు కొంత పోటీనిచ్చేందుకు ఇదే తోడ్పడుతోంది. కాకపోతే కొన్నాళ్లుగా జెట్ కార్యకలాపాల్లో ఎతిహాద్ ప్రమేయం తగ్గుతూ... ప్రస్తుతం కనిష్ట స్థాయిలకు పడిపోయినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

నేపథ్యం ఇదీ..: 2013 ఏప్రిల్‌లో సుమారు రూ.2,069 కోట్లతో జెట్ ఎయిర్‌వేస్‌లో ఎతిహాద్ 24 శాతం వాటాలు కొనుగోలు చేసింది. దేశీ ఏవియేషన్ రంగంలో విదేశీ ఎయిర్‌లైన్స్ ఆటోమేటిక్ మార్గంలో 49 శాతం దాకా ఇన్వెస్ట్ చేయొచ్చంటూ నిబంధనలు సడలించడంతో.. జెట్‌లో ఎతిహాద్ ఎయిర్‌వేస్ 2016లో ఆ మేరకు తన వాటాలు పెంచుకోవచ్చన్న వార్తలు వెలువడ్డాయి. ఇవన్నీ ఊహాగానాలేనని జెట్ కొట్టిపారేసింది. 1992లో ఏర్పాటైన జెట్ ఎయిర్‌వేస్ 1993లో ఎయిర్ ట్యాక్సీ ఆపరేటర్‌గా కార్యకలాపాలు ప్రారంభించింది. 2004లో అంతర్జాతీయ రూట్లలో కూడా సర్వీసులు మొదలుపెట్టి.. 2005లో పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. 2007లో ఎయిర్ సహారా సంస్థను కొనుగోలు చేసిన కంపెనీ .. జెట్‌లైట్ పేరు కింద చౌక విమానయాన సర్వీసులు అందిస్తోంది. చాన్నాళ్లుగా నష్టాలు చవిచూసినా.. 2015-16లో కొంత కోలుకుని రూ.1,200 కోట్ల లాభం ఆర్జించింది. అయితే, మళ్లీ 2016-17లో ఈ లాభం రూ. 390 కోట్లకు తగ్గిపోయింది.

బఫెట్‌కు రూ.25వేల కోట్ల నష్టం!

- మొన్న ఫెడ్ రేట్ల పెంపు భయాలు
- నిన్న 'లోహ' సుంకాల విధింపు ప్రభావం
- దీంతో భారీగా పతనమైన అమెరికన్ స్టాక్ మార్కెట్
- 500 మంది కుబేరుల నష్టం రూ.8.3 లక్షల కోట్లు
- తుఫాన్ నష్టాలకు తోడైన షేర్ల నష్టాలు



అమెరికా స్టాక్ మార్కెట్ ఈ వారం భారీగా పడిపోవడంతో అపర కుబేరుడు, వారెన్ బఫెట్ సంపద కూడా భారీగా పతనమైంది. ఈ వారం స్టాక్ మార్కెట్ క్షీణతతో వారెన్ బఫెట్‌కు 374 కోట్ల డాలర్ల (రూ.24,300 కోట్లు) నష్టం వచ్చింది. వారెన్ బఫెట్ సంపదే కాకుండా ఇతర సంపన్నుల సంపద కూడా భారీ స్థాయిలోనే హరించుకుపోయింది. ఫేస్‌బుక్ మార్క్ జుకర్‌బర్గ్, గూగుల్ లారీ పేజ్, సెర్గీ బ్రిన్ తదితరులు పెద్ద మొత్తంలోనే నష్టపోయారు. బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాతవే మార్కెట్ విలువ తాజా పతనం తరవాత రూ.32.5 లక్షల కోట్లు.

మొత్తం12,800 కోట్ల డాలర్లు హుష్‌కాకి...


సోమవారం నుంచి అమెరికా స్టాక్ మార్కెట్ పతనం కావడంతో 500 మందికి పైగా కుబేరులు 12,800 కోట్ల డాలర్ల (రూ.8,32,000 కోట్లు) మేర నష్టపోయారు. ఇది నెట్‌ఫ్లిక్స్, లేదా మెక్‌డొనాల్డ్ కార్ప్‌ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు సమానం. ఇలా నష్టపోయిన కుబేరుల్లో అమెరికాకు చెందిన వారి సంపద 5,500 కోట్ల డాలర్లు కాగా... చైనాకు చెందినవారిది 1,400 కోట్ల డాలర్లు.

ఎందుకు ఈ నష్టాలు.. ?

అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్‌గా పగ్గాలు చేపట్టిన జెరోమి పావెల్ ఇటీవలే అమెరికా సెనేట్‌లో ప్రసంగించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ రికవరీ పటిష్టంగా ఉందని, స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులతో నిమిత్తం లేకుండా రేట్లు పెంచుతామని సంకేతాలిచ్చారు. అమెరికా వ్యవస్థ అంచనాలకు మించి పుంజుకుంటుండటంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా అంచనాలను మించిన వేగంతో రేట్లను పెంచుతుందన్న ఆందోళనలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. దీంతో ఈ మంగళవారం అమెరికా స్టాక్ మార్కెట్ భారీగానే నష్టపోయింది. ఇక తాజాగా అమెరికాకు దిగుమతి అవుతున్న ఉక్కు ఉత్పత్తులపై 25 శాతం, అల్యూమినియమ్ ఉత్పత్తులపై 10 శాతం మేర సుంకాలు విధిస్తామని, ఈ సుంకాలు వచ్చే వారం నుంచే ఆరంభమవుతాయని, దీర్ఘకాలం పాటు అమల్లో ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో అమెరికా స్టాక్ మార్కెట్ గురువారం భారీగా పతనమైంది. ఈ సుంకాల విధింపు వాణిజ్య యుద్ధాలకు దారితీస్తుందని అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని విశ్లేషణ.

నిప్పన్ స్టీల్‌తో ఆర్సెలర్ మిట్టల్ జట్టు

ఎస్సార్ స్టీల్ కొనుగోలుకు సంయుక్త బిడ్



న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేసే ప్రయత్నాల్లో భాగంగా జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ అండ్ సుమిటోమో మెటల్ కార్పొరేషన్‌తో (ఎన్‌ఎస్‌ఎస్‌ఎంసీ) ఆర్సెలర్ మిట్టల్ చేతులు కలిపింది. నిప్పన్‌తో జాయింట్ వెంచర్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఈ కంపెనీ వెల్లడించింది. భారీ మొండిబాకీలతో దివాలా చట్టం కింద చర్యలు ఎదుర్కొంటున్న 12 కంపెనీల్లో ఎస్సార్ స్టీల్ ఒకటి. దీన్ని కొనుగోలు చేస్తే భారత మార్కెట్లో కీలకంగా ఎదగొచ్చనే ఉద్దేశంతో ఎస్సార్ స్టీల్ కోసం ఆర్సెలర్‌మిట్టల్ బరిలో నిలిచింది. కంపెనీని గాడిలో పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను ఆర్సెలర్ మిట్టల్ ఇండియా (ఏఎంఐపీఎల్) ఫిబ్రవరి 12న అందజేసింది కూడా. తమ ప్రణాళికకు గానీ ఎన్‌సీఎల్‌టీ ఆమోద ముద్ర వేస్తే నిప్పన్‌తో కలసి ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేస్తామని, సంయుక్తంగా సంస్థ నిర్వహణ చేపడతామని ఆర్సెలర్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ నివాస్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 1987 నుంచి ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కలసి అమెరికాలోని ఇండియానాలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇటీవలే అమెరికాలోని అలబామాలో కాల్వర్ట్ ఉక్కు ప్లాంటును కూడా కొనుగోలు చేశాయి. ఆర్సెలర్ మిట్టల్‌కి 60 పైగా దేశాల్లో కార్యకలాపాలున్నాయి.

వాహన విడిభాగాల పరిశ్రమ జోరు: ఇక్రా

ముంబై: దేశీ వాహన విడిభాగాల పరిశ్రమపై రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ధీమాగా ఉంది. ఇది తాజాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పరిశ్రమ ఆదాయ వృద్ధి అంచనాలను సవరించింది. ఇదివరకటి 9-11 శాతం ఆదాయ వృద్ధి అంచనాలను ఇప్పుడు 13-15 శాతానికి పెంచింది. దేశీ ప్యాసింజర్, కమర్షియల్, ట్రాక్టర్, టూవీలర్ విభాగాలకు చెందిన వాహనాల డిమాండ్ పెరగొచ్చనే అంచనాలు దీనికి ప్రధాన కారణం.


బులియన్ రూ.లలో

చెన్నై			
బంగారం (99.9, 10గ్రా)	– –		
బంగారం (99.5, 10గ్రా)	29,040	▲	110
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,490	▲	110
బంగారం (22 క్యారెట్లు)	29,040	▲	110
వెండి (కిలో)	41,400	▲	300
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,400	▲	50
బంగారం (22 క్యారెట్లు)	29,090	▲	30
వెండి (కిలో)	39,700	▲	300
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,680	▲	120
బంగారం (22 క్యారెట్లు)	29,040	▲	110
వెండి (కిలో)	41,000		0
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,400	▲	120
బంగారం (22 క్యారెట్లు)	29,040	▲	110
వెండి (కిలో)	39,400	▲	300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ద్వితీయ శ్రేణికీ బ్యూటీ, వెల్‌నెస్ సేవలు!

- డాజిల్ స్పా, వసుంధర సెలూన్ చెయిన్లు
- 'వసుంధర' మహిళల కోసం మాత్రమే
- ఔత్సాహికులకు యజమానులుగా అవకాశం
- బ్యాంకు రుణాలు సైతం మేమే ఇప్పిస్తాం
- 'సాక్షి' స్టార్టప్ డైరీతో ఫౌండర్లు నాగేశ్, అరుణకుమారి





నాగేశ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇపుడు సౌందర్య పోషణ అనేది ఎగువ తరగతికే కాదు!! మధ్య తరగతికి... ఇంకా చెప్పాలంటే దిగువ మధ్య తరగతికీ విస్తరిస్తోంది. మెట్రో నగరాల నుంచి ద్వితీయ శ్రేణి పట్టణాలకూ పాకింది. కాకపోతే ఎక్కడికక్కడ సెలూన్లు, వెల్‌నెస్ సెంటర్లు విడి విడిగానే ఉంటున్నాయి. చెయిన్లు నిర్వహించేవన్నీ పెద్ద పెద్ద సంస్థలే!! వారి ఫ్రాంచైజీ అంటే మాటలు కాదు!. ఇదిగో... సరిగ్గా ఈ అంశమే తమను 'వసుంధర సెలూన్స్' ఏర్పాటు చేయటానికి పురి గొల్పిందంటారు నాగేశ్, అరుణ కుమారి. దిగువ మధ్య తరగతి మహిళలనూ సహ యజమానులుగా చేస్తూ ఆరంభించిన తమ స్టార్టప్ గురించి మరిన్ని వివరాలు వారి మాటల్లోనే...

''ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకూ వ్యవస్థీకృతమైన బ్యూటీ, వెల్‌నెస్ సేవలందించాలన్నదే మా ఉద్దేశం. దీనికోసమే డాజిల్ సెలూన్ అండ్ స్పా ప్రై.లి, వసుంధర బ్యూటీ అండ్ స్పా పేరిట రెండు బ్రాండ్లను మార్కెట్‌కు పరిచయం చేశాం. వసుంధర బ్రాండ్ పూర్తిగా మహిళల కోసమే. నేను అమెరికాలో పలు కంపెనీల్లో పని చేసి 2007లో ఇండియాకు తిరిగొచ్చా. ఇక్కడ పలు బ్యూటీ అండ్ వెల్‌నెస్ కంపెనీలకు ఈఆర్పీ వంటి ఐటీ సొల్యూషన్స్ అందించేవాణ్ణి. అప్పుడే సొంతంగా బ్యూటీ సెలూన్ పెట్టాలని నిర్ణయించుకొని 2012లో డాజిల్ సెలూన్స్‌ను ప్రారంభించాం. మహిళలకు హెయిర్ వాష్, ఫేషియల్, బాడీ మసాజ్ వంటి ఇతరత్రా బ్యూటీ సేవలందిస్తున్నాం. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో బ్యూటీ సేవలు, అది కూడా అందుబాటు ధరలకు అందించడమే వసుంధర లక్ష్యం. ప్రస్తుతం విశాఖపట్నం, రాజమండ్రి, భీమవరం, కాకినాడ, హైదరాబాద్‌లలో 8 బ్రాంచీలున్నాయి. వచ్చే మూడేళ్లలో 100 బ్రాంచీలకు చేర్చడం లక్ష్యం. మూడు నెలల్లో కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాల్లో సెలూన్లను ప్రారంభించనున్నాం.

ఆయిల్స్, క్రీములు ఇతరత్రా బ్యూటీ ఉత్పత్తులను ముంబై నుంచి తెస్తాం. శ్రీలంక నుంచి ప్రత్యేకంగా ఆయుర్వేద ఫేషియల్ ఆయిల్స్‌లను దిగుమతి చేసుకుంటున్నాం. విదేశీ ఉత్పత్తులు వినియోగిస్తున్నప్పటికీ స్థానిక సెలూన్లతో పోలిస్తే మా దాంట్లో ధర 30-40 శాతం తక్కువే ఉంటుంది. హైదరాబాద్‌లో మహిళలకు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాం. ప్రస్తుతానికైతే వసుంధరలో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే శిక్షణ ఇస్తున్నాం. త్వరలోనే ఈ సేవలను విస్తరిస్తాం. వసుంధర సెలూన్ల ఏర్పాటుతో ఔత్సాహిక మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నాం. పెట్టుబడుల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడాతో (బీఓబీ) ఒప్పందం చేసుకున్నాం. ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.30 లక్షల వరకు ముద్ర రుణాలను మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం మా సంస్థలో 52 మంది ఉద్యోగులున్నారు. ఇప్పటివరకు రూ.1.5 కోట్ల పెట్టుబడులు పెట్టాం. విస్తరణ, బ్రాండింగ్ కోసం రూ.4.5 కోట్ల పెట్టుబడులు అవసరం. 60 శాతం నిధుల కోసం బీఓబీతో చర్చలు జరిపాం. ఏడాదిలో నిధులను సమీకరిస్తాం'' అని నాగేశ్, అరుణ కుమారి ధీమా వ్యక్తంచేశారు.

స్టార్టప్ డైరీ

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే **startups@sakshi.com** కు మెయిల్ చేయండి...

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 03-3-2018

విశాఖ	350-00
చిత్తూరు	378-00
వరంగల్	347-00
ముంబై	390-00
చెన్నై	385-00
విజయవాడ	340-00
గోదావరి	340-00
నమక్కల్	370-00
02-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.05
బెంగళూరు	375-00
కోల్‌కతా	385-00

భారత రాజపత్రము: అసాధారణ [భాగం-II, సెక్షన్ 3, ఉప సెక్షన్ (ii)]

రోడ్డు రవాణా మరియు రహదార్ల మంత్రిత్వ శాఖ

(భారత ప్రభుత్వం)

ప్రకటన

కొత్త ఢిల్లీ, 26 ఫిబ్రవరి, 2018

ఎస్.ఒ. **809(ఇ)**– జాతీయ రహదారుల చట్టం, 1956 (48, ఆఫ్ 1956) (ఇకపై చట్టముగా వ్యవహరించబడును) యొక్క సెక్షన్ 3ఎ యొక్క సబ్ సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, దిగువ షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణ గల భూమి ప్రజోపయోగార్థం కావలసి వున్నదని భావించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని **కి.మీ. 10/100 నుండి కి.మీ. 32/450** వరకు భూమిపై జాతీయ రహదారి నెం. 365ఎ, **(కోదాడ – ఖమ్మం సెక్షన్)** లో నిర్మాణం (వెడల్పు / నాలుగు లేనింగ్ మొదలగునవి) నిర్వహణ, యాజమాన్యత, ఆపరేషన్ కొరకు అవసరమై ఉన్నది. అందుకు అట్టి భూమి సేకరించాలనే తన ఉద్దేశ్యాన్ని ఇందుమూలంగా వ్యక్తం చేస్తున్నది.

సదరు భూమి విషయంలో ఆసక్తి గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజెట్‌లో ఈ నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుండి ఇరవై – ఒక్క రోజుల్లోగా సదరు చట్టంలోని సెక్షన్ 3సి సబ్–సెక్షన్ (1) క్రింద సదరు పనికోసం అట్టి భూమి ఉపయోగించుటకు అక్షేపణను తెలియజేయవచ్చును.

అట్టి ప్రతి అక్షేపణనూ సమర్థ ప్రాధికారికి అంటే జాయింట్ కలెక్టర్, ఖమ్మం, తెలంగాణ వారికి వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును. దాని అక్షేపణకు కారణాలు తెలియజేయాలి. సమర్థ ప్రాధికారి స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారించే అవకాశం అక్షేపకునికి ఇస్తారు. అట్టి అక్షేపణలు విచారించిన తరువాత మరియు తదుపరి విచారణ చేసిన తర్వాత సమర్థ ప్రాధికారి అవసరమని భావిస్తే ఉత్తర్వు ద్వారా అక్షేపణలను అనుమతించవచ్చును లేక అనుమతించకపోవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 3సి యొక్క ఉప–సెక్షన్ (2) క్రింద సమర్థ ప్రాధికారి చేసిన ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

ఈ నోటిఫికేషన్ క్రింద వచ్చే భూమి ప్లాన్లు, భూమి ఇతర వివరాలు సమర్థ ప్రాధికారి కార్యాలయంలో లభిస్తాయి. వాటిని ఆసక్తి గల వారు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా జాతీయ రహదారి నెం. 365ఎ లో కి.మీ. 10/100 నుండి కి.మీ. 32/450 వరకు (కోదాడ – ఖమ్మం సెక్షన్) భూమి స్ట్రిప్ పరిధిలోకి వచ్చే కట్టడంతో లేదా కట్టడం లేకుండా సేకరించబడే భూమి సంక్షిప్త వివరణ.

సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం (చ.మీ.లలో)
1	2	3	4
		జిల్లా : ఖమ్మం	
తాలూకా / మండలం: 1. నేలకొండపల్లి			(గ్రామం: 1) పైనంపల్లి
795	ప్రైవేట్	మాగాణి	2150.00
45	ప్రైవేట్	మాగాణి	304.00
40	ప్రైవేట్	మాగాణి	564.00
34/1	ప్రైవేట్	మాగాణి	5.00
39/1	ప్రైవేట్	మాగాణి	117.00
65	ప్రైవేట్	మాగాణి	1468.00
103	ప్రైవేట్	మాగాణి	1189.00
66	ప్రైవేట్	మాగాణి	186.00
89	ప్రైవేట్	మాగాణి	847.00
90	ప్రైవేట్	మాగాణి	1738.00
101	ప్రైవేట్	మాగాణి	1370.00
102	ప్రైవేట్	మాగాణి	2483.00
142	ప్రైవేట్	మాగాణి	2212.00
143	ప్రైవేట్	మాగాణి	1225.00
147	ప్రైవేట్	మాగాణి	2075.00
152	ప్రైవేట్	మాగాణి	1263.00
150	ప్రైవేట్	మాగాణి	868.00
576	ప్రైవేట్	మాగాణి	152.00
575	ప్రైవేట్	మాగాణి	427.00
572	ప్రైవేట్	మాగాణి	322.00
791/2	ప్రైవేట్	మాగాణి	227.00
791/1	ప్రైవేట్	మాగాణి	41.00
792	ప్రైవేట్	మాగాణి	71.00
793	ప్రైవేట్	మాగాణి	116.00
47	ప్రైవేట్	మాగాణి	185.00
556	ప్రైవేట్	మాగాణి	50.00
558	ప్రైవేట్	మాగాణి	298.00
570	ప్రైవేట్	మాగాణి	166.00
796	ప్రైవేట్	మాగాణి	257.00
17/1	ప్రైవేట్	మాగాణి	222.00
17/2	ప్రైవేట్	మాగాణి	19.00
		మొత్తం	**22617.000**
తాలూకా / మండలం: 1. నేలకొండపల్లి			(గ్రామం: 2) బోదులబండ
786	ప్రైవేట్	మాగాణి	709.000
796	ప్రైవేట్	మాగాణి	172.000
797	ప్రైవేట్	మాగాణి	240.000
798	ప్రైవేట్	మాగాణి	111.000
		మొత్తం	**1232.000**
తాలూకా / మండలం: 1. నేలకొండపల్లి			(గ్రామం: 3) సింగారెడ్డిపాలెం
77	ప్రైవేట్	మాగాణి	710.000
		మొత్తం	**710.000**
తాలూకా / మండలం: 1. నేలకొండపల్లి			(గ్రామం: 4) నేలకొండపల్లి
782/1	ప్రైవేట్	మాగాణి	152.000
80/2	ప్రైవేట్	మాగాణి	2859.000
142/7	ప్రైవేట్	మాగాణి	734.000
92	ప్రైవేట్	మాగాణి	770.000
88	ప్రైవేట్	మాగాణి	1533.000
90/1	ప్రైవేట్	మాగాణి	112.000
90/2	ప్రైవేట్	మాగాణి	86.000
91	ప్రైవేట్	మాగాణి	659.000
142/2	ప్రైవేట్	మాగాణి	120.000
		మొత్తం	**7025.000**
తాలూకా / మండలం: 1. నేలకొండపల్లి			(గ్రామం: 5) అచార్లగూడెం
195	ప్రైవేట్	మాగాణి	152.000
168	ప్రైవేట్	మాగాణి	884.000
169	ప్రైవేట్	మాగాణి	192.000
158	ప్రైవేట్	మాగాణి	860.000
161	ప్రైవేట్	మాగాణి	4.000
164	ప్రైవేట్	మెట్ట	202.000
162	ప్రైవేట్	మెట్ట	55.000
		మొత్తం	**2349.000**
తాలూకా / మండలం: 1. నేలకొండపల్లి			(గ్రామం: 6) గువ్వలగూడెం
159	ప్రైవేట్	మెట్ట	1349.000
160	ప్రైవేట్	మెట్ట	2282.000
161	ప్రైవేట్	మెట్ట	491.000
167	ప్రైవేట్	మెట్ట	1933.000
176	ప్రైవేట్	మెట్ట	877.000
27	ప్రైవేట్	మెట్ట	35.000
25	ప్రైవేట్	మాగాణి	1506.000
234	ప్రైవేట్	మెట్ట	709.000
157	ప్రైవేట్	మెట్ట	127.000
15	ప్రభుత్వ	మెట్ట	709.000
17	ప్రైవేట్	మాగాణి	608.000
26	ప్రైవేట్	మాగాణి	152.000
20	ప్రైవేట్	మెట్ట	982.000
19	ప్రైవేట్	మాగాణి	507.000
18	ప్రైవేట్	మాగాణి	1755.000
16	ప్రైవేట్	మాగాణి	2200.000
14	ప్రైవేట్	మెట్ట	25.000
13	ప్రైవేట్	మెట్ట	76.000
39	ప్రైవేట్	మెట్ట	2024.000
40	ప్రైవేట్	మెట్ట	1063
		మొత్తం	**19410.000**
తాలూకా / మండలం: 2. ముదిగొండ			(గ్రామం: 1) గోకినేపల్లి
245	ప్రైవేట్	మెట్ట	3520.000
168	ప్రైవేట్	మెట్ట	835.000
167	ప్రైవేట్	మెట్ట	1037.000
169	ప్రైవేట్	మెట్ట	147.000
152	ప్రైవేట్	మెట్ట	417.000
151	ప్రైవేట్	మెట్ట	2892.000
149	ప్రైవేట్	మెట్ట	206.000
183	ప్రైవేట్	మెట్ట	7649.000
174	ప్రైవేట్	మెట్ట	737.000
182	ప్రైవేట్	మెట్ట	748.000
		మొత్తం	**18188.000**
తాలూకా / మండలం: 2. ముదిగొండ			(గ్రామం: 2) వెంకటాపురం
76/3	ప్రైవేట్	మెట్ట	81.000
76/2	ప్రభుత్వ	మెట్ట	14.000
76/1	ప్రైవేట్	మెట్ట	20.000
77	ప్రైవేట్	మెట్ట	164.000
75/3	ప్రైవేట్	మెట్ట	373.000
75/2	ప్రభుత్వ	మెట్ట	74.000
75/1	ప్రైవేట్	మెట్ట	686.000
74	ప్రైవేట్	మెట్ట	490.000
73	ప్రైవేట్	మెట్ట	378.000
72	ప్రైవేట్	మెట్ట	144.000
70	ప్రైవేట్	మెట్ట	140.000
71	ప్రైవేట్	మెట్ట	872.000
61	ప్రైవేట్	మెట్ట	4208.000
62	ప్రైవేట్	మెట్ట	4381.000
60	ప్రైవేట్	మెట్ట	386.000
59	ప్రైవేట్	మెట్ట	5216.000
54	ప్రైవేట్	మెట్ట	3465.000
55	ప్రైవేట్	మెట్ట	9642.000
56	ప్రైవేట్	మెట్ట	587.000
57	ప్రైవేట్	మెట్ట	14917.000
		మొత్తం	**46238.000**
తాలూకా / మండలం: 2. ముదిగొండ			(గ్రామం: 3) ముదిగొండ
360	ప్రైవేట్	మెట్ట	8434.479
361	ప్రైవేట్	మెట్ట	3809.533
362	ప్రైవేట్	మెట్ట	13355.000
363	ప్రైవేట్	మెట్ట	11765.448
338	ప్రైవేట్	మెట్ట	3112.000
339	ప్రైవేట్	మెట్ట	3633.874
337	ప్రైవేట్	మెట్ట	4310.000
365	ప్రైవేట్	మెట్ట	11737.000
366	ప్రైవేట్	మెట్ట	3700.000
335	ప్రైవేట్	మెట్ట	410.000
368	ప్రైవేట్	మెట్ట	2278.000
334	ప్రైవేట్	మెట్ట	400.000
367	ప్రైవేట్	మెట్ట	3038.000
373	ప్రైవేట్	మెట్ట	1115.000
369	ప్రైవేట్	మెట్ట	408.000
387	ప్రభుత్వ	మాగాణి	7100.000
279	ప్రైవేట్	మెట్ట	1450.000
278	ప్రభుత్వ	(ప్రభుత్వ భూమి)	151.000
276	ప్రైవేట్	మెట్ట	6500.000
275	ప్రైవేట్	మెట్ట	6480.000
282	ప్రైవేట్	మెట్ట	1450.000
283	ప్రైవేట్	మెట్ట	1089.000
284	ప్రైవేట్	మెట్ట	1680.000
285	ప్రైవేట్	మెట్ట	1680.000
291	ప్రైవేట్	మెట్ట	900.000
290	ప్రైవేట్	మెట్ట	570.000
286	ప్రైవేట్	మెట్ట	156.119
287	ప్రైవేట్	మెట్ట	8.375
288	ప్రైవేట్	మెట్ట	3546.000
260	ప్రైవేట్	మెట్ట	360.000
266	ప్రైవేట్	మెట్ట	124.821
263	ప్రైవేట్	మెట్ట	360.000
264	ప్రైవేట్	మెట్ట	6531.370
265	ప్రైవేట్	మెట్ట	110.000
255	ప్రైవేట్	మెట్ట	2000.000
254	ప్రైవేట్	మెట్ట	3140.000
253	ప్రైవేట్	మెట్ట	1370.000
252	ప్రైవేట్	మెట్ట	4660.000
262	ప్రైవేట్	మెట్ట	3240.000
257	ప్రైవేట్	మెట్ట	3590.722
		మొత్తం	**129753.741**
తాలూకా / మండలం: 2. ముదిగొండ			(గ్రామం: 4) సువర్ణపురం
311	ప్రైవేట్	మెట్ట	82.804
309	ప్రైవేట్	మెట్ట	4883.689
308	ప్రైవేట్	మెట్ట	7191.183
307	ప్రైవేట్	మెట్ట	11705.017
315	ప్రైవేట్	మెట్ట	1298.812
316	ప్రైవేట్	మెట్ట	5911.961
317/1	ప్రైవేట్	మెట్ట	20308.257
317/2	ప్రైవేట్	మెట్ట	1510.012
319	ప్రైవేట్	మెట్ట	2100.163
328	ప్రభుత్వ	మెట్ట	7276.401
327	ప్రైవేట్	మెట్ట	15232.924
326	ప్రైవేట్	మెట్ట	8594.644
325	ప్రైవేట్/ప్రభుత్వ	మెట్ట	12757.888
డ్రైన్	ప్రభుత్వ	మెట్ట	5947.922
322	ప్రైవేట్	మెట్ట / నాలా	16.500
324/1	ప్రైవేట్	మాగాణి	22.000
కాలువ	కాలువ	ప్రభుత్వ	3245.546
368/1	ప్రైవేట్	మెట్ట	16918.239
387	ప్రైవేట్	మెట్ట	15494.937
388/1	ప్రైవేట్	మెట్ట	1119.489
386	ప్రైవేట్	మెట్ట	7304.773
384	ప్రైవేట్	మెట్ట	12403.778
383/2	ప్రైవేట్	మెట్ట	3427.148
379/2	ప్రైవేట్	మెట్ట	2418.100
377	ప్రభుత్వ	మెట్ట	138.892
379/3	ప్రభుత్వ	(కాలువ)	47.165
378/2	ప్రైవేట్	మెట్ట	3125.534
378/3	ప్రభుత్వ	(కాలువ)	1963.529
378/1	ప్రైవేట్	మెట్ట	19968.747
		మొత్తం	**192416.055**
తాలూకా / మండలం: 3. ఖమ్మం (రూరల్)			(గ్రామం: 1) గుడిమల్ల
264	ప్రభుత్వ	(ప్రభుత్వ భూమి)	34962.607
265	ప్రైవేట్	మెట్ట	18780.334
269	ప్రైవేట్	మెట్ట	109.071
266	ప్రైవేట్	మెట్ట	1727.000
267	ప్రైవేట్	మెట్ట	1750.000
268	ప్రైవేట్	మెట్ట	3000.000
297	ప్రైవేట్	మెట్ట	8720.780
298	ప్రైవేట్	మెట్ట	10451.130
295	ప్రైవేట్	మెట్ట	13229.713
313	ప్రైవేట్	మెట్ట	59.800
312	ప్రైవేట్	మెట్ట	17405.000
316	ప్రైవేట్	మెట్ట	17607.000
320	ప్రైవేట్	మెట్ట	1015.000
315	ప్రైవేట్	మెట్ట	3007.342
322	ప్రైవేట్	మెట్ట	8909.435
		మొత్తం	**140734.212**
		పూర్తి మొత్తం	**580673.008**

[F. No. NHAI/PIU-KMM/DPR/LA/3A/2017]

రాజేష్ గుప్తా, డిప్యూటి సెక్రటరీ

సం/–
జాయింట్ కలెక్టర్ / కాంపిటెంట్ అథారిటీ
ల్యాండ్ ఎక్విజిషన్ (ఎన్.హెచ్.365ఎ) ఎన్‌హెచ్ఏఐ, ఖమ్మం.

టీఆర్ఎస్ భవన్‌కు బాంబు బెదిరింపు

వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌ను పేల్చివేస్తామంటూ శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది వెంటనే ఈ సమాచారాన్ని బంజారాహిల్స్ పోలీసులకు అందించడంతో భవన్‌కు దారి తీసే రహదారులతో పాటు చుట్టూ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం పోలీసులు భవన్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇదిలా ఉండగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి సెల్ నంబర్ ఆధారంగా అడ్రస్‌ను కనుగొన్న పోలీసులు అతడిని ఆదిలాబాద్ వాసిగా గుర్తించారు. ఎస్సార్‌నగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల నుండి ఫోన్ వచ్చినట్లు సెల్‌టవర్ ఆధారంగా తెలుసుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



సినిమా ప్రదర్శనలను నిలిపివేయడంతో బోసిపోయిన ఐమాక్స్



ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో మూతపడ్డ సంధ్య థియేటర్

ఆగిన సినిమా

హైదరాబాద్‌లో మూతపడిన సినిమా థియేటర్లు

- డిజిటల్ ప్రొవైడర్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా బంద్
- మద్దతు తెలిపిన థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల యాజమాన్యాలు
- గ్రేటర్‌లోని సుమారు 200 థియేటర్లలో నిలిచిన ప్రదర్శనలు
- బోసిపోయిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ఐమాక్స్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్

సాక్షి, హైదరాబాద్: ప్రతి శుక్రవారం కొత్త సినిమాలతో కళకళలాడే థియేటర్లు బోసిపోయాయి. సినిమా థియేటర్ల యజమానులు బంద్ పాటించడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో సినిమా ఆగిపోయింది. దక్షిణాది రాష్ట్రాల్లో భారంగా మారిన డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్స్ చార్జీలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ బంద్ కారణంగా.. నగరంలోని సుమారు 200 సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో ప్రదర్శనలు నిలిపేశారు. వీపీఎఫ్ క్రమంగా ఎత్తేయాలని, విరామ సమయంలో ప్రదర్శించే రెండు ప్రకటనలను సినిమా పరిశ్రమకు ఇవ్వాలనే డిమాండ్‌తో పంపిణీదారులు, ప్రదర్శనకారులు, నిర్మాతలు నిరవధిక బంద్‌కు దిగారు. దక్షిణ భారత సినీ పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు థియేటర్లు సంపూర్ణ మద్దతునివ్వడంతో ఆర్టీసీ క్రాస్ రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కొత్తపేట్, సరూర్‌నగర్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, పంజగుట్ట తదితర ప్రాంతాల్లోని థియేటర్లు, మల్టీప్లెక్స్‌లు మూతపడ్డాయి. నిత్యం సందర్శకులు, ప్రేక్షకులతో కళకళలాడే నెక్లెస్ రోడ్ ఐమాక్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని థియేటర్లలో ప్రదర్శనలు నిలిపేయడంతో బోసిపోయాయి. పలు థియేటర్ల వద్ద ప్రదర్శనలు నిలిపేస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేశారు. శుక్రవారం హోలీ సందర్భంగా సెలవు కావడంతో మధ్యాహ్నం వరకు రంగుల్లో మునిగితేలిన యువత.. సాయంత్రం సినిమాకు వెళ్లే అవకాశం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యింది. థియేటర్లకు సమీపంలోని హోటళ్లు, చాట్ భండార్లు, టీ, జ్యూస్ సెంటర్లు, పాన్‌డబ్బాలు బోసిపోయి కన్పించాయి.

జేఏసీ నిర్ణయం మేరకే..

సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ జేఏసీ నిర్ణయం మేరకే థియేటర్లను మూసివేశాం. వారం పాటు థియేటర్లు మూసేసినా మేము సిబ్బందికి వేతనాలు ఇవ్వాల్సిందే. సర్వీస్ ప్రొవైడర్ల రేట్లు తగ్గిస్తే జేఏసీ నిర్ణయం మేరకు థియేటర్లను మళ్లీ తెరిచేందుకు అవకాశం ఉంటుంది.

– రామారావు, సంధ్య 70 ఎంఎం థియేటర్ మేనేజర్

వీకెండ్‌లో వినోదం కోల్పోయాం..

శుక్రవారం హోలీ, శని, ఆదివారాల్లో సెలవు రావడంతో కుటుంబాలు, స్నేహితులతో కలసి థియేటర్లలో సినిమాకు వెళదామనుకున్నాం. కానీ మాలాంటి వారికి బంద్ వల్ల నిరాశే ఎదురైంది. వీకెండ్‌లో వినోదం కోల్పోయాం.

– కె.వంశీకృష్ణ, ప్రేక్షకుడు



శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న జాజుల తదితరులు

హక్కుల సాధనకు ఒక్కటై ఉద్యమిద్దాం

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల
- 'కేంద్ర–రాష్ట్ర బడ్జెట్‌లలో బీసీల వాటా'పై బీసీ సంఘాల సమావేశం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్రంలో బీసీలకు జనాభా ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా దక్కే వరకు బీసీలంతా ఒక్కటై ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ జేఏసీ ఏర్పాటు చేసి ప్రభుత్వాల మెడలు వంచి, రావాల్సిన వాటాను సాధించుకోవాలన్నారు. శుక్రవారం 'కేంద్ర–రాష్ట్ర బడ్జెట్‌లలో బీసీల వాటా' అనే అంశంపై జరిగిన సమావేశంలో 80 బీసీ కుల సంఘాలు, 20 బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ, ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న బీసీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రూ.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో 60 కోట్ల మంది బీసీలకు కేవలం రూ.982 కోట్లు కేటాయించారన్నారు. వీటితో చాక్లెట్లు, బిస్కెట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. బీసీ కులాలను జాగృతం చేసేందుకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా రథయాత్రను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో 50 ఎకరాల్లో బీసీ భవన్..

బీసీల జాబితాలో ఉన్న అన్ని కులాలకు 10 ఎకరాల భూమి, రూ.10 కోట్ల కేటాయింపు. మహాత్మ జ్యోతి బాపూలే పేరుతో హైదరాబాద్‌లో 50 ఎకరాల్లో బీసీ భవన్ ఏర్పాటు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా. బీసీ సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయింపులు. బీసీ కులాల ఫెడరేషన్లకు పాలక మండళ్లు. కులవృత్తుల వారికి ఫెడరేషన్ల ఏర్పాటు. ఎంబీసీ కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.వేయి కోట్లు విడుదల. బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంపు. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బీసీల రాజకీయ పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు.

గల్ఫ్ కార్మికులకు టీఆర్ఎస్ మొండిచెయ్యి

పీసీసీ ఎన్నారై విభాగం చైర్మన్ వినోద్

హైదరాబాద్: కువైట్‌లో ఇబ్బంది పడుతున్న పేద ప్రవాసీ కార్మికులకు ఉచితంగా విమాన టికెట్లు ఇప్పిస్తానని ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం వారికి మొండిచెయ్యి చూపిందని రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నారై విభాగం ఆరోపించింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎన్నారై విభాగం చైర్మన్ బి.ఎం.వినోద్‌కుమార్, కాంగ్రెస్ గల్ఫ్ ఎన్నారై విభాగం కన్వీనర్ దేవేందర్ రెడ్డి, ప్రవాసి సంక్షేమ వేదిక అధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడారు. గల్ఫ్ కార్మికులను ఆదుకుంటామని, వారి కోసం రూ.500 కోట్లు కేటాయిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక దానిని మరిచిపోయిందని ఆరోపించారు. గల్ఫ్ కార్మికుల కష్టాలు చూడలేక కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా నేతృత్వంలో ఎన్నారై బృందం గత నెల 16న కువైట్‌లో పర్యటించి, అక్కడి భారత రాయబార అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చేసిందన్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించిన వారికి జరిమానా, జైలుశిక్ష లేకుండా కార్మికులు తమ దేశాలకు వెళ్లిపోయే అవకాశం కల్పిస్తూ కువైట్ ప్రభుత్వం జనవరి 29 నుంచి ఫిబ్రవరి 22 వరకు క్షమాభిక్ష అవకాశం కల్పించిందని, విమాన చార్జీలను రూ.25 వేలకు పెంచడంతోభారత కార్మికులు స్వదేశానికి రాలేక అవస్థలు పడుతున్నారన్నారు. తమ బృందం అక్కడి అధికారులతో మాట్లాడటంతో క్షమాభిక్ష గడువును ఏప్రిల్ 22 వరకు పొడిగించినట్లు తెలిపారు. కార్మికులకు చార్జీలను కూడా తామే చెల్లించామని వెల్లడించారు.

ఒలింపియాడ్స్‌లో 'నారాయణ' సత్తా

సాక్షి, హైదరాబాద్: హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్, ఎడ్యుకేషన్ నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ రెండో దశ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఒకే ఒక విద్యార్థి ఎంపికైనట్లు నారాయణ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పి.సింధూర నారాయణ తెలిపారు. తమ విద్యార్థి వి.వి.సాయికీర్తన ఫలితాల్లో సత్తా చాటిందని ఆమె అభినందించారు. జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ ఫలితాల్లో సి.యశ్వంత్‌రెడ్డి, జి.సింధూజ, సీహెచ్.తనూజ టాప్ మార్కులు సాధించారన్నారు. అలాగే ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లో వి.సాయితేజ, ఎం.ఆదర్శ్‌రెడ్డి ఉత్తమ మార్కులు సొంతం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరంతా ముంబైలో జరిగే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంపునకు హాజరవుతారని పేర్కొన్నారు. స్కూల్ స్థాయిలో నిర్వహించే ఏ పోటీ పరీక్షల్లోనైనా తెలుగు రాష్ట్రాల్లో తమ విద్యార్థులే అగ్రస్థానంలో నిలుస్తున్నారన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు పోటీ పరీక్షలకు మెరుగైన శిక్షణ అందిస్తున్నట్లు సింధూర వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

మాయగాడికి మూడేళ్ల జైలు

సాక్షి, హైదరాబాద్: ఓ ప్రైవేట్ క్లబ్‌లో సభ్యత్వం ఇప్పిస్తామంటూ రూ.15 వేల చొప్పున వసూలు చేస్తూ మోసాలకు పాల్పడ్డ ముంబైకి చెందిన సర్వేష్ నిగమ్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1.1 లక్షలు జరిమానా చెల్లించాలని నాంపల్లి సీఐడీ కోర్టు తీర్పునిచ్చింది. శుక్రవారం ఈ మేరకు సీఐడీ అదనపు డీజీపీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2010లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ క్లబ్ పేరును ఉపయోగించుకొని అందులో సభ్యత్వం పేరుతో చాలామంది ఉద్యోగులకు ఇ–మెయిల్స్, మెసేజ్‌లు పంపించి మోసం చేశాడు. దీనిపై సీఐడీ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసింది.

11న 'పాత పెన్షన్' దీక్ష: కృష్ణకుమార్

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఈ నెల 11న ఉప్పల్ స్టేడియంలో లక్ష కుటుంబాలతో దీక్షను నిర్వహించనున్నట్లు సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణకుమార్ తెలిపారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పోస్టర్‌ను తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) కార్యాలయంలో ఆ సంఘం చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 6, 7 తేదీల్లో గెజిటెడ్ భవన్లో పెద్ద ఎత్తున మహిళలకు ఆటల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని టీజీవో అధ్యక్షురాలు మమత అన్నారు. ముఖ్యఅతిథిగా ఎంపీ కవిత, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

సాక్షి స్పోర్ట్స్
శనివారం 3-3-2018



జూనియర్ చీఫ్ సెలక్టర్ పదవికి వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా

జాతీయ జూనియర్ క్రికెట్ జట్టు చీఫ్ సెలక్టర్ పదవికి వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేశారు. రెండున్నరేళ్లుగా ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈ మాజీ పేసర్ శుక్రవారం తన రాజీనామా సమర్పించారు. వ్యక్తిగత కారణాలతో పాటు పరస్పర విరుద్ధ ప్రయోజనాల పరిధిలోకి రాకూడదనే ఉద్దేశంతో రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ అంశంపై బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ... 'ఇప్పటికైతే స్పష్టత లేదు కానీ... ప్రసాద్ ఐపీఎల్ ఫ్రాంచైజీతో జతకట్టే అవకాశాలు ఉన్నాయి. అందువల్లే అతను ఈ పదవికి రాజీనామా చేసి ఉండొచ్చు. విరుద్ధ ప్రయోజనాల అంశానికి తావివ్వకుండా ముందే ఈ నిర్ణయం తీసుకొని ఉంటాడు' అని తెలిపారు.

ఈ విజయంతో ఆగిపోను

ఒలింపిక్స్ పతకమే జీవిత లక్ష్యం

- ఈ ఏడాది కామన్వెల్త్, ఆసియా క్రీడలపై దృష్టి
- ఇప్పుడు తగిన గుర్తింపు దక్కింది
- 'సాక్షి'తో జిమ్నాస్ట్ బుద్దా అరుణ రెడ్డి



తల్లి సుభద్రతో ఆనందం పంచుకుంటూ...

పుష్కర కాలానికి పైగా ఆ అమ్మాయి తాను ఎంచుకున్న ఆటలో తీవ్రంగా శ్రమించింది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తన పోరాటాన్ని ఆపలేదు. తనను నడిపించిన నాన్న దూరమైనా ఆయన కోరుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింత కష్టపడింది. ఫ్లోర్‌పై, అన్ ఈవెన్ బార్స్‌పై కెరీర్ 'బ్యాలెన్స్' చేసుకుంటూ వెళ్లింది. కామన్వెల్త్ నుంచి ఆసియా క్రీడల వరకు, ఆసియా చాంపియన్‌షిప్ నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్ వరకు పాల్గొనడమే తప్ప పతకానికి చేరువ కాలేకపోయిన సమయంలోనూ పట్టు వదల్లేదు. ఎట్టకేలకు ఇప్పుడు ప్రపంచ కప్‌లో పతకంతో మెరిసిన బుద్దా అరుణ రెడ్డి విజయగాథ ఇది.

సాక్షి సిటీ బ్యూరో, హైదరాబాద్

ఆత్మరక్షణ కోసం నేర్చుకున్న క్రీడ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన అమ్మాయి 22 ఏళ్ల బుద్దా అరుణ. ఇటీవల జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో కాంస్య పతకం సాధించిన ఆమె ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా గుర్తింపు పొందింది. ఇంతటితో ఆగిపోకుండా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తానని ఆమె ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. అయితే తన కెరీర్ తుది లక్ష్యం మాత్రం ఒలింపిక్ పతకం మాత్రమే అని చెప్పింది. శుక్రవారం స్వస్థలం హైదరాబాద్‌కు చేరుకున్న 22 ఏళ్ల అరుణ తాజా విజయం, తన కెరీర్‌కు సంబంధించిన విశేషాల గురించి 'సాక్షి'తో చెప్పిన విశేషాలు ఆమె మాటల్లోనే...



అరుణ విన్యాసం

కెరీర్ ఆరంభంపై...

చార్టెడ్ అకౌంటెంట్ అయిన నాన్న నారాయణ రెడ్డికి ఆటలంటే కూడా ఆసక్తి. అయితే ముందుగా అమ్మాయికి ఆత్మరక్షణ కోసమంటూ నన్ను కరాటేలో చేర్పించారు. అయితే ఆ తర్వాత కరాటే మాస్టర్ బాల సుబ్రమణ్యం సూచనపై నేను జిమ్నాస్టిక్స్ వైపు మళ్లాను. ఎల్బీ స్టేడియంలో కోచ్‌లు స్వర్ణలత, రవీందర్, ఇప్పుడు బ్రిజ్ కిశోర్ మార్గ నిర్దేశనంలో నేను చాలా నేర్చుకున్నాను. ప్రాథమికాంశాల నుంచి వివిధ ఈవెంట్లలో పోటీ పడే వరకు అన్ని రకాలుగా శ్రమించాను. నేను మంచి ఫలితాలు సాధిస్తూ పోయాను. సబ్ జూనియర్ స్థాయి మొదలు ఇంటర్ యూనివర్సిటీ, సీనియర్ నేషనల్స్ వరకు వరుసగా పతకాలు సాధించాను. అయితే అంతర్జాతీయ స్థాయిలో చెప్పుకోదగ్గ ఫలితాలు రాకపోవడంతో నాకు పెద్దగా గుర్తింపు లభించలేదు.

సీనియర్ స్థాయిలో ఫలితాలపై...

జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ అనేక పతకాలు గెలుచుకున్నాను. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) కూడా నాకు అండగా నిలిచింది. దాంతో అంతర్జాతీయ టోర్నీలలో వరుసగా పాల్గొన్నాను. ముఖ్యంగా 2014లో జరిగిన కామన్వెల్త్, ఆసియా క్రీడలు, 2013లో ప్రపంచ చాంపియన్‌షిప్, గత ఏడాది ఆసియా చాంపియన్‌షిప్ వాటిలో ముఖ్యమైనవి. దురదృష్టవశాత్తూ వీటిలో పతకానికి చేరువగా రాలేకపోయాను. అయితే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలలో పాల్గొనడం వల్ల నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. నా స్థాయి గురించి తెలుసుకొని తప్పులు దిద్దుకునేందుకు ఎంతో ఉపయోగపడింది.

ప్రపంచ కప్ పతకంపై...

నేను ఈ టోర్నీ కోసం ప్రత్యేకంగా తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్)లో సిద్ధమయ్యాను. ఈ శిక్షణ కోసం గ్రీన్‌కో గ్రూప్‌తో పాటు వ్యాపారవేత్త, మాజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ కూడా ఆర్థికంగా చాలా సహాయ పడ్డారు. టోర్నీలో నేను ఎలాంటి ఒత్తిడికి గురి కాలేదు. వాల్ట్ ఈవెంట్‌లో నా సహజ శైలిలోనే ఆడాను. కొన్ని విన్యాసాలు కష్టంగా ఉన్నా... సుదీర్ఘ కాలంగా అదే సాధన కాబట్టి కొత్తగా అనిపించలేదు. పతకం గెలుచుకున్న క్షణాన ఎంతో గర్వ పడ్డాను. చాలా ఉద్వేగానికి లోనయ్యాను. తర్వాతి రోజు ఫ్లోర్ విభాగంలో కూడా బాగానే రాణించినా చివరకు పతకం మాత్రం దక్కలేదు. జిమ్నాస్టిక్స్‌కు ఉత్తర భారతంలో చాలా ప్రాధాన్యత ఉంది. మన దక్షిణాదిలో దీనికి పెద్దగా గుర్తింపు లేదనే చెప్పాలి. రియో ఒలింపిక్స్‌లో దీపా కర్మాకర్ తన ప్రతిభను కనబరచడంతో అందరి దృష్టి ఆమెపై పడింది. నేను కూడా అలాంటి గుర్తింపునే కోరుకున్నాను. ఈ పతకంతో నేను ఏంటో అందరికీ తెలిసింది. మున్ముందు కూడా ఇలాంటి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నా. ప్రభుత్వం నుంచి జిమ్నాస్టిక్స్‌కు ప్రోత్సాహం ఉంటే పెద్ద సంఖ్యలో ఆటగాళ్లు రావడంతో పాటు మంచి ఫలితాలు సాధించవచ్చు.

తర్వాతి లక్ష్యాలపై...


వచ్చే నెలలో కామన్వెల్త్ క్రీడలు, ఆ తర్వాత ఇదే ఏడాది ఆసియా క్రీడలు కూడా ఉన్నాయి. వీటిలో పతకాలు గెలుచుకోవడంపైనే ప్రస్తుతం నా దృష్టి. ఆదివారమే శిక్షణ కోసం తిరిగి తాష్కెంట్ వెళ్లిపోతున్నాను. మరోసారి మంచి ఫలితం రాబడతాననే నమ్మకముంది. అయితే ఏ క్రీడాకారిణికైనా అంతిమ లక్ష్యం ఒలింపిక్స్ పతకం సాధించడమే. నేను కూడా దాని గురించే కలలుగంటున్నాను. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలని, అందులో పతకం నెగ్గాలనే లక్ష్యంతో ఉన్నాను. అందుకోసం ఎంతయినా కష్టపడతా. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పథకం 'టాప్'లో ఉండటంతో ఆర్థికపరంగా కూడా పరిస్థితి కొంత మెరుగైంది.

నాన్న మరణం తర్వాత...


నేను ఇంకా కెరీర్‌లో నిలదొక్కుకోక ముందే నాన్న 2010లో అకస్మాత్తుగా చనిపోవడం నన్ను కలచివేసింది. ఇక ఆటను కొనసాగించడం కష్టమనిపించింది. నాన్న ఉన్నంత వరకు నేను చాలా ధైర్యంగా ఉన్నాను. నాన్న అండ, ప్రేమ, ఆప్యాయతతో ధైర్యంగా అన్ని ఆటలు ఆడాను. ఆ క్షణాన నేను ఓ బలమైన శక్తిని కోల్పోయాను అనిపించింది. అప్పటి నుంచి నాకు కష్టాలు చాలా ఎదురయ్యాయి. నాన్న ఉన్నప్పుడు ప్రాక్టీస్‌కి, గేమ్స్‌కి, శిక్షణ శిబిరాలకు తనే స్వయంగా తీసుకెళ్లేవారు. నాన్న చనిపోయాక నేను ఒక్కదానినే ట్రావెల్ చేస్తుంటే చాలా కష్టంగా ఉండేది. నా శిక్షణ, సాధన విషయాల్లో ఎన్ని డబ్బులు ఖర్చు అయ్యాయనే విషయాలు కూడా నాకు తెలీదు, నాన్న ఎప్పుడూ చెప్పలేదు. నాన్న మరణానంతరం ఆర్థిక సమస్యలు తలెత్తడంతో మానసికంగా చాలా ఇబ్బంది పడ్డాను. నేను విజయం సాధించిన ప్రతిసారీ నాన్న ఉండి ఉంటే ఎంత సంతోషించేవారో అని మా అమ్మ సుభద్ర గుర్తు చేసుకుంటూ ఉంటుంది. నాన్న మరణించాక అక్క పావని, బావ జనార్ధన్ రెడ్డి నిరంతరం ప్రోత్సహించి నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. కుటుంబసభ్యుల అండతో ఎన్ని సమస్యలు వచ్చినా ఆట నుంచి వెనక్కి వెళ్లాలనే ఆలోచన మాత్రం ఎప్పుడూ రాలేదు.

నవజ్యోత్ కౌర్ 'పసిడి' పట్టు

- ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్
- సాక్షి మలిక్‌కు కాంస్యం



నవజ్యోత్ కౌర్



సాక్షి మలిక్

బిష్కెక్ (కిర్గిస్తాన్): భారత మహిళా రెజ్లర్ నవజ్యోత్ కౌర్ కొత్త చరిత్ర లిఖించింది. ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా గుర్తింపు పొందింది. శుక్రవారం జరిగిన మహిళల ఫ్రీస్టయిల్ 65 కేజీల విభాగం ఫైనల్లో 28 ఏళ్ల నవజ్యోత్ కౌర్ 9–1తో మియు ఇమాయ్ (జపాన్)పై ఘనవిజయం సాధించింది. ఈ విభాగంలో ఆరు ఎంట్రీలు రావడంతో ముగ్గురు చొప్పున రెజ్లర్లను రెండు గ్రూప్‌ల్లో చోటు కల్పించారు. లీగ్ దశ తర్వాత రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు సెమీఫైనల్‌కు చేరారు. లీగ్ తొలి బౌట్‌లో నవజ్యోత్ 10–0తో బాల్తనియ జోవా (ఉజ్బెకిస్తాన్)ను ఓడించి రెండో బౌట్‌లో మియు ఇమాయ్ చేతిలో ఓడిపోయింది. అయితే తన గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచి సెమీఫైనల్ బౌట్‌లో ఈ పంజాబ్ రెజ్లర్ 2–1తో ఎన్కిబాయెర్ (మంగోలియా)ను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్లో మియు ఇమాయ్‌ను ఓడించి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. ఐదోసారి ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న నవజ్యోత్ పసిడి పతకం నెగ్గడం ఇదే తొలిసారి. గతంలో ఆమెకు రజతం (2013లో), కాంస్యం (2011లో) లభించాయి. మరోవైపు సాక్షి మలిక్ 62 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. తొలి రౌండ్‌లో సాక్షి చైనా రెజ్లర్ జియోజువాన్ లువో చేతిలో ఓడిపోయింది. లువో ఫైనల్‌కు చేరడంతో సాక్షికి కాంస్య పతకం కోసం నిర్వహించే 'రెప్‌చేజ్'' రౌండ్‌లో పోటీపడే అవకాశం దక్కింది. 'రెప్‌చేజ్' తొలి రౌండ్‌లో 10–0తో జియె చోయ్ (కొరియా)ను ఓడించిన సాక్షి... కాంస్య పతక పోరులో 10–7తో కసిమోవా (కజకిస్తాన్)పై గెలిచింది.

విశ్వవిజేత కార్ల్‌సన్‌పై లలిత్‌బాబు గెలుపు





సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ చెస్ గ్రాండ్‌మాస్టర్ లలిత్‌బాబు సంచలనం సృష్టించాడు. ఆన్‌లైన్ టోర్నమెంట్ చెస్ ప్రో లీగ్‌లో భాగంగా ప్రపంచ చాంపియన్, నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో జరిగిన గేమ్‌లో లలిత్‌బాబు గెలుపొందాడు. ఢిల్లీ డైనమైట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న లలిత్ బాబు 86 ఎత్తుల్లో కార్ల్‌సన్ (నార్వే నోమ్స్)ను ఓడించాడు. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ డైనమైట్ 11.5–4.5తో నార్వే నోమ్స్‌ను ఓడించి ప్లే ఆఫ్ దశకు అర్హత సాధించింది.

దక్షిణాఫ్రికా 162 ఆలౌట్

డర్బన్: పేసర్ మిచెల్ స్టార్క్ (5/34), స్పిన్నర్ నాథన్ లయన్ (3/50) ధాటికి ఆస్ట్రేలియాతో ఇక్కడ జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో చేతులెత్తేసింది. డివిలియర్స్ (71 నాటౌట్; 11 ఫోర్లు) మినహా మరెవరూ రాణించకపోవడంతో ఆతిథ్య జట్టు 162 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఆసీస్‌కు 189 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 225/5తో శుక్రవారం రెండో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 351 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (96; 13 ఫోర్లు, ఒక సిక్స్) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. సఫారి బౌలర్లలో కేశవ్ మహరాజ్ (5/123), ఫిలాండర్ (3/59) రాణించారు.

భారత్ X అర్జెంటీనా

ఇఫో(మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో ఈసారి పతకం నెగ్గాలనే లక్ష్యంతో భారత్ బరిలోకి దిగుతోంది. శనివారం మొదలయ్యే ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ అర్జెంటీనాతో భారత్ తలపడుతుంది. గతంలో సర్దార్ సింగ్ నాయకత్వంలో ఈ టోర్నీలో ఆడిన మూడుసార్లూ భారత్ పతకంతో తిరిగి వచ్చింది. 2008లో సర్దార్ కెప్టెన్సీలో టీమిండియా రజతం... 2015లో కాంస్యం, 2016లో రజతం గెలుపొందింది. భారత్‌తోపాటు అర్జెంటీనా, మలేసియా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఐర్లాండ్ ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి.

మధ్యాహ్నం గం. 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచ స్నూకర్ కప్ విజేత భారత్



మానన్ పంకజ్

దోహా: తొలిసారి నిర్వహించిన ప్రపంచ స్నూకర్ కప్ టీమ్ ఈవెంట్‌లో భారత్–1 జట్టు టైటిల్ సొంతం చేసుకుంది. శుక్రవారం దోహాలో జరిగిన ఫైనల్లో పంకజ్ అద్వానీ–మానన్ చంద్రలతో కూడిన భారత్ 3–2తో మొహమ్మద్ ఆసిఫ్–బాబర్ మసీ సభ్యులుగా ఉన్న పాకిస్తాన్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో మానన్ చంద్ర 24–73తో బాబర్ చేతిలో... రెండో మ్యాచ్‌లో పంకజ్ అద్వానీ 56–61తో ఆసిఫ్ చేతిలో ఓడిపోవడంతో భారత్ 0–2తో వెనుకబడింది. అయితే మూడో మ్యాచ్‌లో పంకజ్–మానన్ చంద్ర ద్వయం 72–47తో ఆసిఫ్–బాబర్ జంటపై గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నాలుగో మ్యాచ్‌లో పంకజ్ 106–20తో బాబర్‌పై... ఐదో మ్యాచ్‌లో మానన్ చంద్ర 56–20తో ఆసిఫ్‌పై నెగ్గడంతో భారత్ విజయం ఖాయమైంది.

లీగ్‌లు లేకే ఫుట్‌బాల్ డీలా...

దేశంలో క్రీడా సంస్కృతి పెరగాలి ● భారత కెప్టెన్ విరాట్ కోహ్లి మనోగతం



పనాజీ: 'ఇతర క్రీడలను ప్రోత్సహించడంలో నాకెలాంటి భేషజం లేదు. ప్రముఖ లీగ్‌లు లేనందుకే భారత్‌లో ఫుట్‌బాల్‌కు క్రికెట్ స్థాయిలో ప్రాచుర్యం దక్కలేదని' భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ సహ యజమాని అయిన కోహ్లి... ఆ జట్టు ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పనాజీ వచ్చాడు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్‌పై తన ఆపేక్షతో పాటు పలు అంశాలపై అభిప్రాయాలు వెలిబుచ్చాడు. 'కేవలం ఇష్టంతోనే ఫుట్‌బాల్ లీగ్‌లో పెట్టుబడి పెట్టా. ఇందులో వ్యాపార దృక్పథం లేదు. భారత్‌లో ఫుట్‌బాల్ విస్తృతికి ఐఎస్‌ఎల్ ప్రేరణగా నిలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా దీనిపై మాట్లాడుతున్నారు. దేశంలోని ప్రతి ఒక్కరు అన్ని క్రీడల గురించి ఆసాంతం తెలుసుకుని, సమానంగా ఆదరిస్తుంటే చూడాలనేది నా జీవిత స్వప్నం. రానున్న 10–15 ఏళ్లలో దానిని మనమందరం చూస్తాం. ఏదైనా క్రీడ విశ్వవ్యాప్తం కావాలంటే లీగ్‌లను మించినవి లేవు. కీలక స్థాయిల్లో పటిష్ట లీగ్‌లు లేకపోవడమే మన దగ్గర ఫుట్‌బాల్‌కు ఆదరణ కొరవడటానికి కారణం. మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ప్రజల్లో చైతన్యం తెస్తుంది' అని కోహ్లి అన్నాడు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792



బంగారు
ఆభరణాలు కొనండి
మరియు అదే బరువుకి
వెండిని ఉచితంగా
పొందండి
1GM
ఉచిత బంగారం నాణెం
₹50,000 మరియు అంతకంటే ఎక్కువ విలువ చేసే
డైమండ్ మరియు పోల్కి ఆభరణాల ప్రతి కొనుగోలు పై
0%
మినహాయింపు
బంగారం ఎక్స్ఛేంజ్ పై
*Conditions apply
SBI Card
Make life simple
Extra 5% Cashback* with SBI Credit Cards.
*Min. trxn: ₹25,000; Max Cashback: ₹2,500 per card account. Validity: 3-11 Mar '18. T&C Apply.
ఒక సంవత్సరం ఉచిత బీమా
జీవితాంతం ఉచితంగా నిర్వహణ
బై-బ్యాక్ గ్యారంటీ
ఉత్తమమైన ధరకు గ్యారంటీ
www.joyalukkas.com
Joyalukkas
World's favourite jeweller
HYDERABAD • KUKATPALLY • VIJAYAWADA • CHITTOOR • GUNTUR • NELLORE • ONGOLE • VISAKHAPATNAM • KAKINADA
NIZAMABAD • WARANGAL • KHAMMAM • KADAPA • RAJAHMUNDRY • TIRUPATI • KARIMNAGAR • ANANTAPUR • KURNOOL
140 SHOWROOMS AROUND THE WORLD • OPEN ON SUNDAYS